ఆంధ్రభూమి

BEST OF THAILAND
With 1N SRILANKA FREE
GROUP DEPARTURE ON 28JAN'18
INR 28,999* Per Person.
Above cost includes : 4Nights / 5Days
Airfare ex Hyderabad on Srilankan Airlines / Airport Taxes.
Airport transfers / 2N Pattaya - 1N Bangkok - 1N Negambo
Stay in 3* Hotel with Breakfast / Coral island tour with lunch
City tour of Bangkok / City tour of Colombo.
*Terms and conditions apply:
Booking First come basis only / Govt Taxes extra.
Visa charges extra / Rates are subject to change.
Contact us @ Hyd office :
040 23311495 / 9553304546.
SriLankan Holidays

సంపుటి: 29 . సంచిక: 216 | విజయవాడ సిటీ | హైదరాబాద్, విశాఖపట్నం, విజయవాడ, రాజమహేంద్రవరం, అనంతపురం, కరీంనగర్, నెల్లూరు | www.andhrabhoomi.net | శుక్రవారం 5 జనవరి, 2018 | 20 పేజీలు | ధర: ₹3.00

సేవలకు జన్మభూమి మిన్న

• ప్రజా చైతన్యంతో అద్భుత ఫలితాలు • 'జన్మభూమి-మాఊరు'పై సీఎం చంద్రబాబు

ఆంధ్రభూమి ప్రత్యేక ప్రతినిధి

అమరావతి, జనవరి 4: 'ప్రజలకు మెరుగైన సేవలు అందించడానికి జన్మభూమి కన్నా మెరుగైన వేదిక లేదు, ప్రజలను చైతన్యపరచడం చాలా కష్టం, కానీ ఒకసారి అలవాటైతే జన చైతన్యం మన సంస్కృతిలో భాగం అవుతుంది. అలాంటి చైతన్యంతోనే అద్భుత ఫలితాలు సాధ్యం' అని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. ఆయన గురువారం తన నివాసం నుంచి 3వ రోజు 'జన్మభూమి-మాఊరు' నిర్వహణపై కలెక్టర్లు, అధికారులు, ప్రజాప్రతినిధులతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. రకరకాల వ్యక్తులు వేర్వేరు అజెండాలతో గ్రామసభలకు వస్తారంటూ, ఎవరు ఏ ఉద్దేశాలతో వచ్చినా సంయమనం పాటించాలని అధికారులకు సూచించారు. 1,89,171 రేషన్ కార్డులను కొత్తగా అందిస్తున్నామని, గతంలో ఆమోదం పొంది, పంపిణీ చేయని మరో 57వేల కార్డులు కూడా అందజేస్తున్నామని, మొత్తం 2.46లక్షల రేషన్ కార్డులు ఈ జన్మభూమిలో పంపిణీ చేస్తున్నట్లుగా ప్రకటించారు. నియోజకవర్గానికి 2వేల చొప్పున 4లక్షల పెన్షన్లు కొత్తగా అందజేస్తామన్నారు.

'సమస్యల పరిష్కారం ఎంత ముఖ్యమో, ప్రజల్లో సంతృప్తి తీసుకురావడం అంతే ముఖ్యం. బాధ్యతగా, సమన్వయంతో అన్ని శాఖలూ పనిచేయాలి. రాజకీయ, అధికార యంత్రాంగాలు కలిసి పనిచేస్తే ప్రజల్లో సంతృప్తి సాధ్యం' అని సీఎం అన్నారు. పశువైద్య శిబిరాల నిర్వహణపై ప్రజల్లో సంతృప్తి 50 శాతం ఉందంటూ, ఆ శాఖాధికారులు, సిబ్బంది మరింత చురుగ్గా పాల్గొనాలని సూచించారు. జన్మభూమిలో మీరు పాల్గొన్నారా? అంటే 47 శాతం అవునని, 32 శాతం లేదని, 21 శాతం జరగలేదని తనతో చెప్పినట్లు సీఎం తెలిపారు. జన్మభూమికి అధికారులు హాజరయ్యారా? అంటే 90 శాతం అవునని, 10 శాతం లేదని తెలిపారు. వివిధ అంశాలాపై అధికారులు అవగాహన కల్పించారా అన్న ప్రశ్నకు 72 శాతం అవునని, 22 శాతం లేదని, 6 శాతం తెలియదని చెప్పారు. అధికారుల స్పందన బాగుందా అని అడిగితే 54 శాతం అవునని, 36 శాతం లేదని, 10 శాతం తెలియదని పేర్కొన్నారు. సాధికార మిత్రలు పాల్గొన్నారా అన్న ప్రశ్నకు 48 శాతం అవునని, 52శాతం లేదని తెలిపారు. జన్మభూమిలో జరిగిన డిబేట్ అంశం అర్థమైందా? అని అడిగితే 88 శాతం అవునని, 12 శాతం లేదని జవాబిచ్చారు. పింఛన్లు అందరికీ అందుతున్నాయా? అన్న ప్రశ్నకు 64 శాతం అవునని, 36 శాతం లేదని తెలిపారు. రేషన్ కార్డులు అందరికీ ఉన్నాయా అన్న ప్రశ్నకు 65 శాతం అవునని, 35 శాతం లేదని చెప్పారు. చంద్రన్న బీమా ఎలా జరుగుతోందన్న ప్రశ్నకు 63 శాతం అవునని, 37 శాతం లేదని చెప్పారు. దీన్నిబట్టి పింఛన్లు, రేషన్ కార్డులు ఇంకా ఆశిస్తున్న వారి సంఖ్య ఎక్కువగానే ఉన్నట్లుగా తెలుస్తోందని ముఖ్యమంత్రి అన్నారు. అర్జీల పరిష్కారం బాగుందా అన్న ప్రశ్నకు 48 శాతం అవునని, 52 శాతం లేదని జవాబిచ్చారు. దీన్నిబట్టి ఫిర్యాదుల పరిష్కార వేగం మరింత పుంజుకోవాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. గ్రామసభల వద్ద ఫొటో ఎగ్జిబిషన్లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఆ ఊళ్లో నిర్మించిన సిమెంట్ రోడ్లు, తవ్విన పంట కుంటలు, ఇతర అభివృద్ధి కార్యక్రమాల ఫొటోలు ప్రదర్శించాలని కోరారు. దీనివల్ల ఆ ఊళ్లో గత మూడున్నరేళ్లలో ఏం చేశామో, ఇంకా ఏం చేయాలనే దానిపై ప్రజల్లో అవగాహన వస్తుందన్నారు. కర్నూలు జిల్లాలో కేవలం 6మీటర్ల లోపే భూగర్భ జలాలు ఉన్నాయని, గోదావరి జిల్లాల కంటే ఎగువన గ్రౌండ్ వాటర్ కర్నూలులో ఉండటం ఊహాతీత అంశమంటూ ఇది జలసంరక్షణ చర్యల ఫలితం, 'నీరు-ప్రగతి' సాధించిన విజయంగా ముఖ్యమంత్రి పేర్కొన్నారు. 7వ తేదీన అన్ని పట్టణాలు, మేజర్ పంచాయతీల్లో 5కె రన్ నిర్వహించాలన్నారు. గ్రామసభలకు హాజరయ్యే సిబ్బందికి వర్కింగ్ లంచ్ ఇవ్వాలని, ప్రజలకు పులిహోర ప్యాకెట్లు పంపిణీ చేయాలని ఆదేశించారు. టెలీకాన్ఫరెన్స్‌లో రాష్ట్ర మంత్రులు చింతకాయల అయ్యన్నపాత్రుడు, జవహర్, ప్రభుత్వ సలహాదారు పరకాల ప్రభాకర్, వ్యవసాయ, గ్రామీణ, పట్టణాభివృద్ధి, ప్రణాళిక, ఆర్థికశాఖ, రియల్‌టైం గవర్నెన్స్ అధికారులు రాజశేఖర్, జవహర్‌రెడ్డి, సంజయ్‌గుప్తా, సునీత, అహ్మద్‌బాబు పేదరిక నిర్మూలన సంస్థ సీఈవో కృష్ణమోహన్, వివిధ జిల్లాల కలెక్టర్లు, నోడల్ అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

3



ఇచ్ఛాపురంలో గురువారం జరిగిన జన్మభూమి-మావూరులో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి చంద్రబాబు

ముందుంది పరీక్షా కాలం

పథకాల లక్ష్యాలు చేరుకోవాలి

కలెక్టర్లకు చంద్రబాబు ఆదేశం

కలియుగం - 5119
శాలివాహన శకం - 1939

శ్రీ చాంద్రమాన హేమలంబ నామ సం॥
దక్షిణాయణం, హేమంత ఋతువు,
పుష్యమాసం, కృష్ణపక్షం; తిథి: శుద్ధ
చవితి రా.12.16; నక్షత్రం: ఆశ్రేష ఉ.8.53;
వర్జ్యం: రా. 8.20 నుండి 9.51 వరకు
విశేషాలు: సంకష్టహర చతుర్థి
దుర్ముహూర్తం: ఉ.8.24 నుండి 9.12 వరకు,
తిరిగి మ.12.24 నుండి 1.12 వరకు
రాహుకాలం: ఉ.10.30 నుండి 12.00 వరకు



కుప్పం నుంచే విజయ యాత్ర

పార్టీ శ్రేణులకు వైఎస్ జగన్ పిలుపు

సదుం (చిత్తూరు), జనవరి 4: 'వైకాపా గెలుపు కుప్పం నియోజకవర్గం నుంచి మొదలు కావాలని ఆ పార్టీ వైఎస్ జగన్మోహన్ రెడ్డి కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఆయన చేస్తున్న పాదయాత్ర గురువారం 52వ రోజుకు చేరుకుంది. చిత్తూరు జిల్లా సదుం మండలం కారావాండ్లపల్లెలో గురువారం ఉదయం పాదయాత్ర ప్రారంభమైంది. సదుం మండలంలోకి ప్రవేశించగానే రాజంపేట ఎంపి మిథున్‌రెడ్డి, పుంగనూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డితోపాటు పలువురు వైకాపా ఎమ్మెల్యేలు ఘనస్వాగతం పలికారు. పాలమంద,పెద్దూరులల్లో పార్టీజెండాను జగన్ ఆవిష్కరించారు. అనంతరం జరిగిన బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ, టీడీపీ అధినేత, ఏపీ సిఎం చంద్రబాబు ప్రాతినిధ్యం వహిస్తున్న కుప్పం నుంచే విజయ ఢంకాను మోగించాలన్నారు. బీసీలను సులువుగా మోసగించవచ్చని బాబు కుప్పం నియోజకవర్గాన్నే ఎన్నుకున్నారని, నిజానికి ఆ వర్గాలకు ఆయన చేసిందేమీ లేదన్నారు. కుప్పంలో ప్రజలు వచ్చే ఎన్నికలల్లో అధికార పార్టీకి డిపాజిట్లు లేకుండా చేస్తేనే బిసిలు బాగుపడతారని అన్నారు. తమ పార్టీ ప్రవేశపెట్టబోయే నవరత్నలాంటి పథకాలతోనే నిరుపేదలు, బిసిలకు మేలు జరుగుతుందని జగన్ అన్నారు. ఇక్కడి నుంచి పార్టీ నేత చంద్రమౌళిని గెలిపిస్తే తన క్యాబినెట్‌లో కుర్చోబెట్టి కుప్పంను చంద్రబాబు కంటే పదిరెట్లు - మిగతా 7వ పేజీలో

వీసా.. నిరాశ

- ఎంబసీ ధ్రువీకరణ లేక 17 వేల వీసాలు తిరస్కృతి
- అమలు కాని ఈ-మైగ్రేషన్ స్కీమ్
- విశాఖలో రిక్రూట్‌మెంట్‌కు రాని గల్ఫ్ దేశాలు
- అవస్థలు పడుతున్న వలసదారులు



ఆంధ్రభూమి బ్యూరో

విశాఖపట్నం, జనవరి 4: విశాఖ నుంచి గల్ఫ్ దేశాలకు వెళ్లాల్సిన కార్మికులు, ఉద్యోగులు వీసాలు దొరక్క ఇబ్బంది పడుతున్నారు. వీరికి వీసా దొరకకపోవడానికి అనేక కారణాలు ఉన్నాయి. గత ఏడాది విశాఖ నుంచి గల్ఫ్ దేశాలకు వెళ్లడానికి వీసాకోసం దరఖాస్తు చేసుకున్నవారిలో 17000 మందికి వీసాలు తిరస్కరించడం గమనార్హం. దీనికి సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. గల్ఫ్ దేశాల్లో ఉద్యోగాలు, కూలి పనులు చేసుకునేందుకు ఏటా ఆంధ్రప్రదేశ్ నుంచి లక్షలాది మంది వెళుతున్నారు. ముఖ్యంగా ఉత్తరాంధ్ర, ఉభయ గోదావరి జిల్లాల నుంచే వెళ్లేవారి సంఖ్య అధికంగా ఉంటుంది. గల్ఫ్ దేశాలకు వెళ్లాలంటే, ఇండియన్ ఎంబసీ ధ్రువీకరణ తప్పనిసరిగా కావాలని విశాఖ పాస్‌పోర్ట్ కార్యాలయంలో నిబంధన విధిస్తున్నారు. అయితే, ఇండియన్ ఎంబసీ ధ్రువీకరణ స్థానే ఈ-మైగ్రేషన్ పాలసీని రెండేళ్ల కిందటే అమల్లోకి తీసుకువచ్చింది. అయితే, విశాఖ పాస్‌పోర్టు కార్యాలయంలో దీనిని అంగీకరించడం లేదు. దీంతో గల్ఫ్‌లో ఉద్యోగాలు వచ్చినా, వీసాలు రాక చాలా మంది అవకాశాలు కోల్పోతున్నారు. అదేవిధంగా రాష్ట్రంలో విశాఖ స్టీల్‌ప్లాంట్, హెచ్‌పీసీఎల్, షిప్‌యార్డ్, ఐఓసిఎల్, ఓఎన్‌జీసీ తదితర ప్రముఖ కంపెనీలు ఉన్నాయి. ఈ రంగానికి చెందిన నిపుణులకు గల్ఫ్ దేశాల్లో మంచి అవకాశాలు ఉన్నాయి. నైపుణ్యం కలిగిన ఉద్యోగులను రిక్రూట్ చేసుకునేందుకు గల్ఫ్ దేశాలు సిద్ధంగా ఉన్నా, గల్ఫ్ ఆథరైజ్డ్ మెడికల్ సెంటర్ విశాఖలో లేకపోవడం వలన చాలా మంది ఇమ్మిగ్రేషన్ వరకూ కూడా వెళ్లలేకపోతున్నారు. గల్ఫ్ దేశాల్లో కొన్ని కంపెనీలు మన రాష్ట్రం నుంచి వచ్చే ఉద్యోగులకు, కార్మికులకు సేఫ్టీ కోర్స్ సర్టిఫికెట్స్ కావాలని కోరుతున్నాయి. దీనికి సంబంధించిన సర్టిఫికెట్ కోర్సులు మన రాష్ట్రంలో లేకపోవడం వలన కూడా అవకాశాలను జార విడుచుకోవలసి వస్తోంది. కువాయిట్‌కు వెళ్లాలనుకునే వారు విధిగా వైద్య పరీక్షలు చేయించుకోవాలి. ఇందుకోసం రూ.12000 ఖర్చు చేయాల్సి వస్తోంది. పేద కూలీలు ఇంత పెద్ద మొత్తాన్ని భరించలేకపోతున్నారు.

పెరిగిన వలసలు

గల్ఫ్ దేశాలకు ఇటీవల కాలంలో వలసలు గణనీయంగా పెరిగాయి. కేరళ నుంచి ఏడాదికి 30 నుంచి 40 వేల మంది వెళుతుండగా, ఆంధ్రప్రదేశ్ నుంచి 40 నుంచి 50 వేల మంది వెళుతున్నారు. ఈ సంఖ్య ఇంకా పెరగాల్సి ఉంది. అయితే, ఏపీలోని పాస్‌పోర్ట్ కార్యాలయాల్లో నిబంధనల వలన గల్ఫ్ దేశాల నుంచి కంపెనీలు పెద్దగా ఏపీకి రావడం లేదు. ఒకవేళ వాళ్లు ఇక్కడ ఉద్యోగులను రిక్రూట్ చేసుకున్నా, వారికి వీసా రాకపోతే, రిక్రూట్ చేసినా ప్రయోజనం లేదని భావించి కంపెనీలు ఇక్కడికి రావడం లేదని తెలిసింది. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే చొరవ తీసుకుని, గల్ఫ్ దేశాలకు వెళ్లే వారికి వీసా మంజూరు చేసే నిబంధనలను సరళతరం చేయాల్సి ఉంది. దీనివలన చాలా మంది కార్మికులు, ఉద్యోగాలు అవకాశాలు కోల్పోవలసి వస్తోంది.

అధికారాలకు కత్తెర!

- దుర్గగుడి ఈవో బదిలీకి రంగం సిద్ధం
- దీర్ఘకాలిక సెలవులో ప్రధాన అర్చకుడు
- పాలకమండలితో ఎమ్మెల్సీ బుద్దా భేటీ
- తాంత్రిక పూజల వివాదంలో మలుపు

ఆంధ్రభూమి బ్యూరో



విజయవాడ, జనవరి 4: తాంత్రిక పూజల ఆరోపణల నేపథ్యంలో ఇక్కడి దుర్గగుడి ఈవో సూర్యకుమారి అధికారాలకు ప్రభుత్వం కత్తెర వేసింది. తదుపరి ఆదేశాలు జారీ అయ్యేంత వరకూ ఎలాంటి కీలక నిర్ణయాలు తీసుకోవద్దని ఆమెకు మౌఖిక ఆదేశాలు అందాయి. ఆమె బదిలీకి రంగం సిద్ధం కాగా, ప్రధాన అర్చకుడు దీర్ఘకాలిక సెలవులో వెళ్లడం, పాలకమండలి సభ్యులతో ఎమ్మెల్సీ బుద్ధా వెంకన్న భేటీ వంటి పరిణామాలు గురువారం చోటు చేసుకున్నాయి. దీంతో దుర్గగుడి వివాదం మరిన్ని మలుపులు తిరుగుతోంది. దుర్గగుడిలో తాంత్రిక పూజలు జరిగాయన్న ఆరోపణలపై ముఖ్యమంత్రి సీరియస్ కావడం, విచారణకు ఆదేశించడం తెలిసిందే. కేంద్ర సర్వీసులో పని చేస్తున్న ఐఆర్ఎస్ అధికారిణి వి.కోటేశ్వరమ్మను ఈవోగా నియమించవచ్చని ప్రచారం జరుగుతోంది. రాష్ట్ర సర్వీసులకు ఆమె - మిగతా 7వ పేజీలో

3



కోడి పందేలు జరగనివ్వం

హైకోర్టుకు తెలిపిన ఏపీ సర్కార్



2 లక్షల కోట్లతో కొత్త బడ్జెట్


ఆర్థిక మంత్రి యనమల రామకృష్ణుడు వెల్లడి

3



కట్టుకథ.. పచ్చి అబద్ధం

• పాక్ వీడియోకు విశ్వసనీయత లేదు • తిప్పికొట్టిన భారత్



న్యూఢిల్లీ, జనవరి 4: కులభూషణ్ జాదవ్ చేత 'ఒప్పుకోలు' ప్రకటనలు చేయించి కేవలం ప్రచారార్భాటం కోసం పాకిస్తాన్ తాజాగా వీడియో విడుదల చేసిందని, దానికి ఎలాంటి విశ్వసనీయత లేదని భారత్ త్రోసిపుచ్చింది. ఆ వీడియో పాక్ కుతంత్రంలో భాగమేనని మన దేశం ఘాటుగా స్పందించింది. 'నిర్బంధం'గా చెప్పించిన మాటలు ఎవరూ నమ్మదగ్గవి కావని భారత్ తేల్చి చెప్పింది. 'జాదవ్ నిఘా సంస్థలో పనిచేయడం లేదని తాము అబద్ధం చెబుతున్న'ట్లు అతను (జాదవ్) ఎలా అనగలడని భారత్ ప్రశ్నించింది. 'ఈ తరహా ప్రచారం వింతేమీ కాదు.. పాకిస్తాన్ జాదవ్‌ను ఒత్తిడికి గురిచేసి బలవంతంగా మాట్లాడిస్తూ ఇలా వీడియోలు విడుదల చేస్తోంది.. ప్రచారం కోసం చేసే ఈ పనుల వల్ల ఆ దేశం పట్ల ఎవరికీ విశ్వసనీయత ఉండదు' అని భారత విదేశాంగ మంత్రిత్వశాఖ అధికార ప్రతినిధి రవీశ్‌కుమార్ పేర్కొన్నారు. అంతర్జాతీయ మర్యాదలను, సంప్రదాయాలను పాకిస్తాన్ పాటించడం మంచిదని, ఉగ్రవాదాన్ని పాక్ ప్రేరేపించడం పట్ల నిరసన తెలుపుతూ ఐక్యరాజ్య సమితి భద్రతా మండలి గతంలో చేసిన తీర్మానాలను గుర్తుకు తెచ్చుకోవాలని, భారతీయ పౌరుడికి సంబంధించి మానవ హక్కులను ఉల్లంఘించడం మానుకోవాలని ఆయన సూచించారు. జాదవ్ కుటుంబ సభ్యుల పట్ల పాక్ భద్రతా అధికారులు అమానవీయంగా ప్రవర్తించారన్న ఆరోపణలు వచ్చిన తర్వాత ఇలా జాదవ్ చేత 'నిర్బంధం'గా మాట్లాడించి వీడియో తీశారని భారత్ తన వాదనను బలంగా వినిపిస్తోంది. కుటుంబ సభ్యులు జాదవ్‌ను కలిసినపుడు మధ్యలో 'గాజుతెర'ను ఎందుకు ఏర్పాటు చేశారని, అతను ఆ సమయంలో ఎంతో ఒత్తిడితో మానసిక వేదనతో ఉన్నట్లు కనిపించాడని, ఎదురెదురుగా ఉన్నపుడు 'ఇంటర్‌కమ్' పరికరాన్ని ఎందుకు ఏర్పాటు చేశారని, వారి మాటలను నలభై నిముషాల సేపు వీడియోగా ఎందుకు చిత్రీకరించారని భారత్ నిరసన తెలుపుతోంది.

18,19న కలెక్టర్ల సదస్సు

❖ తొలిసారిగా సచివాలయంలో

❖ 17న మంత్రివర్గ సమావేశం

ఆంధ్రభూమి బ్యూరో

విజయవాడ, జనవరి 4: వెలగపూడి సచివాలయ ఆవరణలో తొలిసారిగా జిల్లా కలెక్టర్ల సదస్సును నిర్వహించనున్నారు. ఈ నెల 18, 19 తేదీల్లో సచివాలయంలోని ఐదో బ్లాక్‌లో కొత్తగా నిర్మించిన సమావేశ మందిరంలో ఈ సదస్సు నిర్వహించనున్నారు. గత ఏడాది సెప్టెంబర్‌లో నిర్వహించిన కలెక్టర్ల సదస్సును సచివాలయంలో నిర్వహించాలని భావించారు. కానీ సమావేశ మందిరం పూర్తి స్థాయిలో సిద్ధం కాకపోవడం వల్ల విజయవాడలో నిర్వహించారు. ఇప్పటి వరకూ విజయవాడలోని ఒక ప్రైవేట్ భవనంలో సదస్సులు నిర్వహించారు. ఈ సారి సచివాలయంలోనే నిర్వహించాలని సీఎం ఆదేశించడంతో ఈ మేరకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. కాగా, ఈ నెల 17న రాష్ట్ర మంత్రి వర్గం సీఎం అధ్యక్షతన సమావేశం కానుంది.

మూడు రోజుల్లో 3లక్షల వినతులు

❖ పరకాల ప్రభాకర్ వెల్లడి

ఆంధ్రభూమి బ్యూరో

విజయవాడ, జనవరి 4: జన్మభూమి- మా ఊరు ప్రారంభమైన తొలి మూడు రోజుల్లో మూడు లక్షల మేరకు వినతులు వచ్చాయని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు పరకాల ప్రభాకర్ వెల్లడించారు. వెలగపూడి సచివాలయంలో ఆయన మీడియా సమావేశంలో గురువారం మాట్లాడుతూ జన్మభూమి సభలకు ఇప్పటి వరకూ 15.32 లక్షల మంది పాల్గొన్నారని తెలిపారు. వినతుల్లో ఎక్కువగా గృహ నిర్మాణం, రేషన్ కార్డులు, పింఛన్లకు సంబంధించి వచ్చాయని తెలిపారు. వీటిని ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నామన్నారు. సాధ్యమైనంత త్వరగా ఈ సమస్యలు పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. సీఎం ఈ మేరకు ఆదేశాలు ఇచ్చారన్నారు. మూడు రోజుల్లో దాదాపు 59 వేల రేషన్ కార్డులు పంపిణీ చేశామన్నారు. కొత్తగా 30 వేల పింఛన్లు మంజూరు చేశామని, దాదాపు 8400 ఇళ్ల స్థలాలను పంపిణీ చేశామన్నారు. వివిధ పనిముట్లు 10 వేలు పంపిణీ చేశామని, 4200 హెల్త్ క్యాంపులు నిర్వహించగా, 3.1 లక్షల మంది రోగులు ఈ వైద్య శిబిరాలకు వచ్చారన్నారు. వివిధ పోటీలు నిర్వహించి 54 వేల మందికి బహుమతులు అందచేశామన్నారు.

డీగ్రీ, పీజీ చదివిన దివ్యాంగులకు ల్యాప్‌టాప్‌లు

❖ మంత్రి పరిటాల

ఆంధ్రభూమి బ్యూరో

విజయవాడ, జనవరి 4: డిగ్రీ, పీజీ చదివిన దివ్యాంగులకు ల్యాప్ టాప్‌లు ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటామని రాష్ట్ర స్ర్తీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి పరిటాల సునీత వెల్లడించారు. విజయవాడలోని మాకినేని బసవపున్నయ్య విజ్ఞాన కేంద్రంలో లూయీ బ్రెయిలీ జయంతి సందర్భంగా గురువారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. బ్రెయిలీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అవయవ లోపంతో బాధపడే కన్నా, దానిని ఒక సవాల్‌గా తీసుకుని జీవితంలో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. అనుకున్న లక్ష్యాల సాధనలో బ్రెయిలీ లిపి ఉపయుక్తంగా ఉంటుందన్నారు. విభిన్న ప్రతిభావంతులకు ల్యాప్‌ట్యాప్‌లను ఇచ్చే అంశాన్ని సీఎంతో చర్చిస్తానని తెలిపారు. విభిన్న ప్రతిభావంతుల సమస్యల ఫైళ్లను త్వరలో కార్యదర్శితో సమీక్ష చేసి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఓఎన్‌జిసి సహకారంతో 20 లక్షల రూపాయల వ్యయంతో తయారు చేసిన కృత్రిమ కాళ్లు, చేతులను లబ్ధిదారులకు అందించారు. ఐదుగురికి ల్యాప్ టాప్‌లను అందచేశారు. ఏపీలో అంధుల జనాభా 2.03 లక్షలన్నారు. బ్యాక్ ల్యాగ్ పోస్టులను ఈ ఏడాది మార్చి నెలాఖరులోగా భర్తీ చేస్తామన్నారు.

బద్వేల్ అగ్నిప్రమాదంపై సీఎం ఆరా

ఆంధ్రభూమి బ్యూరో

విజయవాడ, జనవరి 4: కడప జిల్లా బద్వేల్‌లో గురువారం జరిగిన అగ్నిప్రమాదంపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రాత్రి ఆరా తీశారు. జిల్లా కలెక్టర్‌తో ఆయన ఫోన్‌లో సంఘటనకు సంబంధించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రమాదానికి కారణాలు అడిగారు. అగ్నిప్రమాదంలో బాధితులకు సహాయక చర్యలు చేపట్టాలని ఆదేశించారు. తాత్కాలిక వసతి, ఇతర ఏర్పాట్లపై చర్యలు తీసుకోవాలని తెలిపారు. సహాయక చర్యలు ఎటువంటి విమర్శలు రాకుండా జాగ్రత్త వహించాలని స్పష్టం చేశారు.

ఆర్‌పీఐ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా సూర్యనారాయణ

ఇంద్రకీలాద్రి, జనవరి 4: రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా (ఆర్‌పీఐ)లో సుదీర్ఘకాలంగా కొనసాగుతున్న ఆయినాపురపు సూర్యనారాయణను ఏపీ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నియమిస్తూ పార్టీ జాతీయ అధ్యక్షుడు రాందాస్ అథవాలే అధ్యక్షతన జరిగిన జాతీయ కమిటీ సమావేశంలో తీర్మానించారు. తెలుగు రాష్ట్రాల కన్వీనర్ పేరం శివనాగేశ్వరరావుగౌడ్ ఈమేరకు ఉత్తర్వులు జారీ చేశారు. ఇదేవిధంగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా పిట్టా వరప్రసాద్‌ను నియమిస్తూ ఉత్తర్వులను జారీ చేశారు.

కియా మోటార్స్ ఇండియా

ఎండీగా కుక్ హున్ షిన్

విజయవాడ, జనవరి 4: కియా మోటార్స్ ఇండియా ఎండీ, సీఈవోగా కుక్ హున్ షిమ్ నియమితులయ్యారు. ఈ మేరకు కియా మోటార్స్ ఇండియా ఓ ప్రకటనలో తెలిపింది. ఈ నియామకం తక్షణం అమల్లోకి వచ్చింది. భారత్‌లో కియా మోటార్స్ విస్తరణకు షిమ్ బాధ్యత వహిస్తారు. భారత్‌లో కియా తొలి నిర్మాణాన్ని షిమ్ పర్యవేక్షిస్తారు. నిర్దేశిత సమయంలో పూర్తిచేయటంలో ఆయన కీలక పాత్ర పోషిస్తారు. ప్రపంచ ఆటోమోటివ్ రంగంలో ఐదో స్థానంలో ఉన్న భారత్‌లో కియా మోటార్స్ బలోపేతానికి షిమ కృషి చేస్తారు. భారత్‌లో భవిష్యత్తు అభివృద్ధికి కియా 110 కోట్ల డాలర్ల పెట్టుబడి పెడుతోంది. కుక్ హున్ షిమ్ (58)కు ఆటోమోటివ్ రంగంలో 30ఏళ్ల అనుభవం ఉంది. ప్రస్తుతం ఆయన జార్జియాలో కియా మోటార్స్ కో ఆర్డినేషన్ హెడ్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఇంతకు ముందు స్లోవేకియాలోని కియా మోటార్స్ ప్రొడక్షన్ గ్రూప్ హెడ్ కో ఆర్డినేటర్‌గా పనిచేశారు. కియా మోటార్స్ ప్రెసిడెంట్ హన్-వూపార్క్ మాట్లాడుతూ 'కియా ఉత్పత్తి చేసే ప్రపంచ శ్రేణి కార్లకు భారత్‌లో మంచి డిమాండ్ ఉందని గుర్తించాం. షిమ్ నాయకత్వంలో ఇండియాలో కిమ్ కార్యకలాపాలు సరైన దిశలో నిర్దేశించుకున్న లక్ష్యాలను చేరుతామని నమ్ముతున్నామన్నారు. కియా నూతన సీఈవో కుక్ హున్ షిమ్ మాట్లాడుతూ, భారత్ కోసం కియా దగ్గర బృహత్తర ప్రణాళికలు ఉన్నాయని, తాము చేపట్టబోయే కార్యకలాపాల్లో ఆశ్చర్యపోయే శక్తిని ప్రదర్శిస్తామన్నారు.

కిడ్నీ రాకెట్‌పై పోలీసుల విచారణ

ఆంధ్రభూమి ప్రత్యేక ప్రతినిధి

విజయవాడ, జనవరి 4: సంచలనం రేకెత్తించిన కిడ్నీ రాకెట్‌పై ప్రభుత్వం దృష్టిసారించింది. ఇందులో భాగంగా కేసుకు సంబంధించి వెంకటేశ్వర నాయక్, వేదాంత కిడ్నీ ఆసుపత్రి యజమాని కారుడ్రైవర్‌పై పోలీసులు కేసు నమోదు చేశారు. విచారణ ముమ్మరంగా జరుగుతోంది. ఆసుపత్రిలో కిడ్నీ రోగుల రికార్డులను స్వాధీనం చేసుకున్నారు. కిడ్నీ రోగులకు సంబంధించి తహసీల్దార్లు ఇచ్చిన ధృవీకరణ పత్రాలను సేకరించారు. ఆసుపత్రిలో కేసు షీట్లను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. కిడ్నీ రాకెట్ వ్యవహారం మీడియా కెక్కి వరుస కథనాలు రావడంతో రాజకీయ పక్షాలు వత్తిడి పెంచాయి. దీనితో ప్రభుత్వ ఆదేశాల మేరకు పోలీసులు అప్రమత్తమయ్యారు. అనుమానితులందరినీ ప్రశ్నిస్తున్నారు.


దీనితో సంబంధిత వర్గాల్లో కలకలం మొదలయింది. ఇదిలావుండగా నరసరావుపేట, మాచర్ల, వినుకొండ తండాలకు చెందిన గిరిజనులు తమ ఆర్థిక పరిస్థితులు దయనీయంగా ఉండడంతో ఇలాంటి రాకెట్ల ఉచ్చులో పడుతున్నారు. వారి బలహీనతలను ఆసరాగా చేసుకుని రాకెట్ నిర్వాహకులు సొమ్ము చేసుకుంటున్నారు. ఈ కేసుకు సంబంధించి మరింత లోతుగా విచారణ జరిపేందుకు పోలీసులు ప్రయత్నం చేస్తున్నారు. తీగలాగి డొంక కదిలించడానికి ఏర్పాట్లు చేస్తున్నారు.

ఇక పడవఇళ్లలో జలవిహారం!

❖ తొలిదశలో కృష్ణా జలాలపై 15 పడవలు ❖ ఒక్కో పడవ ధర రూ.కోటి

❖ అమరావతి ప్రాంత పర్యాటక ఆకర్షణలో కొత్త శకం





ఆంధ్రభూమి ప్రత్యేక ప్రతినిధి

అమరావతి, జనవరి 4: కృష్ణానదీ జలాలలోనూ ఇక పడవ ఇల్లు (హౌస్ బోట్) తేలియాడనుంది. ఆంధ్రప్రదేశ్ పర్యాటక శాఖ ఆ దిశగా కసరత్తు ప్రారంభించింది. ఇప్పటివరకు పడవ ఇళ్లకు వేదికగా ఉన్న కేరళ పర్యాటకానికి ఏ మాత్రం తీసిపోని రీతిలో పర్యాటక శాఖ కార్యదర్శి ముఖేష్‌కుమార్ మీనా కార్యాచరణ సిద్ధం చేస్తున్నారు. ఆయా రంగాల అభివృద్ధిలో ఉపాధి కల్పనకు పెద్దపీట వేయాలన్న ముఖ్యమంత్రి ఆకాంక్షలకు అనుగుణంగా ప్రత్యేకించి దళితుల స్వయం ఉపాధికి సైతం ఉపకరించేలా ఇది రూపుదిద్దుకుంటోంది. పర్యాటక రంగానికి ఆశాజనకమైన భవిష్యత్తు ఉండగా, తదనుగుణంగా సమాయత్తం కావాలని సీఎం చెబుతుండగా, ఈ తాజా ప్రతిపాదన జీవం పోసుకుంది. గురువారం సచివాలయంలో ఆంధ్రప్రదేశ్ టూరిజం అథారిటీపై పర్యాటక, సాంస్కృతిక శాఖ కార్యదర్శి ముఖేష్‌కుమార్ మీనా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా పడవ ఇళ్లకు సంబంధించిన ప్రాజెక్టుపై మీనా స్పష్టత ఇచ్చారు. విజయవాడ ప్రకాశం బ్యారేజీ చెంత నదీజలాలలో పడవ ఇళ్లు పర్యాటకులకు మంచి అనుభూతిని ఇవ్వనుండగా, తొలిదశలో 15 పడవలను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ప్రతి పడవ ఏర్పాటుకు సుమారు రూ.కోటి వ్యయం కానుండగా, ఇందులో 15 శాతాన్ని ఆంధ్రప్రదేశ్ పర్యాటక అభివృద్ధి సంస్థ సబ్సిడీగా అందించనుంది. ఎస్సీ కార్పొరేషన్ కొంత మొత్తాన్ని సబ్సిడీ రూపంలో భరించేందుకు సూత్రప్రాయంగా అంగీకరించింది. మిగిలిన మొత్తాన్ని బ్యాంకుల నుండి రుణం సమకూర్చేలా పర్యాటక శాఖ కార్యాచరణ సిద్ధం చేస్తోంది. అయితే సాధారణ వ్యక్తులు సైతం ఈ ఇంటి పడవలను ఏర్పాటు చేసుకునే అవకాశం ఉండగా, వీరికి కూడా 15 శాతం ఏపీటీడీసీ సబ్సిడీ వర్తిస్తుంది. మిగిలిన 85 శాతాన్ని స్వయంగా కాని, బ్యాంకు రుణం రూపంలోకాని లబ్ధిదారులు సమకూర్చుకోవలసి ఉంటుంది. ఈ మొత్తం వ్యవహారాన్ని ఏపీటీడీసీ పర్యవేక్షించనుండగా, వీరికి అవసరమైన ఆన్‌లైన్ టికెటింగ్, మార్కెటింగ్‌కు పర్యాటక శాఖ బాధ్యత తీసుకుంటుందని ఈ సందర్భంగా ముఖేష్‌కుమార్ మీనా తెలిపారు. లబ్ధిదారుల ఎంపికలో అనుభవానికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తామని, అదే క్రమంలో ఆదాయ భాగస్వామ్యం ఆవశ్యకత కూడా ఉంటుందన్నారు. అయితే ఇప్పటికే ఏపీ టీడీసీ పడవ ఇంటి బోటు ఏర్పాటుకు అవసరమైన వ్యయాన్ని అంచనా వేసిందని, పడవ సామర్థ్యం సౌకర్యాల ప్రాతిపదికన రూ.60 లక్షల నుండి కోటి ఇరవై లక్షల వరకు వ్యయం అవుతుందని, లబ్ధిదారులు ఏ బోటునైనా కొనుగోలు చేసుకోవచ్చని, సబ్సిడీ మాత్రం కోటి రూపాయల ప్రాజెక్టుకు లోబడే ఉంటుందని ముఖేష్‌కుమార్ మీనా వివరించారు. అటు సాంఘిక సంక్షేమ శాఖ, ఇటు ఎస్సీ కార్పొరేషన్‌తో పర్యాటక శాఖ సంప్రదింపులు జరుపుతోందని, సాధ్యమైనంత త్వరగా వీటిని కృష్ణా నదిలో నదీ విహారం చేయించాలన్నదే పర్యాటక శాఖ లక్ష్యమన్నారు. సమీక్షా సమావేశంలో ఆంధ్రప్రదేశ్ టూరిజం అథారిటీ ముఖ్య కార్య నిర్వహణాధికారి హిమాన్షు శుక్లా, ప్రాజెక్టు మానిటరింగ్ యూనిట్ ఓఎస్‌డి లక్ష్మణమూర్తి, గెల్లి ప్రసాద్, పర్యాటక అధికారులు మధుబాబు, ఏపీటీఏ అధికారులు డాక్టర్ రాజు, మురళీ కృష్ణ, ఉమా జ్యోతి పాల్గొన్నారు.

సర్కారు స్వయంకృతం!

❖ ఐఏఎస్ అధికారులకు సంపూర్ణ స్వేచ్ఛ

❖ కీలక శాఖల్లో మంత్రుల మాట వినని వైనం

❖ దుర్గగుడి ఈఓ తీరుపై ఎప్పటినుండో ఫిర్యాదులు

❖ చేతులు కాలాక ఆకులు పట్టుకుంటున్న చందం

ఆంధ్రభూమి ప్రత్యేక ప్రతినిధి

అమరావతి, జనవరి 4: ఐఏఎస్, ఉన్నతాధికారులకు ఇస్తున్న స్వేచ్ఛ దుర్వినియోగమవుతోంది. కొందరు ఐఏఎస్‌లను చివరకు సీఎం కూడా నియంత్రించే పరిస్థితిలో లేరు. ఆరోపణలు వచ్చి అది పీకల మీదకు తెచ్చే వరకూ నిర్లిప్తంగా ఉండటం సరికాదు. మ పార్టీ వస్తే అధికారుల పాలన తప్ప పార్టీ నేతలకు గౌరవం ఉండదన్న అపవాదును తొలగించలేకపోతున్నాం. ఇదీ.. రాష్ట్రంలో పాలనా వ్యవహారంపై మంత్రులు, ఎమ్మెల్యేలు, అధికార పార్టీ నేతల అభిప్రాయం! తాజాగా రాష్ట్ర రాజధాని విజయవాడ కనకదుర్గ దేవాలయంలో అర్ధరాత్రి వేళ క్షుద్రపూజలు జరిగాయంటూ మీడియాలో వచ్చిన కథనాలు ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టాయి. దీనిని రాజకీయంగా సద్వినియోగం చేసుకునేందుకు రంగంలోకి దిగిన వైసీపీ నేతలు, అవి యువ మంత్రి లోకేష్ కోసమే జరిగాయన్న కొత్త వాదనతో తెరపైకి రావడం అటు పార్టీ, ఇటు ప్రభుత్వాన్ని ఆత్మరక్షణలోకి నెట్టాయి. వైసీపీ నేతలు అంబటి రాంబాబు, మల్లాది విష్ణు తదితరులు కేవలం లోకేష్‌ను మరింత ఉన్నతస్థితికి చేర్చాలన్న లక్ష్యంతోనే పూజలు చేశారన్న ఆరోపణలపై, మీడియా చానెళ్లు ఏకంగా చర్చనే పెట్టడం పార్టీని సంకటంలో పడేసింది. దానితో పార్టీ సీనియర్లు రంగంలోకి దిగి ఎదురుదాడి చేయాల్సి వచ్చింది. అటు ప్రభుత్వం కూడా మీడియా ప్రచారానికి తేరుకుని, దానిపై విచారణకు ఆదేశించి, కొందరిపై చర్యలు తీసుకోవాల్సి వచ్చింది. అసలు ఈ వ్యవహారంతో సంబంధం లేని లోకేష్‌ను రచ్చకు ఈడ్చిన వైనం, ఆ తర్వాత హడావిడిగా జరిగిన దిద్దుబాబు పరిశీలిస్తే, ఇదంతా ప్రభుత్వ స్వయంకృతాపరాధమేనన్న వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. నిజానికి ప్రభుత్వం-పార్టీని ఇరుకున పెట్టిన దుర్గగుడి వ్యవహారంపై వస్తున్న విమర్శలను ప్రభుత్వం పెడచెవిన పెట్టిందని, అప్పుడే చర్యలు తీసుకుని ఉంటే ఈ పరిస్థితి వచ్చేది కాదంటున్నారు. ఈఓ సూర్యకుమారి ముక్కుసూటి అధికారి అయినప్పటికీ, అటు పాలకవర్గం, ప్రజాప్రతినిధులను, ఇటు మీడియాను ఏకకాలంలో వ్యతిరేకం చేసుకోవడంతో ఇప్పుడు ఆమెకు ఎవరి మద్దతూ లభించని పరిస్థితి ఏర్పడింది. ఆమె చివరకు మంత్రి మాణిక్యాలరావును కూడా ఖాతరు చేయకపోవడం, తమను కూడా లెక్కచేయడం లేదని ఎమ్మెల్యే, ఎంపీలు ఫిర్యాదు చేసినా ప్రభుత్వం పట్టించుకోకపోవడమే పరిస్థితి ఇంతవరకూ రావడానికి కారణమంటున్నారు. ఆమెను అప్పుడే బదిలీ చేసి ఉంటే ఇంత రచ్చ జరిగేది కాదని చెబుతున్నారు. ఇప్పటికిప్పుడు బదిలీ చేస్తే తమ సామాజికవర్గానికి చెందిన అధికారిని తెచ్చుకునేందుకే ఆమెను బదిలీ చేస్తున్నారన్న ఆరోపణలతోపాటు, గుడిపై వచ్చిన ఆరోపణలు నిజమైనందుకే బదిలీ చేశారన్న విమర్శలను మూటకట్టుకోవాల్సి వస్తుందన్న తర్జనభర్జన కూడా జరుగుతోంది. 'అసలు దుర్గ గుడి, శ్రీశైలం వంటి దేవస్థానాలకు ఐఏఎస్‌లు ఎందుకు? రాష్ట్రంలో ఐఏఎస్‌ల కొరత ఉన్నప్పుడు వారిని వినియోగించుకోకుండా ఆర్జేసీ స్థాయి గుళ్లకు ఐఏఎస్‌లను వేయడం మంచిదికాదు. ఐఏఎస్‌లకు ప్రజల మనోభావాలతో పనిలేదు. ముఖ్యంగా గుళ్లకు అలాంటి వారిని వేయటం సరికాద'ని ఓ మంత్రి వ్యాఖ్యానించారు.

మాణిక్యాలరావు పేరుకే మంత్రి తప్ప, ఆయన మాటలు ఆ శాఖలో ఎవరూ వినే పరిస్థితి లేదు. దేవాదాయ శాఖ కమిషనర్‌తో పాటు పెద్ద దేవాలయాల ఈఓలు పట్టించుకోవడం లేదని, ఇక టీటీడీలో అయితే చెప్పే పనేలేదని బీజేపీ నేతలే చెబుతున్నారు. దుర్గగుడిలో వ్యవహారాలపై విచారించాలని సీఎం ఇప్పుడు మంత్రిని పిలిచి ఆదేశించే బదులు, అలాంటి అధికారాలు మొదటే ఇచ్చి ఉంటే ఈ పరిస్థితి వచ్చేది కాదంటున్నారు.

దేవాదాయ శాఖతో సహా మిగిలిన శాఖలన్నింటినీ సీఎంఓనే నియంత్రిస్తున్నందున, అక్కడ తీసుకునే నిర్ణయాలే మిటో తమకు తెలియడం లేదని మంత్రులు వాపోతున్నారు. వైద్య ఆరోగ్యశాఖ, రెవిన్యూ, దేవాదాయశాఖ, స్పోర్ట్స్, టూరిజం, హోం, స్కిల్ డెవలెప్‌మెంట్, బీసీ సంక్షేమం వంటి కీలకశాఖల్లో పనిచేసే ముఖ్య కార్యదర్శులు, కమిషనర్లు, ఎండీలు మంత్రులను బేఖాతరు చేస్తు సొంత నిర్ణయాలు తీసుకుంటున్నారు. అవుట్ సోర్సింగ్/కాంట్రాక్టు ఉద్యోగాల నియామకాలన్నీ మంత్రులకు తెలియకుండా జరిగిపోతున్నాయని, మంత్రులు అడిగితే ఖాళీలు లేవంటున్న అధికారులు, సొంతంగా ప్రైవేటు వ్యక్తులను నియమించుకుని వాటిని అమ్ముకుంటున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇలాంటి పరిస్థితిలో మంత్రులు, అధికారులను ఏం నియంత్రిస్తారంటున్నారు.

తిరువూరు కోర్టు హాలు

డిజిటల్ విధానంలో ప్రారంభం

ఆంధ్రభూమి బ్యూరో

విజయవాడ, జనవరి 4: డిజిటల్ విధానంలో తిరువూరు ఒకటవ అడిషనల్ మెజిస్ట్రేట్ కోర్టు హాలును గురువారం ఉమ్మడి రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి, కృష్ణా జిల్లా పోర్టుఫోలియో న్యాయమూర్తి జస్టిస్ వి.రామసుబ్రమణియన్ హైదరాబాద్ నుండి డిజిటల్ విధానంలో ప్రారంభించారు. డిజిటల్ ప్రక్రియలో ప్రారంభించిన కోర్టు భవనాల్లో దేశంలోనే ఇది రెండవది కావటం విశేషం. దీంతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అమలు చేస్తున్న డిజిటల్ విధానంలో కోర్టు పరిపాలన అంశాలు కూడా చేరినట్లయిందని కృష్ణా జిల్లా న్యాయమూర్తి వై.లక్ష్మణరావు తెలిపారు. గురువారం సాయంత్రం 5 గంటలకు హైదరాబాద్ నుండి నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో డిజిటల్ విధానంలో లాంఛనంగా తిరువూరు ఒకటవ అదనపు మేజిస్ట్రేట్ కోర్టు హాలు ప్రారంభించారని, ఉమ్మడి తెలుగు రాష్ట్రాలలో ఈ విధానంలో ప్రారంభించిన తొలి కోర్టుహాలు ఇదేనని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కృష్ణా జిల్లా న్యాయమూర్తి వై.లక్ష్మణరావు మచిలీపట్నం నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పాల్గొన్నారు. విజయవాడ నగర మెట్రోపాలిటన్ సెషన్స్ న్యాయమూర్తి ఏవి రవీంద్రబాబు, తిరువూరు న్యాయమూర్తులు, న్యాయవాదులు పాల్గొన్నారు.

11మంది వెయిటింగ్ డీఎస్పీలకు పోస్టింగ్‌లు

❖ విజయవాడ కమిషనరేట్‌కు నలుగురు

విజయవాడ (క్రైం), జనవరి 4: రాష్ట్రంలో వెయిటింగ్‌లో ఉన్న 11మంది డీఎస్పీలకు పోస్టింగ్‌లు దక్కాయి. ఈమేరకు డీజీపీ కార్యాలయం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ పోస్టింగ్‌ల్లో నలుగురిని విజయవాడ పోలీసు కమిషనరేట్‌కు కేటాయించారు. వీరిలో మూడు పోస్టులు కొత్తగా క్రియేట్ చేస్తూ ఏసీపీలుగా నియమించారు. గత కొంతకాలంగా పోస్టింగ్ కోసం ఎదురు చూస్తున్న డీఎస్పీ టి మోహన్‌రావును విజయనగరం ఏపీఎస్‌పీ ఐదో బెటాలియన్ అసిస్టెంట్ కమాండెంట్‌గా నియమించారు. అదేవిధంగా బీహెచ్ విమలకుమారి చిత్తూరు జిల్లా శ్రీసిటీ ఎస్‌డీపీఓగా నియమితులయ్యారు. డీఎస్పీ ఎస్ వెంకటరావును విజయవాడ సిటీ పోలీసు ట్రైనింగ్ సెంటర్ ఏసీపీగా నియమించారు. అదేవిధంగా విజయవాడ పోలీసు కమిషనరేట్‌కు కొత్తగా క్రియేట్ చేసిన మూడు పోస్టుల్లో ఏసిపిలుగా వెయిటింగ్‌లో ఉన్న జి ఉదయ్‌కుమార్, ఎస్‌కె మక్బుల్, లాల్ అహ్మద్ షేక్‌లను కేటాయించారు. ఇక ఇంటిలిజెన్స్ డీఎస్పీలుగా వెయిటింగ్‌లో ఉన్న పి ఉమాపతి వర్మ, కెవిఎన్‌వి ప్రసాద్‌లను నియమించారు. గుంటూరు రూరల్ ఎస్సీ, ఎస్టీ సెల్-1 డీఎస్పీగా ఎస్ విజయశేఖర్‌కు పోస్టింగ్ దక్కింది. ఇక ఇ శ్రీనివాసులు అనంతపురం సిసిఎస్ డీఎస్పీగా, అదేవిధంగా వెయిటింగ్‌లో ఉన్న ఆర్మ్‌డ్ రిజర్వు డీఎస్పీ టి కృష్ణను స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ డీఎస్పీగా నియమించారు.

గవర్నర్‌ను కలిసిన డీజీపీ మాలకొండయ్య

విజయవాడ (క్రైం), జనవరి 4: రాష్ట్ర గవర్నర్ ఇఎస్ఎల్ నరసింహన్‌ను ఏపి డీజీపీ ఎం మాలకొండయ్య గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఇంతకు ముందు డీజీపీగా ఉన్న నండూరి సాంబశివరావు గత ఏడాది డిసెంబర్ 31వ తేదీన రిటైర్ అయిన విషయం తెలిసిందే. కొత్త డీజీపీగా మాలకొండయ్య బాధ్యతలు చేపట్టిన తర్వాత గవర్నర్‌ను తొలిసారి హైదరాబాద్‌లో కలిసి పుష్పగుచ్ఛం ఇచ్చి అభినందనలు తెలియచేశారు. ఈసందర్భంగా పలు అంశాలపై చర్చించిన మీదట రాష్ట్రంలోని శాంతి భద్రతలపై డీజీపీ గవర్నర్‌కు వివరించినట్లు సమాచారం.



గవర్నర్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న డీజీపీ మాలకొండయ్య

టీడీపీ ప్రభుత్వానికి ప్రజలే సుప్రీం

❖ కథ, స్క్రీన్‌ప్లే, దర్శకత్వం అంతా వాళ్లే

❖ గ్రామాలకు అభివృద్ధినిబట్టి స్టార్ రేటింగ్‌లు

❖ జన్మభూమి సభలో మంత్రి నారా లోకేష్

తెనాలి, జనవరి 4: నవ్యాంధ్రప్రదేశ్‌లో తెలుగుదేశం ప్రభుత్వానికి కథ, స్క్రీన్‌ప్లే, దర్శకత్వం అంతా ప్రజలేనని రాష్ట్ర పంచాయితీరాజ్, ఐటి శాఖామంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. గుంటూరు జిల్లా తెనాలి నియోజకవర్గం కొల్లిపర మండలం అత్తోట గ్రామంలో గురువారం జరిగిన జన్మభూమి-మాఊరు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జరిగిన సభలో మంత్రి లోకేష్ మాట్లాడుతూ రాష్ట్ర విభజన సమయంలో కట్టుబట్టలతో, 16వేల కోట్ల రూపాయల అప్పులతో గెంటివేశారన్నారు. ఆ పరిస్థితుల్లో ముఖ్యమంత్రిగా అధికారం చేపట్టిన నారా చంద్రబాబునాయుడు కృషి, పట్టుదలతో నవ్యాంధ్ర అభివృద్ధికి నిరంతరంగా పనిచేస్తున్నారని చెప్పారు. కేవలం ఆరుమాసాలలో రాజధానికి అవసరమైన అన్ని హంగులు సమకూర్చుకున్నారని తెలిపారు. జన్మభూమి అనేది ఓ పండుగ రోజు వంటిదని జన్మభూమితో అధికారుల వద్దకు ప్రజలు వెళ్ళే రోజులుపోయి ప్రజల వద్దకే అధికారులువచ్చే పరిస్థితులు వచ్చాయన్నారు. రాష్ట్రంలో కనీవినీ ఎరుగని రీతిలో 24గంటల విద్యుత్ సరఫరా అందిస్తున్న ఘనత చంద్రబాబునాయుడుకే దక్కుతుందన్నారు. 200 రూపాయల పింఛనును వేయి రూపాయలకు పెంచి అందజేస్తున్నామని తెలిపారు. డెల్టాకి పట్టిసీమ ద్వారా నీటిని తరలించి సస్యశ్యామలంచేసి నదుల అనుసంధానం చేసిన ఘనత ముఖ్యమంత్రి దక్కించుకున్నారని చెప్పారు. గతంలో రాష్ట్ర వ్యాప్తంగా 34శాతం మాత్రమే ఉన్న మరుగుదొడ్లను ప్రస్తుతం 84శాతానికి పెంచామన్నారు. పారిశుద్ధ్యానికి ప్రాధాన్యతనిస్తూ ఇకనుండి రాష్ట్రవ్యాప్తంగా ప్రతీగ్రామ పంచాయితీకి తప్పక డంపింగ్ యార్డు ఏర్పాటుచేసేలా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. 2018నాటికి ఇళ్లకు నూరుశాతం కుళాయిల ఏర్పాటు లక్ష్యంగా కృషి చేస్తున్నామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా గ్రామాల అభివృద్ధిని బట్టి స్టార్ రేటింగ్స్ ఇస్తామన్నారు. గ్రామంలో కుళాయి కనెక్షన్లు, విద్యుత్, రోడ్ల నిర్మాణాలు, కంప్యూటర్ సౌకర్యాలు, 149రూపాయలకే నెట్, గ్రామంలో ప్రతి కుటుంబానికి నెలకు రూ. 10 వేల ఆదాయ కల్పన, వైద్యం, విద్యకు అధిక ప్రాధాన్యత వంటి అనేక అంశాలను దృష్టిలో పెట్టుకొని ప్లాటినమ్, స్వర్ణ, రజిత బహుమతులు ఇస్తామన్నారు. నవ్యాంధ్రప్రదేశ్‌ను స్వర్ణాంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దటమే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు లక్ష్యంగా ఉన్నందున 2019ఎన్నికల్లోనూ ఆయనను బలపరుస్తూ మరోమారు తెలుగుదేశం పార్టీకి ఓట్లువేసి గెలిపించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. అనంతరం తెనాలి నియోజకవర్గం అభివృద్ధికి 40కోట్లు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. రాష్ట్ర గిరిజన, సాంఘీక సంక్షేమ శాఖామంత్రి నక్కా ఆనంద బాబు మాట్లాడుతూ రాష్ట్రాధినేత తరువాత అంతటి నేత నారా లోకేష్ అంటూ మంత్రిని పొగడ్తలతో ముంచెత్తారు. తొలుత సభాప్రాంగణం వద్ద ఏర్పాటుచేసిన బాలుర కబడ్డీ ప్రదర్శనను, గంగిరెద్దు నృత్యాలను, వివిధ శాఖల తరుపున ఏర్పాటుచేసిన స్టాల్స్‌ను మంత్రులు, అధికారులు పరిశీలించారు. కార్యక్రమంలో పౌరసరఫరాలశాఖామంత్రి ప్రత్తిపాటి పుల్లారావు, ఎమ్మెల్యే ఆలపాటి రాజేంద్రప్రసాద్, మైనారిటీ కార్పొరేషన్ ముఖ్యకార్యదర్శి ప్రవీణ్‌కుమార్, కలెక్టర్ కోన శశిధర్, ఎస్పీ వెంకట అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.



జన్మభూమి సభలో మాట్లాడుతున్న మంత్రి లోకేష్

ఫుడ్ ప్రాసెసింగ్ సమర్థ వినియోగంతో

పంటలకు మెరుగైన ధర

❖ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి దినేష్‌కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న సీఎస్ దినేష్‌కుమార్

విజయవాడ (ఎడ్యుకేషన్), జనవరి 4: ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల మెరుగైన వినియోగంతో పంటలకు సరైన ధర లభించేలా చేయవచ్చని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి దినేష్‌కుమార్ అభిప్రాయపడ్డారు. గురువారం నగరంలోని శేషసాయి కళ్యాణవేదికలో ఫుడ్ ప్రాసెసింగ్ ఇండ్రస్టీ శిఖరాగ్ర సమావేశం మూడు రోజుల ప్రదర్శన ప్రారంభమయింది. మొదటి రోజు కార్యక్రమంలో దినేష్‌కుమార్ మాట్లాడుతూ ఉత్పాదకతను పెంచి వినూత్న ఫుడ్ ప్రాసెసింగ్ విధానాలు అమలు చేయడం ద్వారా వృద్ధి రేటును పెంచుకోగలుగుతామన్నారు. వ్యవసాయక రాష్ట్రమైన ఆంధ్రప్రదేశ్ క్రమక్రమంగా హార్టికల్చర్, ఆక్వా కల్చర్ రంగాల వైపు అడుగు వేస్తోందన్నారు. వ్యవసాయ రంగంలో నాలుగు శాతం కంటే తక్కువ వృద్ధి రేటు ఉంటే ఫుడ్ ప్రాసెసింగ్ ద్వారా ఆ స్థాయిని 8 శాతానికి పెంచుకోవచ్చునన్నారు. వార్షిక సమావేశాలు నిర్వహించి పారిశ్రామిక రంగంగా ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమలను మరింతగా అభివృద్ధి చేయాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ప్రధానంగా వ్యవసాయ ఆధారిత రంగంపై ఆధారపడి 27 నుంచి 29 శాతం వృద్ధి సాధిస్తుంటే దేశస్థాయిలో ఆ శాతం 16 శాతంగా వుందన్నారు. రాష్ట్రంలో మిరప ఉత్పత్తులు అధికంగా వున్నా వాటికి సరైన మద్దతు ధర లభించడం లేదని ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల ద్వారా వాటికి సరైన ధరను కల్పించగలుగుతామన్నారు. విలువ ఆధారిత సేవలను అమలు చేయడం ద్వారా ఉత్పత్తిదారుల నుంచి హోల్‌సేల్ కొనుగోలుదారుల వరకు, రిటైలర్ నుంచి వినియోగదారుని వరకు నాణ్యమైన సరుకును అందించడం సాధ్యమన్నారు. రాష్ట్రంలో ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమను రైతుల ప్రయోజనం కోసం మరింత సమర్థవంతంగా అమలు చేసే దిశలో రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. ఫుడ్ ప్రాసెసింగ్ విధానాల సమర్థ వినియోగం లేకపోవడం ద్వారా లక్ష కోట్ల రూపాయల ఆదాయాన్ని కోల్పోతున్నామన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం సమర్థవంతంగా మెగా ఫుడ్ పార్క్, కోల్డ్‌చైన్ కార్యక్రమాలను అభివృద్ధి చేసి ఆహార ప్రాసెసింగ్ యూనిట్ల విస్తరణకు చర్యలు చేపడుతోందన్నారు. 351 ఒప్పందాల ద్వారా రూ.10 వేల 551 కోట్ల పెట్టుబడిని సాధించగలిగామని రాబోయే 5 సంవత్సరాలలో ఆంధ్రప్రదేశ్‌లో సమగ్రమైన పాలసీలను అమలులోకి తీసుకురాగలుగుతున్నామని అన్నారు. ఆహార ప్రాసెసింగ్ పరిశ్రమ కోసం అనేక కార్యక్రమాలను రూపొందించడంతో పాటు ప్రోత్సాహకాలను కూడా అందిస్తున్నామన్నారు. ఎండ్లు, కూరగాయల రంగంలోనే 30 నుంచి 40 శాతం మేర ఫుడ్ ప్రాసెసింగ్ రంగం సమర్థ వినియోగం లేకపోవడం వల్ల నష్టపోతున్నామన్నారు. రవాణా, నిల్వ సామర్థ్యం, మార్కెటింగ్, ప్రాసెసింగ్ వంటి వాటి లభ్యత ఆధారంగా ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమ గణనీయమైన పురోగతి సాధించగలుగుతామన్నారు. కోల్డ్ స్టోరేజ్ చైన్ కార్పొరేషన్ స్థాపన ద్వారా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సమర్థవంతమైన ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల స్థాపన విధానంలో చర్యలు తీసుకోగలుగుతున్నామన్నారు. ఆహార ఉత్పత్తులు వృథాను తగ్గిస్తే పంటకు సరైన ఆదాయాన్ని అదనంగా అందించడం సాధ్యమవుతుందన్నారు. రాష్ట్రంలో ఇప్పటికే 2 వందల ప్రాజెక్టులు రూ.6 వేల కోట్ల రూపాయల పెట్టుబడితో ఏర్పాటు అయ్యాయన్నారు.

డ్రగ్స్ కేసులో చార్జిషీట్లు సిద్ధం!

ఆంధ్రభూమి బ్యూరో

హైదరాబాద్, జనవరి 4: తెలంగాణ రాష్ట్రాన్ని, తెలుగు చిత్ర రంగాన్ని కుదిపేసిన డ్రగ్స్ కేసులో నేరారోపణ పత్రాలు (చార్జిషీట్లు) దాఖలు చేసేందుకు ఆ కేసును విచారిస్తున్న ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) దృష్టిసారించింది. ఈ కేసుకు సంబంధించిన ఫోరెన్సిక్ నివేదిక సిట్ చేతికి రావడంతో ఇక చార్చిషీట్లను దాఖలు చేసేందుకు దృష్టిసారించింది. ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ శాఖ డ్రగ్స్ కేసులో కీలక నిందితుడు కెల్విన్‌ను అరెస్టు చేసిన తర్వాత దర్యాప్తులో తీగలాగితే డొంక కదిలినట్లు చిత్ర రంగంలోని అనేక మంది సెలబ్రిటీలతో సహా పలువురు పేర్లు బయటకు వచ్చిన సంగతి తెలిసిందే. వీరందరికీ నోటీసులు జారీ చేసిన ఎన్‌ఫోర్స్‌మెంట్, సిట్ విడివిడిగా వారందరిని విచారించి కొందరి రక్త నమూనాలను సైతం తీసుకుని ఫోరెన్సిక్ పరీక్షలకు పంపించారు. ఫోరెన్సిక్ నివేదికను సిట్ బృందం కోర్టుకు అందజేయడం, ఆ తర్వాత దర్యాప్తు అధికారులకు చేరడంతో ఇక డ్రగ్స్ కేసులో దూకుడు పెంచేందుకు రంగం సిద్ధం చేస్తున్నారు. డ్రగ్స్ విషయంలో మొత్తం 12 కేసులను సిట్ నమోదు చేసింది. వీటిలో 5 కేసుల్లో ఫోరెన్సిక్ నివేదికలు సిట్‌కు అందడంతో తొలుత ప్రాథమికంగా చార్జిషీట్లను దాఖలు చేసేందుకు దృష్టిసారించారు. ఈ కేసుల్లో మొత్తం 22 మందిని అరెస్టు చేసింది. ఈ కేసును ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ఐపిఎస్ అధికారి, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరక్టర్ అకున్‌సభర్వాల్ ఎంతటివారినైనా వదిలిపెట్టకుండా సాక్ష్యాలు, ఆధారాలు, శాస్ర్తీయ ఆధారాలను సేకరించడం పూర్తి చేశారు. ఈ కేసు విచారణలో భాగంగా కీలక నిందితుల కాల్‌డేటా ఆధారంగా సినీ రంగానికి చెందిన 12 మందిని సిట్ విచారించింది. వీరిలో ప్రముఖ దర్శకుడు పూరీ జగన్నాథ్, హీరో తరుణ్, తదితరులు ఉన్నారు. ఈ కేసులో సాక్ష్యాల కోసం కొందరి నుంచి రక్త నమూనాలు, గోళ్లు, తల వెంట్రుకలు సేకరించారు. 24 మంది రక్త నమూనాలను ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపించారు. చార్జిషీట్లు దాఖలు చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

కోడి పందేలు జరగనీయం

హైకోర్టుకు తెలిపిన ఏపీ సర్కార్

ఆంధ్రభూమి బ్యూరో

హైదరాబాద్, జనవరి 4: వచ్చే సంక్రాంతి పండగ నేపథ్యంలో ఆంధ్ర రాష్ట్రంలో కోడిపందేలు జరగకుండా కఠిన చర్యలు తీసుకుంటామని రాష్ట్రప్రభుత్వం హైకోర్టుకు హామీ ఇచ్చింది. ఈ అంశంపై సరైన చర్యలు ఎందుకు తీసుకోలేదంటూ 42 మంది తాహశీల్దార్లు, 49 మంది ఎస్సైలకు షోకాజ్ నోటీసులు ఇచ్చామని, కోర్టు ఆదేశాలు ఎందుకుపాటించలేదో వివరణ ఇవ్వాలని కోరామని ఏపి అడ్వకేట్ జనరల్ దమ్మలపాటి శ్రీనివాస్ కోర్టుకు తెలిపారు. ఈ కేసును తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రమేష్ రంగనాథన్, జస్టిస్ జి శ్యాంప్రసాద్‌తో కూడిన ధర్మాసనం విచారించింది. గత ఏడాది కోడి పందేల నిర్వాహకుల నుంచి రూ.9.23 లక్షల సొమ్మును స్వాధీనం చేసుకున్నామన్నారు. పశ్చిమగోదావరి జిల్లాకు చెందిన కలిదిండి రామచంద్రరాజు కోడిపందేల జరగకుండా నిరోధించడంలో అధికారులు విఫలమయ్యారంటూ దాఖలు చేసిన పిటిషన్‌ను హైకోర్టు విచారించింది. ఈ సందర్భంగా ప్రభుత్వం ఉదాసీనవైఖరి పట్ల హైకోర్టు అసంతృప్తి వ్యక్తం చేసింది. ఈ సందర్భంగా హైకోర్టు ధర్మాసనం జోక్యం చేసుకుని ‘ కోట్లాది రూపాయలు కోడిపందేల నిర్వహణ సందర్భంగా చేతులు మారుతున్నాయి. కాని అధికారులు కేవలం రూ.9లక్షలు మాత్రమే స్వాధీనం చేసుకున్నారు. ప్రభుత్వం సీరియస్‌గా వ్యవహరించడం లేదనేందుకు ఇది నిదర్శనం అని పేర్కొంది. బాధ్యులైన అధికారుల పట్ల చర్యలు తీసుకోవాలని కోర్టు పేర్కొంది. ఈ సందర్భంగా ఏజి జోక్యం చేసుకుని అదనపు అఫిడవిట్‌ను కూడా దాఖలు చేస్తామని కోర్టుకు తెలిపారు. హైకోర్టు స్పందిస్తూ పశ్చిమగోదావరి జిల్లా నుంచి తూర్పు గోదవారి, గుంటూరు, విశాఖపట్నం జిల్లాలకు కూడా కోడిపందేలు విస్తరించాయి. తిరుపతి నుంచి కూడా పశ్చిమగోదావరి జిల్లాకు అనేక మంది వెళ్లి కోడిపందేల జూదం ఆడుతున్నారు. ఈ సారి హైకోర్టు కోడిపందేల జూదాన్ని ఎలా నిరోధిస్తారో నిశితంగా చూస్తుంది అని పేర్కొంది.

ముందుంది పరీక్షాకాలం

పథకాల లక్ష్యాలు చేరుకోవాలి ● కలెక్టర్లకు ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశం



మహిళలకు పట్టాదార్ పాస్‌బుక్‌లు అందజేస్తున్న సీఎం చంద్రబాబు

ఆంధ్రభూమి బ్యూరో

శ్రీకాకుళం, జనవరి 4: మరుగుదొడ్ల నిర్మాణం, వినియోగం లక్ష్యాల్లో రాష్ట్రంలో ఏడు జిల్లాలు వెనుకబడి ఉన్నాయని, అందులో శ్రీకాకుళం జిల్లా మూడో స్థానంలో ఉందని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు వెల్లడించారు. లక్ష్యాలు చేరుకోలేని జిల్లా కలెక్టర్లపై ధర్నా చేస్తానంటూ ముఖ్యమంత్రి హెచ్చరిస్తూ..తొలిరోజున మౌనంగా ధర్నా నిర్వహిస్తానని, రెండో రోజున భోజనం మానేస్తానన్నారు. రాష్ట్రంలో కృష్ణ, ఉభయగోదావరి జిల్లాలు, గుంటూరు, ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లో ఓడీఎఫ్ శతశాతం పూర్తి చేయగా, శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, చిత్తూరు, కర్నూలు, కడప, అనంతపురం జిల్లాల్లో ఆత్మగౌరవాన్ని కాపాడాల్సిన అధికారులు ఆ పని నిర్వర్తించడంలో అలసత్వం వహిస్తున్నారని, అందుకే వారిపై ధర్నా చేస్తానంటూ ముఖ్యమంత్రి వెల్లడించారు. గురువారం శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురంలో జరిగిన ఐదోవిడత జన్మభూమి - మా ఊరు కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. కలెక్టర్లపై ధర్నా చేయడం వల్ల వారిలో రోషం, పౌరుషం వస్తుందన్న ఆశాభావాన్ని వ్యక్తం చేసారు. రాబోయే రోజుల్లో ప్రభుత్వంలో గల ఎమ్మెల్యేలతోపాటు, అధికారులకు కూడా పరీక్షలు ఉన్నాయని, వాటికి పూర్తిగా సిద్ధపడాలన్నారు. మార్చి 31 నాటికి రాష్ట్రమంతటా మరుగుదొడ్ల నిర్మాణ లక్ష్యాలను పూర్తి చేయాలని ఆదేశించారు. 2016, అక్టోబర్ 2న ఆత్మగౌరవాన్ని కాపాడాలంటూ చేసిన ప్రతిజ్ఞ నెరవేర్చడానికి ఓడీఎఫ్ శతశాతం పూర్తి చేయాలన్నారు. నా జన్మహక్కు - మరుగుదొడ్డి అన్న నానుడి ప్రతీ పంచాయతీలో వినిపించాలన్నారు. ప్రతీ నెలా మూడో శనివారం ప్రజాప్రతినిధులు, అధికారులు, విద్యార్థులు బాధ్యతగా మరుగుదొడ్ల నిర్మాణం, వినియోగం పట్ల చైతన్య ర్యాలీలు, నిర్వహించాలన్నారు. ముఖ్యంగా హిందూ దేవాలయాలు, చర్చిలు, మసీదుల్లో ఆత్మగౌరవాన్ని కాపాడుకోవాలంటూ ఓడీఎఫ్ గ్రామాలే లక్ష్యమన్న ఆలోచనను ఆయా ప్రతినిధులు ప్రజలకు చెప్పిన మాట మనసులో తుల్లో నాటుకుపోతుందని, అటువంటి ప్రయత్నం రాష్ట్రమంతటా జరగాలన్నారు. పులివెందుల్లో జన్మభూమి కార్యక్రమాన్ని రాజకీయం చేయాలని చూసారు - కానీ, పవిత్రమైన యజ్ఞంగా జన్మభూమిని ప్రజల ముంగిటకు ప్రభుత్వం వెళ్ళి వారి సమస్యలు తెలుసుకుని పరిష్కరించే కార్యక్రమంగా పేర్కొన్నారు. విశాఖపట్నం, విజయవాడ, తిరుపతి ప్రాంతాల్లో బిల్డింగ్ మెటీరియల్స్ కూడా దేనికిదానిగా వీడదీసి వినియోగంలోకి తీసుకొచ్చేవిధంగా మిషనరీలు కొనుగోలు చేసామన్నారు. ఇటువంటి ఎన్నో ఆర్థికంగా భారమైన పనులకు శ్రీకారం చుడుతున్న నేపథ్యంలో జన్మభూమి సభల్లో గొడవలు, ప్రజల ముసుగులో అల్లర్లు చేయడం బాధాకరంగా ఉందన్నారు. రాష్ట్రంలో 20 లక్షల మంది అగ్రిగోల్డ్ బాధితులు ఉన్నారని, వారందరినీ ఆదుకుంటామని భరోసా ఇచ్చారు. ఇటీవలే ముంబయి నుంచి ఒక ట్రస్టు వచ్చి అగ్రిగోల్డ్ ఆస్తులను కొనుగోలు చేసేందుకు ముందుకువచ్చిందని, న్యాయస్థానం సూచనలు మేరకు ఆ ఆస్తులను అమ్మకాలు చేసి రాష్ట్రంలో నష్టపోయిన ప్రతీ బాధితున్ని ఆదుకుంటామన్నారు. అరకోటి మందికి పింఛన్లు ఇచ్చే ఏకైక రాష్ట్రం దేశంలో ఆంధ్రప్రదేశ్ అంటూ ముఖ్యమంత్రి గణాంకాలు వివరించారు. రెండో పింఛన్ పట్ల వినతులు పెద్దఎత్తున వస్తున్నాయని, వాటిని పరిశీలించగా, రెండో పింఛన్‌కు ప్రభుత్వం సుముఖత వ్యక్తం చేసేందుకు సిద్ధంగా ఉందన్నారు. విభజన వల్ల అన్నీ సమస్యలే ఉన్నాయని, కాని దృఢసంకల్పంతో పనిచేస్తున్నామని మూడున్నర ఏళ్ళు సుపరిపాలన అందించామన్నారు. ప్రధానమంత్రి స్వచ్ఛభారత్ కమిటీలో తనను ఒక సభ్యునిగా నియమించి, నివేదికలు కోరినప్పుడు బహిరంగ మలవిసర్జన లేకుండా చేయడం, పారిశుద్ధ్యం పట్ల ప్రజల్లో మార్పు తీసుకురావాలంటూ నివేదికలు ఇవ్వగా, మరుగుదొడ్ల నిర్మాణానికి ఆర్థిక సహాయం కోరగా, కేంద్ర ప్రభుత్వం కేవలం రూ. 7,200 ఇచ్చిందని, దానికి మరో రూ. 7,800 రాష్ట్ర ప్రభుత్వం కంట్రీబ్యూషన్ చేసి ఆత్మగౌరవాన్ని కాపాడాలన్న తపనతో 15000 రూపాయలు మరుగుదొడ్ల నిర్మాణానికి ఇస్తున్నామన్నారు. రెండు వేలకుపైగా ఉన్న జనాభాకు రోడ్లపై కాల్వలు నిర్మాణం, ఐదు వేల జనాభా కలిగిన ప్రాంతాల్లో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ విధానం అమలు చేస్తున్నామన్నారు. మంత్రులు కిమిడి కళావెంకటరావు, కింజరాపు అచ్చెన్నాయుడు, పితాని సత్యన్నారాయణ, ఎంపీ రామ్మోహన్‌నాయుడు, జెడ్పీ ఛైర్‌పర్సన్ చౌదరి ధనలక్ష్మీ, స్థానిక ఎమ్మెల్యే బెందాళం అశోక్ తదితరులు పాల్గొన్నారు.

నిజనిర్ధారణ కమిటీ వేశాం

దుర్గ గుడి వ్యవహారంపై దేవాదాయ మంత్రి మాణిక్యాలరావు



ఆంధ్రభూమి బ్యూరో

తాడేపల్లిగూడెం, జనవరి 4: విజయవాడ కనకదుర్గమ్మ గుడి వ్యవహారంలో నిజనిర్ధారణ కమిటీని వేశామని, 48 గంటల్లో కమిటీ నివేదిక ఇస్తుందని రాష్ట్ర దేవాదాయ, ధర్మాదాయ శాఖ మంత్రి పైడికొండల మాణిక్యాలరావు తెలిపారు. గురువారం పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెంలోని క్యాంపు కార్యాలయంలో విలేఖరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాణిక్యాలరావు మాట్లాడుతూ గుడి వ్యవహారంలో దేవాదాయ శాఖతోపాటు పోలీసులు వారి పని వారు చేస్తున్నారన్నారన్నారు. ఈ విషయంపై పోలీస్ కమిషనర్ గౌతమ్ సవాంగ్, తాను సిఎం చంద్రబాబును కలుసుకున్నామన్నారు. దీనిపై సీఎం పూర్తిస్థాయి నివేదికను 48 గంటల్లో అందించాలని ఆదేశించారని, భక్తుల మనోభావాలు గానీ, దేవాలయాల పవిత్రతకు గానీ భంగం కలిగించే వారిని ఉపేక్షించవద్దని సీఎం తెలిపారన్నారు. అయితే తనకు అందిన సమాచారం ప్రకారం కేవలం దేవాలయ పరిశుభ్రత, పూజాలంకరణ చేసేందుకు బయట అర్చకులు వచ్చినట్టు తెలిసిందన్నారు. ఇది నిబంధనలకు విరుద్ధంగానే భావిస్తున్నామన్నారు. ఇదే విషయం మీడియా ద్వారా వచ్చిందన్నారు. బయట అర్చకులు ఆలయం లోపలకు రావడంపై దేవాదాయ శాఖ సిబ్బంది గానీ, స్పెషల్ ఫోర్స్ గానీ గుర్తించలేకపోయిందన్నారు. దీనికి గల కారణాలను విశ్లేషిస్తామన్నారు. పాలకమండలి, ఈవో అంశాలను పాత్రికేయులు ప్రస్తావించగా, ఇటీవలే పాలకమండలి వచ్చిందని, దేవాలయ నిర్వహణపై గతంలో కొన్ని ఆరోపణలు వచ్చాయని అన్నారు. ఆ సందర్భంలో ఈవో పాత్ర లేకపోయినప్పటికీ బదిలీ చేయడం ఉత్పన్నమైందన్నారు. దేవాలయ అభివృద్ధి విషయంలో అక్కడ ఉన్న కొన్ని దుకాణాలను, ఇళ్లను తొలగించి రాజమార్గం విస్తరించే సమయంలో కొంతమందికి నష్టంవాటిల్లి బాధ కలిగి ఉండవచ్చని ఒక ప్రశ్నకు సమాధానంగా చెప్పారు.

ఆ వ్యాఖ్యలను వెనక్కి తీసుకుంటున్నా

గజల్ శ్రీనివాస్‌కు అనుకూలంగా తాను చేసిన వ్యాఖ్యలను వెనక్కి తీసుకుంటున్నట్టు రాష్ట్ర దేవాదాయ మంత్రి పైడికొండల మాణిక్యాలరావు స్పష్టం చేశారు. తల్లి, తండ్రి, దేశం విషయాల్లో గజల్ శ్రీనివాస్ గజల్స్‌ను చూసి సమాజానికి అతడు ప్రేరణ కలిగిస్తున్న మంచి వ్యక్తిగా భావించి ఆయనపై వచ్చిన ఆరోపణలను ఖండించిన విషయాన్ని వెనక్కి తీసుకుంటున్నట్టు పేర్కొన్నారు. గజల్ శ్రీనివాస్ అనే నాణానికి ఒక వైపు మాత్రమే చూశానని, రెండవ వైపు చాలా జుగుప్సాకరంగా ఉందన్నారు. వారు మహిళల పట్ల వికృత చర్యలు చాలా తనను బాధించాయని మంత్రి మాణిక్యాలరావు అన్నారు. ఇటువంటి వ్యక్తుల పట్ల ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

రూ. 2లక్షల కోట్లతో బడ్జెట్: యనమల


మీడియాతో మాట్లాడుతున్న యనమల

ఆంధ్రభూమి బ్యూరో

అమలాపురం, జనవరి 4: రాష్ట్ర బడ్జెట్ 2018-19 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రూ. 2 లక్షల కోట్లతో రూపొందించేందుకు అంచనాలు తయారు చేస్తున్నట్టు రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి యనమల రామకృష్ణుడు ప్రకటించారు. తూర్పుగోదావరి జిల్లా అమలాపురంలో మాజీ మంత్రి దివంగత మెట్ల సత్యనారాయణరావు 77వ జయంతి కార్యక్రమంలో పాల్గొన్న అనంతరం యనమల స్థానిక విలేఖరులతో మాట్లాడారు. గతేడాది లక్షా 56 వేల కోట్లతో రాష్ట్ర బడ్జెట్‌ను ఏర్పాటుచేశామని, దానిని ఈ ఏడాది రెండు లక్షల కోట్లకు పెంచాలన్న యోచనలో ఉన్నట్టు వెల్లడించారు. ప్రభుత్వంలోని వివిధ శాఖలకు చెందిన వారంతా వారివారి ప్రతిపాదనలు ఆర్థిక శాఖకు సమర్పిస్తారని, అనంతరం ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శితో పాటు ఆర్థిక నిపుణులతో చర్చించి తమ శాఖ ముసాయిదాను రూపొందిస్తుందన్నారు. జనవరి నెలాఖరులోగా రాష్ట్రంలోని ఆర్థిక నిపుణులతో చర్చించి వారి సూచనలు, సలహాలను కూడా పరిగణలోకి తీసుకుంటామన్నారు. వివిధ శాఖల్లో ఇప్పటికే ఏవైతే నాన్ ఫైనాన్షియల్ కమిట్‌మెంట్స్ ఉన్నాయో వాటిపై రాష్ట్ర ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు బడ్జెట్‌ను రూపొందిస్తామన్నారు. వివిధ శాఖల్లో ఉన్న సేవింగ్స్ నిధులను కూడా పరిగణలోకి తీసుకుని పెండింగ్ సమస్యల కోసం ఖర్చు చేస్తామన్నారు. రాబోయే బడ్జెట్‌లో సామాన్య ప్రజలకు మేలు జరిగేలా అంచనాలు రూపొందించాలనేది తమ ప్రభుత్వం ముఖ్య ఉద్దేశ్యమని యనమల తెలిపారు. ప్రభుత్వం ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నా, ట్రెజరీల్లో నిల్వలు లేకపోయినా ప్రజలకు ఇబ్బందులు లేకుండా సంక్షేమ కార్యక్రమాలను నిర్విరామంగా నిర్వహిస్తున్నామన్నారు. త్వరలోనే ఆర్థిక సమస్యలన్నీ అధిగమిస్తామన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఇచ్చిన హామీలకు అనుగుణంగా రైతాంగానికి చెల్లించాల్సిన రుణమాఫీని పూర్తిస్థాయిలో చెల్లిస్తామన్నారు

ఆరుతడి పంటలకు సాగర్ నీరివ్వండి

రాష్ట్ర సాగునీటి సంఘాల వినతి ★ కృష్ణాబోర్డు ఛైర్మన్‌ను కలిసి వినతిపత్రం అందజేత

ఆంధ్రభూమి బ్యూరో

విజయవాడ, జనవరి 4: నాగార్జునసాగర్ ఎడమ కాలువ కింద ఆంధ్రప్రదేశ్‌లోని కృష్ణాజిల్లాలో 3వ జోన్‌కు సాగర్ జలాలను వెంటనే విడుదల చేసి, ఆరుతడి పంటలను రక్షించాలని కృష్ణానదీ యాజమాన్య బోర్డును జలవనరులశాఖ ఎపెక్స్ కమిటీ సభ్యుడు ఆళ్ల వెంకట గోపాలకృష్ణారావు, ఎడమ కాలువ ప్రాజెక్టు కమిటీ ఛైర్మన్ వై.పుల్లయ్యచౌదరి, డిస్ట్రిబ్యూటరీ కమిటీ ఛైర్మన్ నాదెళ్ల కేశవరావు కోరారు. ఈ మేరకు హైదరాబాద్ జలసౌధలోని కెఆర్‌ఎంబీ కార్యాలయంలో ఛైర్మన్ ఎస్‌కె శ్రీవాస్తవ్‌ని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు విజయవాడలో పత్రికా ప్రతినిధులతో మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌లోని నాగార్జునసాగర్ ఎడమ కాలువ ఆయకట్టు కింద కృష్ణాజిల్లాలోని తిరువూరు, నూజివీడు, మైలవరం, గన్నవరం, నందిగామ, జగ్గయ్యపేట నియోజకవర్గాల్లో 3.60 లక్షల ఎకరాల ఆయకట్టు ఉందన్నారు. మిర్చి, పొగాకు, మొక్కజొన్న, పత్తి, మామిడి, మినుము, పసుపు తదితర ఆరుతడి పంటలు రైతులు సాగుచేయగా రాష్ట్ర ప్రభుత్వం విజ్ఞప్తి మేరకు నవంబరులో 4 టీఎంసీలు, డిసెంబర్‌లో 4 టీఎంసీలు నీటిని నాగార్జునసాగర్ ఎడమ కాలువకు కేటాయించగా, నవంబరు మాసంలో మొదటి విడతగా 2,3 జోన్లకు 3.780 టీఎంసీలు తెలంగాణ ప్రభుత్వం విడుదల చేసిందన్నారు. డిసెంబరులో ఇప్పటివరకు రెండవ విడత 2వ జోన్‌కు 0.64 టీఎంసీలు మాత్రమే ఇచ్చి ఏకపక్షంగా జనవరి 6న నాగార్జునసాగర్ డ్యాం దగ్గర హెడ్ రెగ్యులేటర్ మూసివేస్తున్నట్టు చెబుతున్నారన్నారు. దీనివలన ఆంధ్రప్రదేశ్ రైతులకు తీవ్ర నష్టం జరుగుతుందని, ఎడమకాలువ పరిధిలోని పాలేరు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నికర జలాల నుండి కేంద్ర జల సంఘం, కృష్ణానదీ యాజమాన్య బోర్డు (కెఆర్‌ఎంబీ) నుంచి ఏ విధమైన అనుమతులు లేకుండా భక్త రామదాస ఎత్తిపోతల పథకం పేరుతో రోజుకు 500 క్యూసెక్కులు తీసుకుంటున్నారని, దీనివలన పాలేరు దిగువ భాగాన ఉన్న ఆంధ్రప్రదేశ్‌లోని 2,3 జోన్లకు సాగునీరు రావడం లేదన్నారు. నీటి విడుదల షెడ్యూలు కూడా ఏకపక్షంగా 9 రోజులు విడుదల, 6 రోజులు వారాబందీ అని చెప్పి ఆ సమయంలో కూడా వచ్చిన నీటిని కేవలం పాలేరు రిజర్వాయర్‌ను నింపి ఆ నీటిని కేవలం తెలంగాణా ప్రాంతంలోని ఆయకట్టుకే ప్రాధాన్యం ఇస్తున్నారని ఆరోపించారు. దీనివలన కృష్ణాజిల్లాలోని 3వ జోన్‌లో ఉన్న 2.30 లక్షల ఎకరాల ఆయకట్టులో ఉన్న ఆరుతడి పంటలు ఎండిపోతున్నాయని, ఈ పరిస్థితుల దృష్ట్యా కృష్ణానదీ యాజమాన్య బోర్డు ఆంధ్రప్రదేశ్ రైతులను దృష్టిలో పెట్టుకొని డిసెంబర్‌లో కేటాయించిన 4 టీఎంసీల నుంచి ఆంధ్రప్రదేశ్ బోర్డరు 3వ జోన్‌కు కనీసం 15వేల క్యూసెక్కులు చొప్పున 15 రోజులు విడుదల చేసి ఆంధ్రప్రదేశ్‌లో పంటలు కాపాడాలని కెఆర్‌ఎంబీని కోరామన్నారు. సాగర్ డ్యామ్ హెడ్ రెగ్యులేటర్ కూడా కనీసం 20 రోజులపాటు విడుదల చేసి 10 రోజులపాటు వారాబందీ పెడితే ఆంధ్రప్రదేశ్‌లోని చివరి ప్రాంతానికి సాగర్ నీరు వచ్చే అవకాశం ఉందని విజ్ఞప్తి చేశామన్నారు.

విశాఖలో కుటుంబం ఆత్మహత్య

కుటుంబ కలహాలే కారణమంటూ సూసైడ్ నోట్



విశాఖపట్నం (క్రైం), జనవరి 4: విశాఖ నగరంలో విషాదం చోటు చేసుకుంది. ఇద్దరు పిల్లలతో సహా భార్య, భర్త గురువారం రాత్రి ఆత్మహత్య చేసుకున్న సంఘటన ఈ ప్రాంతంలో సంచలనం సృష్టించింది. పోలీసులు అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. స్థానిక ఆరిలోవలోని ముస్తఫా కాలనీలో దేవిరెడ్డి రాజేశ్వర రెడ్డి (35), సౌమ్య (30), విష్ణు తేజ (9), జాహ్నవి (6) నివసిస్తున్నారు. గత ఏడాది జూన్‌లో వీరు ఈ కాలనీకి వచ్చినట్టు స్థానికులు చెపుతున్నారు. కాలనీలో ఇల్లు అద్దెకు తీసుకున్నారు. కుటుంబ సభ్యులు ఎప్పుడూ బయటకు వచ్చేవారు కాదని స్థానికులు తెలియచేశారు. గురువారం సాయంత్రం ఆరు గంటల సమయంలో సౌమ్య చెన్నైలో నివసిస్తున్న తన తల్లికి ఫోన్ చేసి తన పిల్లలకు విషం ఇచ్చి చంపేశానని, తను, తన భర్త కూడా ఆత్మహత్య చేసుకుంటున్నామని చెప్పి, ఫోన్ స్విచ్ ఆఫ్ చేసింది. వెంటనే చెన్నైలోని సౌమ్య బంధువులు విశాఖ పోలీసులకు ఈ సమాచారం అందించారు. రాత్రి ఎనిమిది గంటల సమయంలో పోలీసులు వెళ్లి చూడగా విష్ణు తేజ, జాహ్నవి విగత జీవులై మంచంపై పడి ఉన్నారు. రాజేశ్వర రెడ్డి, సౌమ్య బెడ్ రూమ్‌లో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఉన్నారు. పోలీసులు ఈ సమాచారాన్ని చెన్నైలోని సౌమ్య బంధువులకు తెలియచేశారు. వారు హుటాహుటిన బయల్దేరి విశాఖకు వస్తున్నారు. కాగా సౌమ్య స్వహస్తాలతో రాసిన సూసైడ్ నోట్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కేవలం కుటుంబ సమస్యలు, కుటుంబ కలహాల కారణంగా తాము ఆత్మహత్య చేసుకుంటున్నామని, తమ మరణానికి ఎవ్వరూ బాధ్యులు కారని రాసింది. ఏసీపీ రామచంద్రరావు నేతృత్వంలో పోలీసులు కేసును దర్యాప్తు చేస్తున్నారు.

శ్రీనివాస్‌ను కస్టడీకి ఇచ్చేందుకు తిరస్కృతి

బెయిల్ పిటీషన్‌నూ తిరస్కరించిన కోర్టు

12 వరకు రిమాండ్‌లో చంచల్‌గూడ జైల్లోనే

ఆంధ్రభూమి బ్యూరో

హైదరాబాద్, జనవరి 4: లైంగిక వేధింపుల కేసులో అరెస్టు అయిన గాయకుడు గజల్ శ్రీనివాస్‌ను పోలీసు కస్టడీకి ఇచ్చేందుకు కోర్టు నిరాకరించింది. అలాగే నిందితుడు దాఖలు చేసుకున్న బెయిల్ పిటీషన్ సైతం తిరస్కరించింది. ఆలయవాణి రేడియోలో పని చేస్తున్న మహిళను లైంగికంగా వేధించినట్లు ఆరోపణలు రావడం, అందుకు తగిన ఆధారాలు, వీడియో క్లిప్పింగులు పోలీసులకు చేరడంతో అరెస్టు చేసి చంచల్‌గూడ జైలుకు పంపించిన సంగతి తెలిసిందే. ఈ నెల 12 వరకు కోర్టు గజల్ శ్రీనివాస్‌కు రిమాండ్ విధించింది. నాలుగు రోజుల పాటు నిందితుడిని విచారిస్తామని, మరిన్ని వివరాలు రాబట్టేందుకు అవకాశం ఉన్నందున కస్టడీకి ఇవ్వాలని పంజాగుట్ట పోలీసులు నిందితుడిని నాంపల్లి కోర్టులో ప్రవేశపెట్టిన తర్వాతే రోజే పిటీషన్ దాఖలు చేశారు. రిమాండ్ విధించిన వెంటనే నిందితుడి తరపు న్యాయవాది కూడా బెయిల్ కోరుతూ పిటీషన్ దాఖలు చేశారు. నిందితుడికి బెయిల్ ఇవ్వవద్దని, ఇస్తే సాక్ష్యులను బెదిరించే అవకాశం ఉందని, కేసు విచారణకు ఆటంకం కలుగుతుందని పోలీసులు కౌంటర్ దాఖలు చేసి కోర్టు దృష్టికి తేవడంతో రెండు పిటీషన్ల విచారణను గురువారానికి వాయిదా వేసిన కోర్టు విచారించి రెండు వైపుల అభ్యర్థనను తోసిపుచ్చింది. దీంతో నిందితుడు ఈ నెల 12 వరకు రిమాండ్‌లో ఉండాల్సి వస్తుంది.

నత్తనడకన టన్నెల్ పనులు

పోలవరం హెడ్ వర్క్సులో ఇవీ కీలకమే

ఆంధ్రభూమి బ్యూరో

రాజమహేంద్రవరం, జనవరి 4: పోలవరం హెడ్ వర్క్సులో కీలకమైన పనులు మందగమనంలో సాగుతున్నాయి.పోలవరం హెడ్ వర్క్సులో ఎర్త్ కం రాక్ ఫిల్ డ్యామ్, స్పిల్ వే, ఎగువ, దిగువ కాఫర్ డ్యామ్‌ల నిర్మాణంతోపాటు శాడిల్ డ్యామ్, టన్నెల్స్ తదితర పనులు పూర్తి కాకుండా ప్రధాన హెడ్ వర్క్సు పూర్తయినా ప్రాజెక్టు పూర్తి కాదు. 2019 లక్ష్యం మేరకు నీళ్లివ్వాలంటే ప్రధాన ఎర్త్ కమ్ రాక్ ఫిల్ డ్యామ్‌కు అనుబంధ హెడ్ వర్క్సు అన్నీ పూర్తి కావాల్సి ఉంది. ప్రాజెక్టు కుడి, ఎడమ కనెక్టవిటీలకు సంబంధించి కుడి వైపు 900 మీటర్లు, 880 మీటర్ల టన్నెల్స్ నిర్మాణం పూర్తికావాల్సి ఉంది. అదే విధంగా ఎడమ వైపు 919 మీటర్లు, 890 మీటర్ల టన్నెల్స్ నిర్మిస్తున్నారు.

కుడి గట్టు వైపు 900 మీటర్ల టన్నెల్‌తోపాటు రానుపోను ఛానెల్స్, వాటికి గట్లు, రెగ్యులేటర్ నిర్మాణం జరుగుతోంది. ప్యాకేజీ నెంబర్ 63లో వీటి నిర్మాణం చేపట్టారు. మొదట్లో ఈ పనులకు రూ. 72.81 కోట్లతో 2005లో అగ్రిమెంట్ జరిగింది. 24 గంటల్లో పూర్తి చేయాల్సి ఉంది. గత నెల వరకు రూ.39.81 కోట్ల విలువైన 54.68 శాతం పనులు పూర్తయ్యాయి. అదే విధంగా 880 మీటర్ల టన్నెల్‌తో పాటు రానుపోను ఛానల్స్ నిర్మాణాన్ని ప్యాకేజీ 64లో చేపట్టారు. మొత్తం రూ. 73.90 కోట్ల విలువతో 24 నెలల్లో పూర్తిచేసే విధంగా అగ్రిమెంట్ అయింది. ఇప్పటి వరకు రూ. 52.11 కోట్ల విలువైన పనులు పూర్తయ్యాయి. 70.52 శాతం పనులు పూర్తిచేశారు. ఈ పనుల అంచనా విలువ కూడా పెరిగింది. ఏప్రిల్ వరకు రూ.55.36 కోట్లు ఖర్చయింది. ఈ పనులకు మొబలైజేషన్ అడ్వాన్స్‌గా రూ.8.62 కోట్లు ఇచ్చారు. దీనిని తిరిగి వడ్డీతో సహా బిల్లులో వసూలు చేశారు.

ఇక ఎడమ గట్టువైపు కనెక్టవిటీల్లో ప్రధానంగా రెండు టన్నెల్స్ నిర్మాణం పూర్తి కావాల్సి వుంది. వీటిని దేవీపట్నం మండలం కొండమొదలు ఆవలి ప్రాంతంలో కొండలను దొలిచి నిర్మిస్తున్నారు. ఇక్కడే కాలువలకు నీరు విడిచి పెట్టే రెగ్యులేటర్లు కూడా నిర్మాణం చేపట్టాల్సి వుంది. మొదట్లో ఈ పనులకు రూ. 90.99 కోట్లకు అగ్రిమెంట్ జరగ్గా 2006లోనే రూ. 12.92 కోట్ల అంచనాలు అదనపు మంజూరు ఇచ్చారు. 2005లో చేపట్టిన ఈ పనులు 2007లో పూర్తి కావాల్సి వుంది. కేవలం రూ. 15.46 కోట్ల విలువైన పనులు మాత్రమే పూర్తయ్యాయి. ఇది కేవలం 14.88 శాతం పనులే. ఈ నిర్మాణాలకు సంబంధించి చీఫ్ ఇంజనీర్ వద్ద ఒక డిజైన్ ఆమోదం పొందాల్సి ఉంది. మరో డిజైన్‌ను తిరస్కరించారు. ఈ పనులను ప్యాకేజీ 65లో జరుగుతున్నాయి. ఇక ప్యాకేజీ 66లో 890 మీటర్ల టన్నెల్ నిర్మాణాన్ని ఎడమ గట్టు వైపు కనెక్టవిటీలో చేపట్టారు. ఇది శాడిల్ డ్యామ్‌ను అనుసంధానంగా చేపట్టాల్సి వుంది. రూ. 90 కోట్ల అంచనా విలువతో చేపట్టారు. పనులను రెండేళ్లలో పూర్తి చేయాల్సి ఉంది. ఇప్పటి వరకు కేవలం రూ. 19.17 కోట్ల విలువైన పనులు పూర్తయ్యాయి. కేవలం 24.87 శాతమే పూర్తయ్యాయి. ఇక డిజైన్ల విషయానికొస్తే ఒక డిజైన్‌ను తిరస్కరించారు. కుడి, ఎడమ గట్ల వైపు కనెక్టవిటీలు, రెగ్యులేటర్ల పనులు కూడా శరవేగంగా పూర్తి చేసినపుడే లక్ష్యం మేరకు నీరందించేందుకు వీలు కలుగుతుంది. ప్రధాన డ్యామ్‌లు, కాఫర్ డ్యామ్, స్పిల్ వే నిర్మాణాలతో పాటు రెగ్యులేటర్లు, అండర్ టన్నెల్స్ నిర్మాణం పూర్తి కావాల్సి ఉంది. టన్నెల్స్ పనులకు లక్ష్యాలను నిర్ధేశించుకుని పనులు పరుగు పెట్టించకపోతే కాలువల్లోకి నీరెళ్ళే పరిస్థితి వుండదు. ఏదేమైనప్పటికీ హెడ్‌వర్క్సు మొత్తం పనులపై దృష్టి కేంద్రీకరించాల్సి ఉంది.

ఆంధ్రభూమి
జననీ జన్మభూమిశ్చ స్వర్గాదపి గరీయసీ
శుక్రవారం, 5 జనవరి 2018

నకిలీ 'స్వచ్ఛందం'..

ప్రభుత్వేతర స్వచ్ఛంద సంస్థలు వివిధ రకాల అక్రమాలకు పాల్పడుతుండడం గురించి ఏళ్ల తరబడి చర్చ జరుగుతోంది! దాదాపు నాలుగు వేల తొమ్మిది వందల ప్రభుత్వేతర స్వచ్ఛంద సంస్థలు - నాన్ గవర్నమెంట్ ఆర్గనైజేషన్స్ - 'ఎన్‌జిఓ'లు - విదేశీయ నిధులను స్వీకరించకుండా కేంద్రప్రభుత్వం కొత్తగా నిర్ధారించడంతో ఈ 'అక్రమాల' పట్ల మరోసారి ప్రజల ధ్యాస పెరిగింది. విదేశాల నుంచి నిధులను పొందదలచిన 'స్వచ్ఛంద సంస్థలు' 'విదేశ ఆర్థిక ప్రదాన నియంత్రణ' - ఫారిన్ కంట్రిబ్యూషన్ రెగ్యులేషన్ - ఎఫ్‌సిఆర్‌ఏ - చట్టం ప్రకారం నమోదు చేసుకోవలసి ఉంది! అక్రమాలకు ఒడిగట్టిన వేలాది 'సంస్థల' 'ఎఫ్‌సిఆర్‌ఏ' గుర్తింపును గత మూడేళ్లుగా కేంద్రప్రభుత్వం రద్దు చేసింది! ఇప్పుడు గుర్తింపు రద్దయిన సంస్థలు ఒడిగట్టిన 'అక్రమం' ఆరేళ్లపాటు ఆదాయవ్యయ గణాంకాల వివరాలను ప్రభుత్వానికి సమర్పించకపోవడం.. దేశంలోని దాదాపు పదివేల 'సంస్థలు' ఈ అక్రమానికి ఒడిగట్టినట్లు దేశ వ్యవహారాల సహాయ మంత్రి కిరణ్ రిజిజు బుధవారం రాజ్యసభలో వెల్లడి చేయడం ఆందోళనకరం. 'ఎన్‌జిఓ'లలో కొన్ని దేశ వ్యతిరేక కలాపాలకు పాల్పడుతుండడం బహిరంగ రహస్యం! ఇలా జమాఖర్చులు చెప్పని ఈ పదివేల సంస్థలపై చర్య తీసుకొనకుండా ప్రభుత్వం ఆరేళ్లు ఉపేక్షించడం విచిత్రమైన వ్యవహారం! దాదాపు ఆరువేల 'ఎన్‌జిఓ'లను మాత్రమే ఇప్పటివరకూ సంజాయిషీ చెప్పవలసిందిగా ప్రభుత్వం కోరిందట! సంజాయిషీ చెప్పని దాదాపు నాలుగువేల తొమ్మిది వందల సంస్థలకు విదేశీయ విరాళాలు స్వీకరించే అవకాశం రద్దయిపోయింది. ఇలా 'అక్రమా'నికి ఒడిగట్టి చర్యకుగురైన సంస్థలలో అత్యధికం ఆంధ్రప్రదేశ్‌లో ఉన్నాయి, నాలుగు వందల యాబయి నాలుగు సంస్థల 'విదేశీయ విరాళాల' గుర్తింపు రద్దయింది. తెలంగాణకు చెందిన నూట తొంబయి 'ఎన్‌జిఓ'ల గుర్తింపుకూడ రద్దయింది! లెక్కలు - ఆరేళ్లపాటు - చూపని మిగిలిన 'ఎన్‌జిఓ'లకు ప్రభుత్వం ఇంకా 'సంజాయిషీ' తాకీదులను జారీ చేయవలసి ఉంది! 'ఎన్‌జిఓ'లకు విదేశాల నుంచి లభిస్తున్న విరాళాల సంఖ్య, నిధుల పరిమాణం క్రమంగా తగ్గుతుండడం శుభపరిణామం. అక్రమ నిధులపై ప్రభుత్వం 'నిఘా' పెరగడం ఇందుకు కారణం కావచ్చు!!

గత ఆర్థిక సంవత్సరంలో దేశంలోని 'ఎన్‌జిఓ'లకు పదమూడు వేల ఏడు వందల యాబయి కోట్ల రూపాయల విదేశీయ విరాళాలు లభించాయట! అంతకుముందు ఆర్థిక సంవత్సరంలో పదిహేడు వేల ఏడువందల డెబ్బయి మూడు వేల కోట్ల రూపాయల విదేశీయ నిధులు ఈ 'సంస్థల'కు ముట్టాయి. అంటే సంవత్సరం వ్యవధిలో నాలుగు వేల కోట్ల రూపాయల విదేశీయ విరాళాలు తగ్గిపోయాయి! 'ఎఫ్‌సిఆర్‌ఏ' నిబంధనలను ప్రభుత్వం నిర్దిష్టంగా అమలు జరుపడం ఇందుకు కారణం! విదేశీయ విరాళాలను పొందుతున్న 'సంస్థల'లో కొన్ని దేశంలో పుట్టి పెరిగిన మతాలకు చెందినవారిని విదేశాల నుంచి వ్యాపించిన మతాలలోకి మార్చుతున్నట్టు దశాబ్దులుగా ప్రచారమౌతోంది. ఈ మతం మార్పిడి ముఠాలు 'స్వచ్ఛందం' ముసుగేసుకొని 'సేవ' పేరుతో చెలామణి అవుతున్నాయి! మరికొన్ని 'ఎన్‌జిఓ'లు స్వచ్ఛంద సేవ పేరుతో పరిశోధన పేరుతో పాకిస్తాన్ ప్రేరిత 'జిహాదీ' బీభత్స కాండను ప్రత్యక్షంగాను, పరోక్షంగాను ప్రోత్సహిస్తున్నాయి. 'స్వచ్ఛందం' మాటున మరికొన్ని సంస్థలు వివిధ దేశాల తరపున గూఢచర్యం సాగిస్తూ మనదేశాన్ని బలహీన పరచడానికి యత్నిస్తున్నాయి! మాదకద్రవ్యాల దొంగ రవాణా, అటవీ సంపదను అక్రమంగా తరలించడం వంటి కలాపాలకు సైతం కొన్ని 'ఎన్‌జిఓ'లు పాల్పడుతున్నాయి. స్వదేశంలోను విదేశాలలోను సేకరించిన నిధులను సమాజ అభ్యుదయానికికాక 'స్వాభ్యుదయ' కార్యక్రమాలకు వినియోగిస్తున్న 'ఎన్‌జిఓ'ల నిర్వాహకులు కోకొల్లలు... 'ఎన్‌జిఓ'ను నడుపుతున్నాడంటే ''చట్టబద్ధం''గా సమాజాన్ని కొల్లగొడుతున్నాడన్నది వాస్తవాన్ని ప్రతిబింబించిన 'చతురోక్తి'.. నిస్వార్థంగా సమాజసేవ చేసిన చేస్తున్న 'ఎన్‌జిఓ'లు కూడ చాలా ఉన్నాయి. కానీ వాటికి ప్రచారం తక్కువ..!

దేశంలో వెలసి ఉన్న ముప్పయి లక్షల 'ఎన్‌జిఓ'ల ఆర్థిక కలాపాలను 'సమీక్ష' - ఆడిటింగ్ - చేయాలని గత ఏడాది జనవరి పదవ తేదీన సర్వోన్నత న్యాయస్థానం కేంద్ర ప్రభుత్వాన్ని ఆదేశించడం 'నకిలీ సంస్థల'ను పసికట్టడానికి, కట్టడి చేయడానికి దోహదం చేసిన పరిణామం! ప్రభుత్వ నిధులను పొందుతున్న 'ఎన్‌జిఓ'లు నియమావళికి అనుగుణంగా లక్ష్యాల సాధన కోసం ఆ నిధులను ఖర్చుపెట్టాలి! అలా ఖర్చు చేయడంలో విఫలమైన 'ఎన్‌జిఓ'లు ఆ సొమ్మును ప్రభుత్వానికి - రాష్ట్రపతికి - తిరిగి చెల్లించాలని నిర్దేశిస్తూ కేంద్రప్రభుత్వం నియమావళిని సవరించింది కూడ! జాతివ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడిన అభియోగంపై కేంద్ర ప్రభుత్వం 2014 నుంచి దశలవారీగా అనేక 'ఎన్‌జిఓ'ల 'విదేశీయ నిధులు పొందే' అనుమతులను రద్దు చేసింది! 2016 నవంబర్‌లో దాదాపు పాతిక సంస్థల అనుమతులు ఒకేసారి రద్దు కావడంతో 'ఎన్‌జిఓ'ల ముసుగులో జరుగుతున్న దేశద్రోహ కలాపాలు బట్టబయలయ్యాయి! 'ఏవాంజలిస్ట్' అంటే ఇతర మతాలవారిని క్రైస్తవ మతంలోకి మార్చేవాడన్నది రూఢీపడిన వాస్తవం! మన ఏవాంజిలికల్ - క్రైస్తవంలోకి మతం మార్పిడి చేసే - ఎన్‌జిఓలు 2015-16లో దాదాపు మూడువేల కోట్ల రూపాయల విదేశీయ నిధులు స్వీకరించినట్టు గత ఏడాది మార్చిలో ధ్రువపడింది. 'అయన' అన్న కేరళలోని 'ఏవాంజలిస్ట్' సంస్థకు దేశంలోనే అత్యధికంగా ఎనిమిది వందల ఇరవై ఆరు కోట్ల రూపాయలు విదేశాల నుంచి లభించాయట! 'గోస్పెల్ ఫర్ ఆసియా' పేరుతో వెలసిన 'ఎన్‌జిఓ' అనేక దేశాలలో అభిశంసనకు గురి అయింది, బహిష్కరణకు గురి అయింది. ఈ సంస్థ పేరు మార్చుకొని 'అయన' సేవా సంస్థగా వెలసిందట! మతం మార్పిడులకు విదేశాల నుంచి లభిస్తున్న ఆర్థిక సహాయానికి ఇది ఒక ఉదాహరణ మాత్రమే!!

బంగ్లాదేశ్‌లోను మనదేశంలోను జరిగిన అనేక బీభత్స జిహాదీ హత్యాకాండలకు జాకిర్ నాయక్ అన్న ప్రచ్ఛన్న బీభత్సకారుడు సూత్రధారుడు! ముంబయి కేంద్రంగా ఇతగాడు నడిపిన 'ఇస్లామిక్ రీసెర్చ్ ఫౌండేషన్' అన్న స్వచ్ఛంద సంస్థకు విదేశాల నుంచి భారీగా విరాళాలు లభించాయి. నేరస్థుడుగా ధ్రువపడిన జాకిర్ నాయక్ సౌదీ అరేబియాకు పారిపోయాడు...!! నిజమైన సేవకు 'నకిలీ' గ్రహణం పట్టి ఉండడం నడుస్తున్న చరిత్ర..

ఉపదేశాలు మాని ఉద్ధరిస్తే మేలు

భాస్కరవాణి

హైదరాబాద్ నడిబొడ్డున గతనెలలో సంధ్యారాణి అనే యువతిని ప్రేమోన్మాది కార్తీక్ కిరాతకంగా పెట్రోల్ పోసి హత్య చేశాడు. దీనికి కారణం అతని ప్రేమను సంధ్యారాణి తిరస్కరించడమే! 'ఏకపక్ష ప్రేమ'తో చాలాచోట్ల ఇలాంటి దారుణాలు వెలుగుచూస్తున్నా, కొన్ని మాత్రమే తెరపైన కన్పిస్తున్నాయి. ఇవాళ ఇంజనీరింగ్, మెడికల్ కళాశాలల చుట్టుప్రక్కల స్థలాలు, పార్కులు, క్లబ్బులు, పబ్బులు, కాఫీ షాపులు ఈ అపరిపక్వ ప్రేమకు వేదికలవుతున్నాయి. ఇవి కొన్ని సత్ఫలితం ఇచ్చి వివాహం జరుగగా, మరికొన్ని మధ్యలోనే వికటిస్తున్నాయి. ఫ్యామిలీ కోర్టుల్లో భార్యాభర్తల కేసులు, ఇతర కోర్టుల్లో విడాకుల కేసుల సంఖ్యలు లెక్కకు మిక్కిలిగా వున్నాయి. ఇక ప్రేమ పేరుతో జరుగుతున్న అఘాయిత్యాలకు అంతే లేదు. గృహహింస, స్త్రీలపై హింస మనం రికార్డు స్థాయిలో నమోదు చేసుకొన్నాం. దీని వెనుక ఉన్న ప్రధాన కారణం ఏమిటి?!

అపరిపక్వ ప్రేమను సినిమాల్లో ప్రమోట్ చేస్తూ యవ్వనారంభ దశలోని యువతరం మనసులను విషపూరితం చేస్తున్న సినిమాలపై నియంత్రణ లేదా? ఆ కథలతో జీవితంలో 'ప్రేమ' తప్ప ఇంకోటి లేదనుకొని ఆత్మహత్య చేసుకొంటున్నవాళ్లకు, లేదా ప్రేమకోసం హింసకు పాల్పడే కథలతో తీసిన సినిమాలను చూసి స్త్రీలపై జరిపే అత్యాచారాలను ఆపే వ్యవస్థ లేని సమాజంలో మనం జీవిస్తున్నామా?

ఒక సుప్రసిద్ధ సినిమా నటుడు తన జీవితం మొత్తంలో ముప్ఫై ఏళ్లకుపైగా సినిమాల్లో నటించాడు. ఆయన ప్రతి చలన చిత్రంలో దాదాపు విలన్ కూతురును ఎత్తుకెళ్లో, ప్రేమించో పెళ్లి చేసుకొన్నట్టు నటించాడు. చివరకు తన కూతురు ఒక అబ్బాయిని ప్రేమించి పెళ్లిచేసుకొంటే తెగ బాధపడినట్లు పత్రికల్లో చదివాం. ''మీ సందేశాన్ని మీ కూతురు అమలుచేస్తే తప్పెలా అవుతుంది!'' అనడం మన తప్పు!? ఇవాళ సినిమా రంగం మనం అవునన్నా కాదన్నా ప్రజలపై తప్పక ప్రభావం చూపిస్తుంది. ముఖ్యంగా యువతీ యువకులకు సినిమాలన్నా, సినిమా నటులన్నా చాలా క్రేజ్. వాళ్ల భాష, వేషం, ప్రవర్తన, నటన.. అన్నింటిని యువకులు ఆదర్శంగా తీసుకొంటున్నారు. ఇటీవలకాలంలో బుల్లితెర మాధ్యమాల ప్రభావం ఎక్కువ కావడంవల్ల సినిమా నటులు అనేక షోలల్లో నటిస్తున్నారు. కొందరికి సినిమా అవకాశం తగ్గాక ఇలా వెండితెరపై మళ్లా కాంతులీనుతున్నారు. సినిమా నటులు మొదలుకొని బిత్తిరిసత్తి వరకు అందరూ ఇవాళ సెలబ్రిటీలుగా యువతరంతో ఆరాధింపబడుతున్నారు. ఈ సెలబ్రిటీలే ఎన్నో వ్యాపార, వాణిజ్య ప్రకటనలకు ప్రమోటర్లుగా ఉన్నారు. వస్తువులు మొదలుకొని రియల్ ఎస్టేట్ ప్లాట్లు కొనుగోలు వరకు అన్నీ కొనుక్కోమని ఊదరగొడుతున్నారు. ఒక పేస్ట్ మంచిదా! చెడ్డదా! అని నిర్ణయించాల్సిన డెంటల్ డాక్టర్ల వేషం కూడా సినిమా యాక్టర్లే తెల్లకోటు వేసుకుని రకరకాల పేస్టులు కొనిపిస్తున్నారు. మన దేశంలో కోట్ల మంది ప్రజలు త్రాగునీటి కోసం అల్లాడుతుంటే మనల్ని కోకోకోలా, పెప్సీలు తాగమని సినిమాతారలు మన మెదళ్లలోకి చొచ్చుకుపోయే విధంగా చెప్పడం 'జాతీయనేరం' కాదా! కోకోకోలావల్ల మన దేశ ఆర్థిక వ్యవస్థకు, ప్రజల అనారోగ్యానికి, మన భూగర్భ జలాల విధ్వంసానికి ఈ అడ్వర్టైజ్‌మెంట్ చేసే సినిమా నటులు వ్యక్తిగతంగా బాధ్యత వహిస్తారా? కోల్గేట్, కోకోకోలా, క్లోజప్, ఫోర్‌హన్స్ మొదలుకొని అండర్‌వేర్‌ల వరకు అన్నీ వీరికి ఆదాయ వనరులే.

బహుళజాతి కంపెనీల మాయలో ప్రజలనూ, ప్రభుత్వాన్ని తెలియకుండానే పడేస్తున్న సినిమా తారలు, క్రికెటర్లు దేశాన్ని విషాదంలో నింపడమే కాదు, వాళ్లూ వివాదాల్లో చిక్కుకొంటున్నారు. 1977లో మొరార్జీ దేశాయి ప్రభుత్వం జీరో టెక్నాలజీకి చెందిన 840 ఉత్పత్తుల జాబితా సిద్ధం చేసి వాటివల్ల ప్రజలకు, మన దేశ ఆర్థిక వ్యవస్థకు భంగం కలుగుతుందని వాటిపై నిషేధం విధించాలని ప్రతిపాదించింది. సరళీకరణ, ప్రపంచీకరణలో భాగంగా ప్రపంచాన్ని గ్లోబల్ విలేజ్‌గా మార్చుతున్న క్రమంలో ప్రపంచంలో ఎక్కువ మానవ వనరులున్న మన దేశం అందరికీ పెద్ద మార్కెట్‌గా మారింది.

ఈ మార్కెట్‌ను విస్తరించే క్రమంలో మన సెలబ్రిటీల పాత్ర ఎక్కువగా వుంది. అందమైన ముఖాలు మార్కెట్ చేస్తున్న ఈ తరుణంలో సినిమా తారలు జీవితాలను మార్కెట్‌గా మార్చేశారు. సమాజంలోని యువతరాన్ని మానసిక రోగులుగా మార్చేస్తున్నారు. ప్రపంచంలోనే అత్యధిక యువ జనాభా ఉన్న మన దేశం ఒకప్పుడు ..... స్వామి వివేకానందను సృష్టించింది. ప్రపంచ ఆధ్యాత్మిక రంగాన్ని ఆ యువకుడు ఉర్రూతలూగించాడు. 25 ఏళ్లు నిండకుండానే ఉరిత్రాడును ముద్దాడడానికి సిద్ధమైన భగత్‌సింగ్, రాజగురు, సుఖదేవ్‌లు ఈ గడ్డపై ప్రభవించారు. అలాంటి చైతన్యమూర్తులు జన్మించిన ఈ గడ్డపై యువతరాన్ని ఎటువైపు తీసుకుపోతున్నాం?

ప్రతి విషయాన్ని మార్కెట్ కోణంలో చూపించే పాశ్చాత్య సంస్కృతిని సినిమాల ద్వారా మన సమాజంలోకి ఒంపుతున్న ఆ రంగానికి చెందిన మేధావులు జీవితాన్ని కళగా మార్చాల్సింది పోయి కళనే జీవితంగా భ్రమింపజేస్తున్నారు. పెద్ద జనాభా ఉన్నందువల్ల ఈ ప్రభావం మనకు తెలియడంలేదు. ఒకవేళ మన దేశం ఐర్లండ్, నార్వే, క్యూబా లాగా చిన్నదేశాలుగా ఉండేట్టు అయితే అప్పుడు మన సమాజం పరిస్థితి ఏమిటి?

> **ఈ సెలబ్రిటీలే ఎన్నో వ్యాపార, వాణిజ్య ప్రకటనలకు ప్రమోటర్లుగా ఉన్నారు. వస్తువులు మొదలుకొని రియల్ ఎస్టేట్ ప్లాట్లు కొనుగోలు వరకు అన్నీ కొనుక్కోమని ఊదరగొడుతున్నారు. ఒక పేస్ట్ మంచిదా! చెడ్డదా! అని నిర్ణయించాల్సిన డెంటల్ డాక్టర్ల వేషం కూడా సినిమా యాక్టర్లే తెల్లకోటు వేసుకుని రకరకాల పేస్టులు కొనిపిస్తున్నారు. మన దేశంలో కోట్లమంది ప్రజలు త్రాగునీటి కోసం అల్లాడుతుంటే మనల్ని కోకోకోలా, పెప్సీలు తాగమని సినిమా తారలు మన మెదళ్లలోకి చొచ్చుకుపోయే విధంగా చెప్పడం 'జాతీయనేరం' కాదా!**

ఐరోపా సమాజంలో సాంకేతికాభివృద్ధి బ్రహ్మాండంగా జరిగినా కొన్ని విషయాల్లో వారి నైతిక పతనం అక్కడి బుద్ధిజీవులకు నిద్రపట్టనివ్వడంలేదు. ఈ విశృంఖలత్వం మెల్లమెల్లగా మన సమాజంలోకి తీసుకువస్తున్నవాళ్లు ఎక్కువగా సినిమా రంగంవారే అంటే మనపై విరుచుకుపడతారు. పదేళ్ల క్రితం బ్రిటన్‌లో 11 ఏళ్ళ బాలుడు 15 ఏళ్ల అమ్మాయిని గర్భవతిని చేశాడు. ఆనాడు అదొక వార్త. కానీ ఈ దుస్థితి మనకు దాపురించింది. ఏ వార్తాపత్రిక తిరగేసినా 'నేరాలు - ఘోరాలు' పేరుతో ప్రత్యేక శీర్షిక పెట్టాల్సిన దుర్దశ వచ్చింది. హత్యలు, అత్యాచారాలు ఈనాటి పాఠకుల దృష్టిలో సాధారణంగా మారిపోయాయి. సినిమాల్లో సున్నితంగా కన్పిస్తున్న 'ప్రేమ' కథనాలు స్త్రీలపై అత్యాచారాలకు పరోక్షంగా కారణం అవుతున్నాయి. అపరిపక్వమైన మనసున్న వ్యక్తులు దీనిని నిజంగా జీవితంలోకి తీసుకురావాలనుకొన్నపుడే సంఘర్షణ తీవ్రరూపం దాల్చింది. ప్రేమ అనగానే ఇద్దరు స్త్రీ, పురుషుల మధ్య మాత్రమే జరిగే రసాయన ప్రక్రియగా చూపిస్తున్న సెల్యులాయిడ్ మగధీరులకు ఎవరు చెప్పగలరు? అదీ ఇరవై ఏళ్ల వయసున్న యువతలో నాటుతున్న విషబీజంగా మారడం దురదృష్టం. మార్కెట్‌లోకి వస్తున్న చలనచిత్రాల్లో ఎనభై శాతం ఈ రకానికి అద్దం పట్టడం దిగజారిన విలువలకు ప్రతీక. ఇదంతా 'కళాఖండం' అంటూ సినిమా పెద్దలు దబాయించడం మరో నయవంచన. నిజానికి ప్రేమ అనేది ఒక అమర్త్యమైన ఆనంద భావన. అది బంధాన్ని తెలిపేది. ఎన్నో రకాలుగా ఉన్న ప్రేమను గుర్తించకుండా దానిని ఒక లైంగిక వాంఛ తీర్చే సాధనంగా మార్చడం క్షమించరాని నేరం. స్త్రీలపై పురుషులకు, పురుషులపై స్త్రీలకు ప్రేమ ఉంటే దానిని 'మోహం' అని, ధనంపై ప్రేమ ఉంటే అది 'లోభం' అని, పుత్ర పౌత్రాదులపై ప్రేమ ఉంటే 'వాత్సల్యం' అని, దేహంపై ప్రేమను 'అభిమానం' అని పిలుస్తారు. అలాగే దీనప్రాణులపై ప్రేమ ఉంటే 'దయ'గా, వస్తువులపై ప్రేమ వుంటే 'మమకారం'గా, మన సమానులపై ప్రేమ వుంటే 'మైత్రి'గా, సత్పురుషులపై, పెద్దవారిపై వుండే ప్రేమను గౌరవంగా, దేవునిపై, గురువుపై ఉండే ప్రేమను భక్తిగా చెప్పారు. కానీ ఈనాడు సినిమా ప్రభావంవల్ల ప్రేమ సంకుచిత రూపం పొంది పరోక్ష హింసకు కారణం అవుతుంది.

అలాగే సినిమాల్లోని అతిశయోక్తులవల్ల సమాజంలో విపరీతంగా అశాంతి పెరిగిపోతుంది. ఈ అశాంతికి కారణమైనవారే నేడు వివిధ వేదికల ద్వారా, రాజకీయాల్లో చేరడం ద్వారా నీతివాక్యాలు వల్లిస్తున్నారు. వారి జీవితాలే ఆదర్శంగా ఆరాధిస్తున్న యువశక్తి విధ్వంసం అవుతోంది. ఇటీవల పాటల రిలీజ్‌లు, సినిమా విజయోత్సవాలు ఘనంగా నిర్వహిస్తూ లక్షలాది రూపాయలు వెచ్చిస్తున్నారు. రియాలిటీ షోల పేరుతో కోట్లాది రూపాయలు చేతులు మారుతున్నాయి. అతివ అందాన్ని మార్కెట్‌గా మార్చి ఏమార్చుతున్న తారాగణం వైఖరిలో మార్పు తెచ్చేవారెవరు?

ఆఖరుకు రాజకీయ వ్యవస్థ కూడా సినిమా రంగానికి లొంగిపోతున్న వైనం చూస్తాం. కొందరు నటీనటులు ఏ పార్టీ అధికారంలో వస్తే వారికి బాజా వాయిస్తూ తమ ఆస్తులను కాపాడుకుంటున్నారు. సమాజంలో ప్రజాస్వామ్య వాతావరణ నిర్మాణాన్ని వదిలేసి అభూత కల్పనల పెద్దరికాన్ని బలవంతంగా మన మెదళ్లలోకి చొప్పిస్తున్నారు. అనేక సంఘర్షణలతో సతమతమవుతున్న మనుషులను అశాంతికి గురిచేస్తున్నారు. డబ్బు, అధికారం, రూపం మాత్రమే గొప్పవన్న భావన కల్పిస్తూ మానవతా లక్షణాలను మంటగలుపుతున్నారు. వినోదం మాత్రమే మనిషికి ప్రధానం అన్న ఏకైక లక్ష్యంతో సినిమా వ్యవస్థ పనిచేస్తూ ధనార్జన చేస్తుంది. కథలో అంతస్సూత్రం ఎలా ఉన్నా, అది ఎలాంటి సందేశం ఇచ్చినా పేర్లు మహా విచిత్రంగా ఉంటున్నాయి. పోకిరి, ఇడియెట్, జేబుదొంగ, అసెంబ్లీ రౌడీ, ఐ లవ్ యు టీచర్.. లాంటి పేర్లు ఉదాహరణ మాత్రమే! ఇక కులాలపై, మతాలపై సినిమాలు నిర్మించి విడుదలకు ముందే వివాదాలు సృష్టించి ప్రచారం పొందుతున్నారు. కొన్ని కుటుంబాలకే అగ్రతాంబూలం ఇచ్చే షోలు ఈ మధ్య ఎక్కువైపోయాయి. వాళ్ల పండుగలు మొదలుకొని పచ్చిగడ్డి వరకు అన్నింటికి అడ్వర్టైజ్ చేస్తారు.

ధనార్జనే జీవిత లక్ష్యంగా సాగే ఈ తంతు విలువలకు తావులేకుండా పోవడంతో సమాజంలో సంఘర్షణ మొదలయ్యింది. వ్యక్తిని కులానికి, మతానికి, వర్గానికి పరిమితం చేసే కుటిల రాజకీయ చదరంగం ఒకవైపు నడుస్తుంటే వ్యక్తిత్వాన్ని అపరిపక్వ 'ప్రేమ' అనే చట్రంలో ఇరికించి సినిమా రంగం యువతను పెడద్రోవ పట్టిస్తుంది. ఇందులో కొందరికి మినహాయింపు ఉన్నా సింహభాగం ఇదే తంతు నడుస్తోంది. అనేక దుశ్చర్యలతో మనిషిని పశువుగా మార్చివేస్తున్న ఈ రంగంవారే మహాత్ముల్లా సందేశాలు ఇస్తుంటే రేపటితరం భవిష్యత్తు ఏమిటనే ప్రశ్న ఎందరి మెదళ్లనో తొలుస్తుంది. సమాజంలోని బుద్ధిజీవులు ఈ విషయంపై తీవ్రంగా ఆలోచించకుంటే కాన్సర్‌లా లోపల పుట్టిన ఈ పుండు సమాజాన్ని నిర్వీర్యం చేయడం ఖాయం. మేడిపండులా పైన నిగనిగలాడుతూ లోపల మురిగిపోయిన సమాజం గొప్ప దేశాన్ని ఎలా నిర్మించుకుంటుందో ఆలోచించాలి?

-డా. పి.భాస్కరయోగి bhaskarayogi.p@gmail.com

తెలుగంటే చేదా?

ఉమ్మడి తెలుగు రాష్ట్రంగా ఉన్నప్పుడు తెలుగు భాషకి ప్రాచీన హోదా కోసం పోరాడాం. అదీ పొరుగువారు సంపాదించేసుకున్నారు, మనకి లేదే! అనే ఆవేదనతో! ఆ హోదా వచ్చాక మనం పొరుగు రాష్ట్రాలు భాష కోసం చేపడుతున్న విధానాలు అనుసరిస్తున్నామా? నిమ్మకు నీరెత్తినట్లు ఊరుకుంటున్నాం. భాషా దినోత్సవం అంటూ ఏడాదికి ఒక రోజు వేదికలెక్కి మొక్కుబడిగా ఉపన్యాసాలిస్తే అక్కడితో అయిపోయిందా? చేపట్టవలసిన కార్యక్రమాలకి పునాదులైనా వేస్తున్నామా? కోట్ల ఖర్చుతో తెలంగాణ ప్రభుత్వం ఇటీవల నిర్వహించిన ప్రపంచ తెలుగు మహాసభలు ఆ రాష్ట్రంలోని మేధావులనైనా సంతృప్తి పరిచాయా అన్నది సందేహాస్పదమే! తెలుగు మాధ్యమాలలో చదివిన వారికి ఉద్యోగావకాశాలు మాటలలో కాక చేతలలో రెండు తెలుగు రాష్ట్రాలూ కల్పించాలి. రిజర్వేషన్ల పేరుతో తెలుగు సరిగారాని తెలుగు ఉపాధ్యాయుల్ని నియమిస్తే పిల్లల చదువూ అంతంతమాత్రంగానే ఉంటుంది. ఏ రంగంలోనైనా కులమతాలకి ప్రాధాన్యం ఇవ్వకుండా ప్రతిభకి పట్టం కట్టిన రోజు అన్ని రంగాలూ బాగుపడతాయి. దేశం సుభిక్షమౌతుంది. స్వతంత్రం వచ్చిన కొత్తలో వెనుకబడినవారిని ప్రోత్సహించడానికి ప్రారంభించిన రిజర్వేషన్లు ఏడు దశాబ్దాలు గడిచినా తొలగించకపోవడం ఎన్నో అనర్థాలకి కారణమవుతోంది. మేధావులు గతిలేక పరదేశాలు పట్టిపోతున్నారు. నిజంగా వెనుకబడివారూ ఆర్థికంగా వెనుకబడినవారూ అలాగే ఉంటున్నారు. ఆ పేరు చెప్పుకుని దొంగ సర్టిఫికెట్లతో రిజర్వేషన్ కోటాలో ఉద్యోగాలు సీట్లు సంపాదించుకునేవారు నానాటికీ పెరుగుతున్నారు. ఈ రిజర్వేషన్ల పేరుతో ధనవంతులే లాభాలు పొందుతున్నారు. పేదలు పేదలుగానే ఉంటున్నారు. దేశంలో ఏ ప్రాంతానికి వెళ్లినా ఉపయోగమని హిందీ రెండవ భాషగా చదివిస్తున్నారు పిల్లల్ని. మూడవ భాష ఉంటే ఏ ఫ్రెంచో చదివిస్తున్నారు. తెలుగు నేర్చుకుంటే ఉపయోగమేమిటి? అనేవాళ్లు ఎక్కువవుతున్నారు.

'దేశ భాషలందు తెలుగు లెస్స' అని రాయలువారిచేత కీర్తింపబడిన మన తెలుగు.. తమిళ కవి భారతీయార్ 'సుందర తెలుగు' అని మెచ్చుకున్న మన తెలుగు నేడు నానాటికీ తీసికట్టుగా మారుతోంది. ఇకమీదట తెలుగు లెస్స కాస్తా ఆంగ్ల లెస్‌గా మారే ప్రమాదం కళ్లముందు కదలాడుతోంది. ప్రభుత్వాలని నిందించి ప్రయోజనం లేదు. మనుషుల్లో మార్పు రావాలి. పాశ్చాత్య వ్యామోహం ఆంగ్ల వ్యామోహం నేటి తల్లిదండ్రుల్లో విపరీతంగా పెరిగిపోతోంది. పిల్లల్ని తెలుగు మాధ్యమాల్లో చదివించడానికి కనీసం రెండవ భాషగా తెలుగు నేర్పించడానికి కూడా వారు సిద్ధంగా లేరు. అందువల్లే కొన్ని తెలుగు విద్యాలయాలు కనుమరుగవుతున్నాయి. 'మా పిల్లలకి తెలుగు రాదు' అని చెబుతూ సిగ్గుపడడానికి బదులు గర్వపడుతున్నారు. మనని తెలుగులో చదివించిన తల్లిదండ్రులు బుద్ధిహీనులా? మనం చెడిపోయామా? మనం వారికన్నా గొప్పగా మనపిల్లల్ని పెంచుతున్నామనుకుంటున్నాము. కొన్నాళ్లకి మనని వయసుపైబడి చావుబతుకులలో ఉన్నా పట్టించుకోక విదేశాల్లో వారు స్థిరపడినప్పుడు తెలుస్తుంది. మనం ఎంత గొప్ప తెలివైనవారమో! అప్పుడు పిల్లల్ని తిట్టుకుని ప్రయోజనం లేదు. చేసుకున్న దానికి ఫలితం అనుభవించాల్సిందే!

కార్లలోతిరగడం డాలర్లు సంపాదించడంలో ఆనందముందా? తల్లిదండ్రులతో పిల్లలతో ఒకరికొకరు సాయపడుతూ జీవించడంలో ఆనందముందా? పరభాషలో మాట్లాడుతూ పరదేశంలో ఉంటూ ఆ దేశీయులకు ఊడిగం చేస్తూ తల్లిదండ్రులేమైపోయినా పరవాలేదనుకునేవారు ఏ కష్టం లేకుండా సంతోషంగా ఉన్నారా? లేచిన దగ్గర్నించీ పడుకునే వరకూ ఒత్తిడులే! పరుగులే! అక్కడిలాగే ఇక్కడా భార్యభర్తలిద్దరూ పనిచేసుకుంటే అక్కడికంటే ఇక్కడే ఆనందంగా జీవించవచ్చు. తల్లిదండ్రులను, పిల్లలని, భాషని కూడా రక్షించినవారవుతారు. మన ఉనికికి కారణమైన మనదేశం, మన భాష, మన తల్లిదండ్రులు మనకి చేదా? నేడు చాలామంది అడుగుతున్న ప్రశ్న. 'ఈ దేశం మాకేమిచ్చింది?' అని. నేనడుగుతున్నా 'ఏమివ్వలేదు?' అని. లేనివి ఊహించుకుని భూతద్దంలో చూడకుండా మంచిమనసుతో చూస్తే మనదేశంలో లేనిది లేదు. ముఖ్యంగా ప్రశాంతత. అందుకే ఇతర దేశస్థులు మానసిక ప్రశాంతత కోసం ఇక్కడికి వస్తున్నారు. మనవాళ్లు మాతృభూమిని, మాతృభాషని, తల్లిదండ్రులను వదిలి పాశ్చాత్య వ్యామోహంతో అదే గొప్ప అని భావిస్తున్నారు.

-ఆర్.ఎస్.హైమావతి

గజల్ - రజనీ - ఉప్మా

జనాంతికం

బుద్ధా మురళి
buddhamurali2464@gmail.com

''మీ అన్నయ్య వచ్చాడు. నాకోసం చేసిన ఉప్మాను మీ అన్నయ్యకు పెట్టు''

''ఇప్పుడే తిని వచ్చాను. ఉప్మా వద్దు చెల్లెమ్మా''

''అర్జునా తిండి అన్నాక ఆలూ బిర్యానీ ఉంటుంది. ఉప్మా ఉంటుంది. ఆలూ బిర్యానీ అనగానే పొంగిపోవద్దు. ఉప్మా అనగానే ఢీలా పడిపోవద్దు టమాటా రైస్‌కు, టమాటా బాత్‌కు ఒకేలా స్పందించడమే స్థితప్రజ్ఞత. ''

''ఉప్మాపై నేనెవరి మనోభావాలను గాయపరచను. ఆ సంగతి వదిలేయ్ . ఏంటీ కొత్త సంవత్సరం విశేషాలు''

''ఏమున్నాయి గజల్ శ్రీనివాస్ తెలుగు వారిని ఎక్కడికో తీసుకు వెళ్లాలని అనుకుంటే పోలీసులు ఆయన్ని ఎక్కడికో తీసుకెళ్లారు. 'స్వాతి ఎపిసోడ్ ముగిసిపోయింది. రజనీకాంత్, పవన్ కళ్యాణ్ ఎపిసోడ్‌ల గురించి ఎంతయినా మాట్లాడుకోవచ్చు. గజల్ దొరకడంతో మాచిరాజు బతికిపోయాడు. ''

''పశువులను పెంచగలవా? నువ్వు రాజకీయాలకు పనికిరావు అని అప్పుడెప్పుడో రాజీవ్‌గాంధీని లాలూప్రసాద్ యాదవ్ విమర్శించినట్టు గజల్ బాగా పాడడానికి, అలాంటి వాడు కావడానికి సంబంధం ఏమిటోయ్. ఎంతయినా 'కళాకారుడు' కదా?''

''కళాకారుడు అని ఒత్తి పలుకుతున్నావు. నువ్వు కళాకారుల మనోభావాలు గాయపరుస్తున్నావు''

''నేనెక్కడి ఒత్తిపలికాను. నా గొంతే అంత. తప్పు చేస్తే పరవాలేదు కానీ ఒత్తి పలికితే తప్పా? ''

''అతను అలాంటివాడు కాదు అని ఆవిడెవరో చెప్పారు కదా?''

''డేరాబాబా అలాంటి వాడు కాదని కొన్నివేల మంది బస్సులు తగలబెట్టి మరీ చెప్పారు''

''అంటే అలాంటి వాడే అంటావా?''

''స్పష్టమైన ఆధారాలతో చూపించేంత వరకు ఎవరూ అలాంటి వారు కాదు. అలాంటి వాడే అని పోలీసులు ఆధారాలు చూపించారు కదా?''

''అతని అనుమతి లేకుండా అతని లీలలను కెమెరాల్లో రికార్డు చేయడం తప్పు కదా?''

''నిజమే! నా లీలలను రికార్డు చేయండి అని ముద్దాయిలు లిఖితపూర్వకంగా అనుమతి ఇచ్చే స్థాయికి ఎదిగే రోజుల కోసం ఎదురు చూద్దాం''

''ఇంతకూ ఏమంటావు?''

''అతనో మనిషి అంటాను. మనుషులకు ఉండే లక్షణాలు అన్నీ ఉంటాయంటాను. మగవాడు అంటాను. మగవాళ్లకు ఉండే లక్షణాలు అన్నీ ఉంటాయంటాను. అతనేమీ మానవాతీతుడు కాదు, దేవుడు కాదు. మనిషి మనోభావాలను గాయపరిచానని అనుకుంటున్నావేమో! మనుషులకు ఉండే లక్షణాలు అన్నీ మనుషులకు ఉంటాయి. ఇది రజనీష్ చెప్పిన మాట. విచక్షణతో ఆలోచించి కొందరు దారి తప్పకుండా ఉంటారు. ఏ స్థాయిలో ఉన్నా కొందరు దారి తప్పుతారు. అంతే తేడా. ఆరేడేళ్ల క్రితం వరల్డ్‌బ్యాంక్ సిఇఓ ఒక హోటల్‌లో మహిళపై అఘాయిత్యానికి పాల్పడినప్పుడు ఇదే మాట చెప్పాను. ఇప్పుడూ ఇదే మాట ఏ స్థానంలో ఉన్నా మనిషికి మనిషి లక్షణాలు అన్నీ ఉంటాయి. విచక్షణ కోల్పోయిన వారు, కోల్పోని వారు ఇంతే తేడా!''



''ఏం మాట్లాడుతున్నావ్? నువ్వూ అంతేనా? నేనూ అంతేనా?

''ఏం మనం మనుషులం కాదా? ''

''నేనెప్పుడూ అలా అనుకోలేదు''

''ఐతే నీలో ఏదన్నా లోపం ఉండొచ్చు, లేదా నువ్వు అబద్ధం ఆడుతుండొచ్చు ''

''గజల్ పురుషుని సంగతి చట్టం చూసుకుంటుది కానీ స్వాతి స్త్రీ సంగతేంటి?''

''స్వాతిలో కొందరికి భయంకరమైన ఆడరాక్షసి కనిపిస్తుందేమో కానీ నాకైతే సినిమాకు, టీవీ సీరియల్స్‌కు నిజ జీవితానికి తేడా ఉంటుందనే కనీస పరిజ్ఞానం లేని టీవీ సీరియల్ పిచ్చి జీవి కనిపిస్తోంది.

ముఖానికి మాస్క్ తొడుక్కుంటే రూపం మారడం, చిత్తూరు నాగయ్య హీరోగా వెలుగొందిన కాలం నాటి సినిమా ఫార్ములా. మొగుడిని చంపి ప్రియుడికి మాస్క్ తొడిగితే మొగుడవుతాడా? ఆమెది చావు తెలివితేటలు కాదు, అజ్ఞానం. టీవీ సీరియల్స్, సినిమాల్లో హీరో సాహసాలు నిజమే అనుకునేంత అజ్ఞానం''

''వాళ్ల సంగతి సరే రజనీకాంత్ రాణిస్తారా? పవన్ కల్యాణ్ పాలిస్తాడా? మహారాష్ట్రలో పుట్టి, కర్నాటకలో పెరిగిన రజనీకాంత్‌ను తమిళులు ఎలా ఆదరిస్తారు?''

''తమిళులకూ మనకూ తేడా ఉంది. భాష పేరుతో ఏర్పడిన తొలి రాష్ట్రం, భాషపేరుతో పుట్టిన పార్టీ రెండు దశాబ్దాలు అధికారంలో ఉన్నా మనలో భాషాభిమానం శూన్యం. తమిళులు భాషా సినిమాలనైనా, తమిళ భాషనైనా పిచ్చిగా ప్రేమిస్తారు. రజనీకాంత్ ఒక్కరే కాదు తమిళులకు రాజకీయంగా, సినిమాపరంగా ఆరాధ్య దైవాలుగా వెలుగొందిన వారంతా తమిళేతరులే. ఎంజిఆర్ తమిళుడు, కాదు కేరళ వాసి. ఎంజిఆర్ హీరోగా నటించినప్పుడు దైవంగా పూజించారు. రాజకీయాల్లోకి వచ్చినప్పుడు అంతే ఆరాధించారు. ఇందిరాగాంధీ తరువాత అమ్మా అని ఆప్యాయంగా పిలిపించుకున్న జయలలిత తమిళియన్ కాదు. ఈ విషయం తమిళులకు తెలియకనా? మనకూ వారికి తేడా ఏమంటే? ఏ భాషకు చెందిన వారైనా వారిలో తమిళుల్లో కలిసిపోవలసిందే. కలిసిపోయారు కాబట్టే ఎంజిఆర్, జయలలితలాంటి వాళ్లు తమిళుల మనసు దోచుకున్నారు.''

''పులిని చూసి నక్క వాత పెట్టుకున్నట్టు ఎన్టీఆర్‌ను చూసి పార్టీ పెడితే ఏమవుతుందో చిరంజీవి, విజయకాంత్ సంగతి తెలియందా?''

''ఎన్టీఆర్ పార్టీ పెట్టినప్పుడు ఇదే మాటన్నారు. 83లోపాతికేళ్ల కాంగ్రెస్ పాలనపై జనం విసిగిపోయి ఉన్నారు. ప్రత్యామ్నాయం లేదు. కానీ చిరంజీవి పార్టీ పెట్టినప్పుడు రంగంలో రెండు బలమైన పార్టీలు ఉన్నాయి. ఎన్టీఆర్ రెండోసారి పార్టీ పెట్టినప్పుడు ఇదే పరిస్థితి. అల్లుడి పార్టీ, కాంగ్రెస్ పార్టీ బలంగా ఉండడంతో అన్నగారి రెండో పార్టీ అడ్రస్ లేకుండాపోయింది. ఇప్పుడు వందకు చేరువలో కరుణానిధి, వారసుణ్ణి ప్రకటించకుండా వెళ్లిపోయిన జయలలిత ఇదే రజనీకి కలిసొచ్చే కాలం. కనెక్టింగ్ ది పీపుల్ అంటూ ప్రపంచంలో 60శాతం మార్కెట్‌ను హస్తగతం చేసుకున్న నోకియా సరైన సమయంలో సరైన నిర్ణయం తీసుకోకపోవడంతో తెర మరుగైంది. దేనికైనా టైం ముఖ్యం.''

''ఇదిగో అన్నయ్యా ఉప్మా తినండి''

''చూశావటోయ్ విధి బలీయమైంది. రాజకీయాల్లోకి రావాలని రజనీ నుదుటి రాసి ఉన్నా, ఏదో ఒక రోజు రాసలీలలు బయటపడాలని గజల్ నుదుటిన రాసి ఉన్నా, ఉప్మా తినాలని మన నుదిటిపై రాసి ఉన్నా తప్పించుకోలేం.''

ఉత్తరాయణం

'తాజ్' పర్యాటకుల పరిమితి మంచిదే

ప్రపంచ ప్రఖ్యాత అందాల తాజ్‌మహల్ పరిరక్షణకు భారత పురావస్తు శాఖ తీసుకున్న నిర్ణయం భేష్షైనది. రోజుకు 40వేలమంది పర్యాటకులను మాత్రమే సందర్శనకు అనుమతించాలన్నది ఆ నిర్ణయం. ఏటా లక్షల మంది పర్యాటకులను ఆకర్షిస్తున్న తాజ్‌మహల్ చరిత్రకు, భవన నిర్మాణ శైలికి, ప్రేమకు, వివాదాలకు కేంద్రబిందువు. ప్రపంచంలోని ఏడు వింతల్లో ఒకటి. అలాంటి విశిష్టమైన ప్రేమచిహ్నాన్ని కాపాడుకోవలసిన బాధ్యత మనపై ఉంది. ఇది జాతీయ సంపద. అపరిమిత సంఖ్యలో పర్యాటకులు వచ్చివెళ్లడం, కాలుష్యం తాజ్ అందాలను దెబ్బతీస్తోంది. ఈ నేపథ్యంలో కేంద్ర పురావస్తు శాఖ ఈ నిర్ణయం తీసుకుంది. అయితే ఈ పరిమితి కేవలం దేశీయ పర్యాటకులకు మాత్రమే. విదేశ పర్యాటకులకు ఎటువంటి ఆంక్షలు, పరిమితి లేదు.

-బుగ్గన మధుసూదన్ రెడ్డి, బేతంచర్ల

చైనా వస్తువులు వద్దు

సరళీకృత ఆర్థిక విధానాలు మొదలయ్యాక, బహుళజాతీయ వాణిజ్య సంస్థలు ప్రవేశించాక భారత్‌లో చైనా వస్తువుల తాకిడి పెరిగిపోయింది. ఏమాత్రం నమ్మలేని పొరుగుదేశంతో ఆర్థిక సంబంధాలు నెరపడం సమంజసం కాదు. నాసిరకం, ప్రమాదకరమైన రసాయనాలతో తయారైన వస్తువులను చైనా మన మార్కెట్‌లోకి వెదజల్లుతోంది. చౌకగా లభిస్తుండడంతో ప్రజలు ఎగబడుతున్నారు. కానీ ఇది మన ఆర్థికమూలాలను దెబ్బతీస్తున్నది. చిన్నచిన్న వ్యాపారుల కడుపుకొడుతోంది. మన శత్రుదేశం పాకిస్తాన్‌తో చేతులు కలిపి మనకు వ్యతిరేకంగా వ్యవహరిస్తున్న చైనాను కట్టడి చేయాలంటే ప్రజల వైఖరిలో మార్పు రావాలి. చైనా వస్తువులను బహిష్కరించడం కనీస ధర్మం.

-సరికొండ శ్రీనివాస రాజు, వనస్థలిపురం

కులవృత్తులను ప్రోత్సహించాలి

ఉభయ తెలుగు రాష్ట్రాలలో కులవృత్తులవారిని ప్రోత్సహించాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉంది. ఎన్ని అవకాశాలు వచ్చినా, ఆదాయం తగినంత లేకపోయినా కులవృత్తులనే నమ్ముకున్నవారిని ఆదుకోవాలి. కులాలవారీ కాకుండా వృత్తులవారీగా సహాయం అందించాలి. కుల సంఘాలను ప్రోత్సహించే విధానాలకు స్వస్తి చెప్పి రిజర్వేషన్లపై సమీక్ష చేయాల్సిన అవసరం ఉంది. నిజానికి రిజర్వేషన్లను తొలగించడమే మేలు. ఎటువంటి ఆస్తిపాస్తులు లేని, నిజమైన కూలీలకు మాత్రమే ప్రభుత్వం సహాయం చేయాలి. ఎన్నికల విధానాల్లో సంస్కరణలు, నాయకుల ఆలోచనాధోరణుల్లో మార్పులు అవసరం. అప్పుడే దేశం అభివృద్ధి చెందుతుంది.

-ఎ.వెంకటస్వామి, కర్నూలు

విభజన హామీలను అమలు చేయండి

రాజ్యసభలో కేవీపీ డిమాండ్

ఆంధ్రభూమి ప్రతినిధి

న్యూఢిల్లీ, జనవరి 4: ఆంధ్రప్రదేశ్ విభజన చట్టంలో పేర్కొన్న అంశాలను అమలు చేయాలని రాజ్యసభలో కాంగ్రెస్ ఎంపీ కేవీపీ రామచంద్రరావు కేంద్రాన్ని డిమాండ్ చేశారు. గురువారం జీరో అవర్‌లో ఈ అంశాన్ని ఆయన లేవనెత్తారు. విభజన జరిగిన నాలుగేళ్లు పూర్తయినా చాలా అంశాలు అమలుకావడం లేదని ఆయన పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్‌కు సమస్యలు ఉత్పన్నం కాకుండా విభజన చట్టంలో పేర్కొన్న అంశాలను అమలు చేయాలని కోరారు.

విశాఖ కేంద్రంగా రైల్వేజోన్

విభజన చట్టంలో పేర్కొన్న విధంగా ప్రత్యేక రైల్వే జోన్ ఏర్పాటు చేయాలని అవంతి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. దక్షిణ మధ్య రైల్వే జోన్‌లో ఉన్న విజయవాడ, గుంటూరు, గుంతకల్ రైల్వే డివిజన్లను, ఈస్ట్‌కోస్ట్ జోన్ ఉన్న వాల్తేర్ డివిజన్‌ను కలిపి విశాఖ కేంద్రంగా రైల్వేజోన్ ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఎన్నో ఏళ్లుగా ప్రత్యేక రైల్వేజోన్‌కోసం ప్రజలు డిమాండ్ చేస్తున్నారని వివరించారు.

సెజ్‌లపై కేంద్రానికి ఫిర్యాదు

విశాఖ నగరంలో ఉన్న అచ్యుతపురం, రాంబిల్లిలో ఉన్న ప్రత్యేక ఆర్థిక మండళ్ళు (సెజ్)లలో వివిధ కంపెనీల నుంచి వెలువడే వ్యర్థాలతో పర్యావరణానికి ముప్పు వాటిల్లుతోందని ఎంపీ విజయ సాయిరెడ్డి నేతృత్వంలోని వైకాపా నాయకుల బృందం కేంద్రానికి ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేంద్ర పర్యావరణ శాఖ మంత్రి హర్షవర్ధన్‌తో ఈ బృందం సమావేశమైంది. 40 కంపెనీలు నిబంధనలను ఉల్లంఘిస్తూ కాలుష్య కారకం అవుతున్నాయని పేర్కొన్నారు. వైకాపా బృందంలో గుడివాడ అమర్‌నాథ్ తదితరులు ఉన్నారు.

17,444 మందికి పునరావాసం

పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులలో ఇప్పటివరకు 17,444 మంది గిరిజనులకు పునరావాసం కల్పించినట్టు కేంద్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సుదర్శన భగత్ వెల్లడించారు. పోలవరం ప్రాజెక్టు నిర్వాసితుల సహాయంపై సిపిఐ ఎంపీ డి.రాజా రాజ్యసభలో అడిగిన ప్రశ్నకు కేంద్ర మంత్రి లిఖితపూర్వకంగా సమాధానం ఇచ్చారు. పోలవరం ప్రాజెక్టు భూ నిర్వాసితుల సమస్యలను పరిష్కరించేందుకు గ్రామీణాభివృద్ధి శాఖ నోడల్ ఏజెన్సీగా వ్యవహరిస్తోందని కేంద్ర మంత్రి వివరించారు.

'ఫాతిమా' సమస్యను పరిష్కరించండి

ఫాతిమా మెడికల్ కాలేజ్‌లో 2015-16 నుండి ఇప్పటివరకు విద్యా సంవత్సరం కోల్పోయిన విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి జేపీ నడ్డాకు వైకాపా ఎంపీ వైవీ సుబ్బారెడ్డి విజ్ఞప్తి చేశారు. విద్యార్థులకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేస్తూ ఆయన కేంద్ర మంత్రికి వినతిపత్రం సమర్పించారు.

చొచ్చుకొస్తున్న 'సుప్రీం'

- పార్లమెంటు అధికారాన్ని ప్రశ్నించడమే తరువాయి
- కార్యనిర్వాహక శాఖపై కోర్టు 'ధిక్కార' కత్తి
- ప్రజలకు ప్రాతినిధ్యం వహిస్తున్న పార్లమెంటే సుప్రీం
- తీర్పులనూ ప్రత్యక్ష ప్రసారం చేయాలి
- తప్పు చేసిన న్యాయమూర్తులకూ శిక్షలుండాలి
- లోక్‌సభలో టీడీపీ సభ్యుడు రవీంద్రబాబు



టీడీపీ లోక్‌సభ సభ్యుడు రవీంద్రబాబు

ఆంధ్రభూమి ప్రత్యేక ప్రతినిధి

న్యూఢిల్లీ, జనవరి 4: తెలుగుదేశం సభ్యుడు పి.రవీంద్రబాబు గురువారం లోక్‌సభలో సుప్రీం కోర్టుపై పెద్దఎత్తున ధ్వజమెత్తారు. న్యాయ వ్యవస్థ సమీప భవిష్యత్తులో పార్లమెంటు అధికారాన్ని ప్రశ్నించే ప్రమాదం లేకపోలేదని రవీంద్రబాబు హెచ్చరించారు. న్యాయమూర్తుల జవాబుదారీని నిర్ధారించాలని ఆయన డిమాండ్ చేశారు. సుప్రీం కోర్టు తనకున్న అధికారాలతో కార్యవర్గంపై కోర్టు ధిక్కార కత్తిని ఝుళిపిస్తోందని రవీంద్రబాబు గురువారం లోక్‌సభలో సుప్రీం కోర్టు, హైకోర్టుల న్యాయమూర్తుల వేతనాల సవరణ బిల్లుపై జరిగిన చర్చలో పాల్గొంటూ ఆరోపించారు. తమ పార్టీ తెలుగుదేశం అభిప్రాయం కూడా ఆదేనని ఆయన స్పష్టం చేశారు. సుప్రీం కోర్టు పని తీరును పారదర్శకం చేయటం ద్వారా ప్రవర్తనా నియమావళి పరిధిలోకి తీసుకురావాలి, అప్పుడే వారి అహంకారాన్ని అదుపు చేయగలుగుతామని రవీంద్రబాబు స్పష్టం చేశారు. సుప్రీం కోర్టు ఇప్పటికే పార్లమెంటు ముఖద్వారం వద్దకు వచ్చింది, సమీప భవిష్యత్తులో అది పార్లమెంటు లోపలికి వచ్చేస్తుందని ఆయన హెచ్చరించారు. పార్లమెంటు కంటే తామే ఎక్కువ అని నిరూపించుకునేందుకు సుప్రీం కోర్టు తమ వేతనాలను తామే పెంచుకుంటూ తీర్పు ఇచ్చుకున్నా ఆశ్చర్యపడాల్సిన అవసరం లేదని రవీంద్రబాబు చెప్పారు. సుప్రీం కోర్టు విచారణ లైవ్‌గా ప్రసారం చేయాలని రవీంద్ర బాబు డిమాండ్ చేశారు. పార్లమెంటు కార్యక్రమాలను టీవీలో లైవ్‌గా చూపించినప్పుడు సుప్రీం కోర్టులో వివిధ అంశాలపై జరిగే విచారణను ఎందుకు ప్రసారం చేయలేమని ఆయన నిలదీశారు. సుప్రీం కోర్టుతోపాటు దేశంలోని అన్ని ఇతర వ్యవస్థలకంటే పార్లమెంటే ఎక్కువ అని ఆయన అభిప్రాయపడ్డారు. దేశ ప్రజలకు ప్రాతినిధ్యం వహిస్తోంది కాబట్టే పార్లమెంటు సుప్రీం, ప్రజలు సుప్రీం, వారికి ప్రాతినిధ్యం వహిస్తున్న ఎంపీలు, పార్లమెంటు సుప్రీం అని రవీందర్ బాబు వాదించారు. సుప్రీం కోర్టు చట్టాలు చేయటంతోపాటు వాటిని అమలు చేయిస్తోంది, వారి ఆదేశాలను అమలు చేయనివారిపై కోర్టు ధిక్కారం మోపుతోంది, కోర్టు ధిక్కారం ఒక ఆయుధంగా మారిందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. కోర్టు ధిక్కారం అనే కత్తిని కార్యవర్గం (ఎగ్జిక్యూటివ్) తలపై వేలాడదీస్తోందని రవీందర్ బాబు ఆరోపించారు. కోర్టు పని తీరుపై బైట మాట్లాడేందుకు తమకే భయమేస్తోంది. ఏం మాట్లాడితే కోర్టు ఏం చేస్తుందోననే భయం వేటాడుతోంది. న్యాయ వ్యవస్థ గురించి పార్లమెంటులో ఏదైనా మాట్లాడవచ్చునని మిత్రులు సూచించారు. అయితే మనసు విప్పి మాట్లాడుతున్నానని ఆయన వెల్లడించారు. పని చేసినా, చేయకపోయినా కోర్టు ధిక్కారమంటున్నారని రవీంద్రబాబు చెప్పారు. న్యాయమూర్తుల వేతనాల గురించి మాట్లాడితే ఎవరైనా తనపై కోర్టు ధిక్కారం మోపుతారేమో? అని ఆయన అన్నారు. పార్లమెంటులో ఏమైనా మాట్లాడవచ్చు, ఎంతైనా మాట్లాడవచ్చు, ఏం కాదని కొందరు చెప్పారు, అందుకే అన్ని విషయాలు మీ ముందుంచుతున్నానని రవీంద్రబాబు తెలిపారు. దయచేసి సామాజిక అంశాలపై 'లెజిస్లేట్' చేయకూడదని సుప్రీం కోర్టుకు ఎంపీ లందరి తరపున విజ్ఞప్తి చేస్తున్నానని రవీంద్రబాబు చెప్పారు. కేవలం క్రిమినల్, సివిల్ అంశాలపై సుప్రీం కోర్టు లెజిస్లేట్ చేయాలని ఆయన సూచించారు. సుప్రీం కోర్టు సామాజిక అంశాలను ముట్టుకోకూడదు, సామాజిక అంశాలపై పూర్తి అధికారం పార్లమెంటుకే ఉన్నదని ఆయన స్పష్టం చేశారు. ప్రజల కష్టనష్టాలను తీర్చే సర్వాధికారాలు పార్లమెంటుకు మాత్రమే ఉన్నాయన్నారు. ప్రజల సమస్యలపై చట్టం చేసేందుకు ఎంపీలే సరైన వారని ఆయన తెలిపారు. పార్లమెంటు తప్పుడు చట్టం చేస్తే తమను ఇంటికి పంపించే అధికారం ప్రజలకు ఉన్నది, కానీ సుప్రీం కోర్టు తప్పుడు తీర్పు ఇస్తే దానికున్న పరిష్కార మార్గం ఏమిటి? ప్రజలెక్కడికి వెళ్లాలి? అని రవీంద్రబాబు ప్రశ్నించారు. తప్పుడు తీర్పులు ఇచ్చే వారిని తొలగించాలని రాజ్యాంగం చెబుతోంది, కానీ ఇంతవరకు మనం ఒక్క నాయయమూర్తినైనా తొలగించగలిగామా? అని ఆయన ప్రశ్నించారు. న్యాయమూర్తులను మనం తొలగించలేదు, ఇకమీదట కూడా తొలగించలేము, అలా ఎప్పుడు జరగదని ఆయన చెప్పారు. సుప్రీం కోర్టు న్యాయమూర్తిని తొలగించటం ఏమాత్రం సులభం కాదని ఆయన అన్నారు. న్యాయమూర్తులను తొలగించే ప్రక్రియను ఇక్కడ ప్రారంభిస్తాం, ఆ తరువాత మధ్యలో వదిలివేస్తామని రవీంద్రబాబు చెప్పారు. న్యాయం చేయటమే కాదు, న్యాయం చేసినట్లు కూడా కనిపించాలని రవీంద్రబాబు ఆవేశంతో అన్నారు. ఏ పరిస్థితుల్లో ఒక తీర్పు వచ్చిందనేది ప్రజలకు తెలియాలని ఆయన వాదించారు. తప్పుడు తీర్పులు ఇచ్చే న్యాయమూర్తులను శిక్షించేందుకు వీలుండాలని రవీంద్రబాబు డిమాండ్ చేశారు. తప్పుడు తీర్పులు ఇచ్చే న్యాయమూర్తులకు మినహాయింపులు ఎందుకు ఉండాలని రవీంద్రబాబు నిలదీశారు. తప్పుచేసే సివిల్ సర్వీస్ అధికారులపై విచారణ జరిపి శిక్ష విధిస్తున్నప్పుడు తప్పుచేసే న్యాయమూర్తులను కూడా శిక్షించేందుకు వీలుండాలని ఆయన సూచించారు. జస్టిస్ డిలేడ్-జస్టిస్ డినైడ్, ఇరవై సంవత్సరాల తరువాత తీర్పు ఇచ్చినా మొత్తం తలకిందులు చేస్తారంటూ న్యాయమూర్తులపై విమర్శలు కురిపించారు. తప్పుడు తీర్పులు ఇచ్చే న్యాయమూర్తులకు శిక్ష పడాలా, వద్దా? మీరే చెప్పాలంటూ ఆయన డిప్యూటీ స్పీకర్ తంబిదురైని అడిగారు.

'తలాక్'పై ససేమిరా

- రాజ్యసభలో పట్టు బిగించిన అధికార, విపక్షాలు
- సెలెక్ట్ కమిటీకి పంపే ప్రసక్తే లేదన్న ఎన్డీయే
- పంపాల్సిందేనంటున్న విపక్షం
- ఈ సమావేశాల్లో సభామోదం అనుమానమే



త్రిపుల్ తలాక్ బిల్లుకు వ్యతిరేకంగా గురువారం ఢిల్లీలోని పార్లమెంట్ స్ట్రీట్ వద్ద ఆందోళన చేస్తున్న ఉమెన్ ఇండియా మూవ్‌మెంట్ కార్యకర్తలు

ఆంధ్రభూమి ప్రత్యేక ప్రతినిధి

న్యూఢిల్లీ, జనవరి 4: త్రిపుల్ తలాక్ బిల్లు వ్యవహారం రాజ్యసభలో అధికార, విపక్షాలకు ప్రతిష్ఠాత్మక అంశంగా మారింది. ఈ బిల్లులో కొన్ని మార్పులు సూచిస్తూ దీన్ని సెలెక్ట్ కమిటీకి నివేదించాలని ప్రతిపక్షాలు పట్టుబడుతున్న నేపథ్యంలో ప్రభుత్వం కూడా మరింతగా తన మాట నెగ్గించుకునే దిశగా అడుగులు వేస్తోంది. ఎట్టి పరిస్థితుల్లోనూ ఈ బిల్లును సెలెక్ట్ కమిటీకి నివేదించే అవకాశాలు కనిపించడం లేదన్న సంకేతాలు వ్యక్తమవుతున్నాయి. లోక్‌సభలో ఎన్డీయే సర్కారుదే మెజారిటీ కావడంతో ఈ బిల్లు ఆమోదం సునాయంగానే సాగినప్పటికీ రాజ్యసభలో విపక్షాలది ఆదిపత్యం కావడంతో ప్రభుత్వానికి పెద్ద అవరోధంగా మారింది. గత రెండు రోజులుగా ఈ బిల్లుపై సభలో చోటు చేసుకుంటున్న వాదోపవాదలను బట్టి చూస్తే, తమదే పైచేయి కావాలన్న ధోరణితోనే అధికార, విపక్షాలు వ్యవహరిస్తున్నట్టు స్పష్టమవుతోంది.

త్రిపుల్ తలాక్ బిల్లును సెలెక్ట్ కమిటీ పరిశీలనకు పంపించే అంశంపై గురువారం రాజ్యసభలో అధికార, ప్రతిపక్షం మధ్య తీవ్రస్థాయిలో వాదోదవాదాలు జరిగాయి. త్రిపుల్ తలాక్ బిల్లుపై వెంటనే చర్చ జరపాలి, సెలెక్ట్ కమిటీకి పంపించాలంటూ ప్రతిపక్షం సభ్యులు ఇచ్చిన నినాదాలతో సభ దద్దరిల్లిపోయింది. ప్రతిపక్షం ప్రతిపాదించిన రెండు తీర్మానాలు చెల్లవని సభా నాయకుడు, ఆర్థిక శాఖ మంత్రి అరుణ్ జైట్లీ గటిగా వాదించారు. మీ ఇష్టానుసారం సభ్యులను నియమించుకుందామంటే సరిపోతుందా అని ఆయన నిలదీశారు.

త్రిపుల్ తలాక్ బిల్లుపై చర్చ జరపాలని కాంగ్రెస్, తృణమూల్ కాంగ్రెస్, సమాజ్‌వాదీ తదితర ప్రతిపక్ష పార్టీలు గురువారం మధ్యాహ్నం రెండు గంటలకు డిమాండ్ చేశాయి. దేశ ఆర్థిక వ్యవస్థపై ప్రతిపక్షం ఉపనాయకుడు ఆనంద్ శర్మ ప్రతిపాదించిన స్వల్పకాల చర్చ పూర్తి చేసిన అనంతరం త్రిపుల్ తలాక్ బిల్లుపై చర్చించవచ్చని అరుణ్ జైట్లీ సూచించారు. ఈ చర్చ ఐదున్నర గంటలకు పూర్తి కాగానే ప్రతిపక్షం త్రిపుల్ తలాక్ బిల్లుపై చర్చ జరపాలని పట్టుపట్టింది. త్రిపుల్ తలాక్ బిల్లును సెలెక్ట్ కమిటీకి పంపించేందుకు తాను ప్రతిపాదించిన తీర్మానం ఏమైందని తృణమూల్ కాంగ్రెస్ సభ్యుడు సుఖేందురాయ్, కాంగ్రెస్ నాయకుడు ఆనంద్ శర్మ ప్రశ్నించారు. ఈ రెండు తీర్మానాలు సభ ముందున్నాయి కాబట్టి వాటిని ఏం చేయాలనేది సభ మాత్రమే నిర్ణయించాలని డిప్యూటీ చైర్మన్ పిజె కురియన్ స్పష్టం చేశారు. ప్రతిపక్షం ప్రతిపాదించిన తీర్మానాలు సభా నియమావళికి విరుద్ధమని అరుణ్ జైట్లీ వాదించారు. సెలెక్ట్ కమిటీలో అధికార, ప్రతిపక్ష పార్టీలకు పూర్తి ప్రాతినిధ్యం ఉండాలి తప్ప కేవలం ప్రతిపక్షం సభ్యులు మాత్రమే ఎలా ఉంటారని నిలదీశారు. ప్రభుత్వం తమ పక్షం సభ్యుల పేర్లను ప్రతిపాదించవచ్చు కదా? అని సుఖేందురాయ్ ప్రశ్నించారు. ప్రతిపక్షం ప్రతిపాదించిన సెలెక్ట్ కమిటీ తీర్మానాలను ఆమోదించే ప్రసక్తే లేదని జైట్లీ, సమాచార, జౌళి శాఖ మంత్రి స్మృతి ఇరానీ వాదించారు. ఒక దశలో స్మృతి ఇరానీకి టీఎంసీ పక్షం నాయకుడు డెరిక్ ఒబ్రేన్ మధ్య వాగ్వివాదం జరిగింది. ఈ దశలో ప్రతిపక్షం నాయకుడు గులాం నబీ ఆజాద్ లేచి త్రిపుల్ తలాక్ బిల్లును సమర్థిస్తున్నాం, అయితే అందులో కొన్ని మార్పులు చేయాలన్నదే తమ వాదన అని ఆయన చెప్పారు. త్రిపుల్ తలాక్ బిల్లుపై వెంటనే చర్చ ప్రారంభించాలన్న డిమాండ్‌ను తాను ఆమోదించలేనని కురియన్ స్పష్టం చేశారు. సభలో ఎప్పుడు ఏది చర్చకు చేపట్టాలనేది ప్రభుత్వం నిర్ణయిస్తుంది, ప్రభుత్వ నిర్ణయంస్ ప్రకారం ఇప్పుడు జీఎస్టీపై చర్చ చేపడుతున్నానని ఆయన ప్రకటించారు. ప్రభుత్వం ఒప్పుకుంటేనే త్రిపుల్ తలాక్ బిల్లుపై చర్చ జరుపుతాను లేకపోతే జీఎస్టీపై చర్చ జరుగుతుందని కురియన్ తెలిపారు. దీనికి ఆగ్రహించిన ప్రతిపక్షం సభ్యులు ముందు వరుస వద్దకు వచ్చి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు ఇస్తూ గొడవ చేశారు. త్రిపుల్ తలాక్ బిల్లుపై వెంటనే చర్చ జరిపి సెలెక్ట్ కమిటీకి పంపించాలంటూ వారు పెద్దఎత్తున నినాదాలు ఇవ్వటంతో సభ దద్దరిల్లిపోయింది. దీనితో కురియన్ సభను వాయిదా వేసి వెళ్లిపోయారు. పార్లమెంటు శీతాకాల సమావేశాలు శుక్రవారంతో ముగుస్తున్నందున త్రిపుల్ తలాక్ బిల్లుకు ఈ సమావేశాల్లో మోక్షం లభించే సూచనలు కనిపించటం లేదు.

శాసన వ్యవహారాల్లో జ్యుడీషియరీ జోక్యం వద్దు

లోక్‌సభలో ఎంపీల ముక్తకంఠం

న్యూఢిల్లీ, జనవరి 4: శాసన వ్యవస్థను న్యాయవ్యవస్థ అతిక్రమించరాదని పార్టీలకు అతీతంగా లోక్‌సభలో సభ్యులంతా గురువారం మూకుమ్మడిగా తమ గళం వినిపించారు. చట్టాల రూపకల్పనలో, శాసన వ్యవహారాల్లో న్యాయవ్యవస్థ కల్పించుకోకుండా ఉండాలని ఎంపీలు అన్నారు. హైకోర్టు, సుప్రీం కోర్టు న్యాయమూర్తుల జీతభత్యాల పెంపునకు సంబంధించిన బిల్లుపై చర్చ సందర్భంగా పలువురు సభ్యులు మాట్లాడుతూ, న్యాయవ్యవస్థ కంటే శానసవ్యవస్థ అత్యున్నతమైనదని అన్నారు. తృణమూల్ కాంగ్రెస్ సభ్యుడు కల్యాణ్ బెనర్జీ మాట్లాడుతూ, 'శాసన వ్యవహారాలను పార్లమెంటుకే వదిలేయాలి.. శాసనాలు చేసే పని సుప్రీం కోర్టుది కాదు.. న్యాయవ్యవస్థ జోక్యం తగ్గకుంటే ఈ సంఘర్షణ నానాటికీ తీవ్రతరమవుతుంది.. రెండు వ్యవస్థల మధ్య ఇది ప్రత్యక్ష ఘర్షణకు దారితీస్తుంది..' అని అన్నారు. అధ్యక్ష స్థానంలో ఉన్న డిప్యూటీ స్పీకర్ ఎం. తంబాదురై కూడా 'శాసనాలను అనుసరించడం న్యాయవ్యవస్థ విధి.. చట్టాలను మార్చడం న్యాయవ్యవస్థ పని కాదు' అన్నారు. హైకోర్టు, సుప్రీం కోర్టు కార్యకలాపాలను టీవీల్లో ప్రత్యక్ష ప్రసారం చేసి ప్రజలందరికీ చూపాలని కల్యాణ్ బెనర్జీ సూచించారు. కోర్టు తీర్పులను సమాచార హక్కు చట్టం ద్వారా బహిరంగ పరచాలని తథాగత శథపతి (బిజెడి) విజ్ఞప్తి చేశారు.

'కోర్టు ధిక్కరణ' అనే పదం హేయమైనదని, దాన్ని చట్టం నుంచి తొలగించాలన్నారు. శివసేన ఎంపీ వినాయక్ రౌత్ మాట్లాడుతూ, న్యాయవ్యవస్థ కంటే పార్లమెంటు, అసెంబ్లీలు నిర్ద్వంద్వంగా ఉన్నతమైనవని అన్నారు. హైకోర్టు, సుప్రీం కోర్టులు పార్లమెంటుకు వివరణలు ఇచ్చేందుకు బాధ్యులేనా? అని తృణమూల్ సభ్యుడు బెనర్జీ న్యాయశాఖ మంత్రి రవిశంకర్ ప్రసాద్‌ను ప్రశ్నించారు. న్యాయవ్యవస్థకు బడ్జెట్‌ను పార్లమెంటు కేటాయిస్తుంది గనుక, ఈ చట్టసభకు వివరణలు ఇవ్వాల్సిన బాధ్యత న్యాయవ్యవస్థకు ఉండాలన్నారు.

జాతీయ పండుగగా మేడారం జాతర

కేంద్రానికి టీఆర్‌ఎస్ ఎంపీ విజ్ఞప్తి

ఆంధ్రభూమి ప్రతినిధి

న్యూఢిల్లీ, జనవరి 4: దేశంలోనే అతిపెద్ద గిరిజన పండుగ అయినా సామ్మక్క సారలమ్మ (మేడారం) జాతరను జాతీయ పండుగగా ప్రకటించాలని టీఆర్‌ఎస్ ఎంపీ సీతారాం నాయక్ కేంద్రానికి విజ్ఞప్తి చేశారు. లోకసభలో జీరో అవర్‌లో ఆయన ఈ అంశాన్ని లేవనెత్తారు. ఆంధ్రా, చతీష్‌గడ్, ఒడిశా, మధ్యప్రదేశ్, మహారాష్ట్రల నుంచి దాదాపు కోటిమంది గిరిజన భక్తులు ఈ జాతరకు హాజరవుతారని ఆయన వెల్లడించారు. కేంద్రం నిర్వహిస్తున్న వనం పండుగ మాదిరిగానే ఈ మేడారం జాతరను కూడా జాతీయ గిరిజన పండుగగా గుర్తించాలని కేంద్రాన్ని కోరారు.

రైల్వే ప్రాజెక్టు కేటాయించండి


తెలంగాణలో మోడిఫైడ్ ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అప్‌గ్రేడేషన్ స్కీం (ఎంఐఐయూఎస్)లో భాగంగా ఒక రైల్వే ప్రాజెక్టును ఏర్పాటు చేయాలని కేంద్ర రైల్వే శాఖ మంత్రి పీయూష్ గోయెల్‌కు టీఆర్‌ఎస్ ఎంపీ బూర నర్సయ్య గౌడ్ విజ్ఞప్తి చేశారు. తెలంగాణలో పెండింగ్ రైల్వే ప్రాజెక్టులను గురువారం నర్సయ్య గౌడ్ కేంద్ర మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా రైల్వే శాఖకు సంబంధించిన ఒక ప్రాజెక్టును ఏర్పాటు చేసి నిధులు విడుదల చేయాలని కోరారు. అలాగే జనగాం రైల్వే స్టేషన్ సమీపంలో వీవర్స్ కాలనీ వద్ద పుట్‌ఓవర్ బ్రిడ్జ్ నిర్మించాలని శాతవాహన, చార్మినార్, షిర్డీ ఎక్స్‌ప్రెస్ జనగాం స్టేషన్లో ఆపాలని కోరుతూ పియూష్ గోయెల్‌కు వినతి పత్రం సమర్పించారు.

హైకోర్టు ఏర్పాటుచేయండి

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ప్రత్యేక హైకోర్టును ఏర్పాటు చేయాలని టీఆర్‌ఎస్ ఎంపీ కొండ విశ్వేశ్వరరెడ్డి కేంద్రానికి విజ్ఞప్తి చేశారు. న్యాయమూర్తుల జీతభత్యాల పెంపునకు ఉద్దేశించబడిన చట్ట సవరణ బిల్లుపై లోక్‌సభలో జరిగిన చర్చలో ఆయన పాల్గొన్నారు. గతంలో జార్ఖండ్, ఉత్తరఖండ్, ఛతీష్‌గడ్ ఏర్పడినపుడు వెంటనే హైకోర్టు ఆయా రాష్ట్రాలకు ఏర్పడ్డాయని, అదేతరహాలో ఉమ్మడి హైకోర్టును విభజించి ఆంధ్రప్రదేశ్‌కు హైకోర్టును ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు.

మరో 'ఒప్పుకోలు' వీడియో

పాకిస్తాన్ మరో కుతంత్రం ▪ నేను బాగున్నా.. ఆందోళన వద్దు: జాదవ్



ఇస్లామాబాద్, జనవరి 4: ఇస్లామాబాద్ జైలులో ఉన్న భారత నావికాదళం మాజీ అధికారి కులభూషణ్ జాదవ్ చేత మరికొన్ని విషయాలు 'ఒప్పిస్తూ' పాకిస్తాన్ ప్రభుత్వం మరో వీడియోను తాజాగా విడుదల చేసింది. జైలులో తనకు ఎవరూ హాని తలపెట్టలేదని, తాను బాగున్నందున ఎవరూ ఆందోళన చెందనక్కర్లేదని జాదవ్ అన్నట్లు ఆ వీడియోలో ఉంది. తాను ఓ నిఘా సంస్థలో పనిచేయడం లేదంటూ భారత్ ఎందుకు 'అబద్ధం' చెబుతోందంటూ జాదవ్ ఉద్దేశ పూర్వకంగానే మాట్లాడినట్లు ఆ వీడియోలో చిత్రీకరించారు. జాదవ్ చెబుతున్న మాటలను చూస్తే ఇదంతా 'ఒప్పుకోలు' వీడియోగా ఉందని ఎవరికైనా అనిపిస్తుంది. తాను భారత నౌవికాదళం నియమించిన అధికారినని, తన సేవలు ఇంకా ముగిసి పోలేదని, తనను కలిశాక తన తల్లిపై భారత దౌత్యాధికారి కేకలు వేశాడని జాదవ్ ఇష్ట పూర్వకంగానే చెప్పినట్లు వీడియో కథనం. కాగా, పాకిస్తాన్ విదేశాంగ కార్యాలయం విడుదల చేసినట్లు ప్రచారమవుతున్న ఈ వీడియో కచ్చితత్వం గురించి స్పష్టమైన సమాచారం తెలియరాలేదు. జైలులో జాదవ్‌ను కలిసిన సందర్భంగా ఆయన తల్లి, భార్యల పట్ల పాక్ అధికారులు అమానవీయంగా ప్రవర్తించారని భారత్ ఆగ్రహం వ్యక్తం చేసిన తర్వాత ఈ వీడియో విడుదల కావడం గమనార్హం.

కాగా, గురువారం విడుదలైన వీడియోలో- 'నా తల్లి కళ్లలో భయం కనిపించింది.. నాతో మాట్లాడిన అనంతరం బయటకు వెళుతున్న నా మాతృమూర్తిపై భారత దౌత్యాధికారి ఒకరు బిగ్గరగా కేకలు వేశాడు.. అతను కేకలు వేయడాన్ని నేను చూశాను.. కుటుంబ సభ్యులను కలుసుకోవడం ఆశావహ పరిణామం.. నా తల్లి సంతోషంగా ఉంటుంది.. నేను కూడా ఆనందంగా ఉంటాను..' అని జాదవ్ పేర్కొన్నట్లు వీడియోలో ఉంది. 'అమ్మా.. బాధపడొద్దు.. వారు (పాకిస్తాన్ అధికారులు) నా గురించి జాగ్రత్తలు తీసుకుంటున్నారు.. నన్ను వారు కనీసం ముట్టుకోలేదు.. నన్ను ప్రత్యక్షంగా ఒకసారి చూశాక ఈ విషయాలను ఆమె (తల్లి) కూడా నమ్మింది' అని జాదవ్ అన్నట్లు వీడియో తీశారు. కాగా, తన తల్లి బయటకు వెళ్లిపోతుండగా ఆమెపై భారత దౌత్యాధికారి కేకలు వేసినట్లు- ఓ గదిలో ఉన్న జాదవ్ ఎలా చూశాడన్నది అర్థం కాని ప్రశ్నగా మిగిలింది. 'భారత ప్రజలకు, భారత ప్రభుత్వానికి, భారత నావికాదళానికి నేనో ముఖ్యమైన విషయం చెప్పాలి.. భారత నౌకాదళం నన్ను నియమించింది.. నా పని ఇంకా పూర్తికాలేదు.. నిఘా వ్యవస్థలో నేను చేసే పనికి సంబంధించి అబద్ధాలు ఎందుకు చెబుతున్నారు..?' అని జాదవ్ ఆ వీడియలో ఉద్దేశ పూర్వకంగానే చెప్పాడట! భారత నౌకాదళంలో జాదవ్ కమాండర్ ర్యాంకు అధికారి అని పాక్ చెబుతుండగా, అతను నావికాదళం మాజీ అధికారి అని భారత్ అంటోంది. వ్యాపార పనుల నిమిత్తంలో ఇరాన్‌లో ఉండగా జాదవ్‌ను పాక్ అపహరించుకుపోయిందని భారత్ వాదిస్తోంది. కుటుంబ సభ్యులు తనను కలిసేందుకు అవకాశం కల్పించినందుకు జాదవ్ పాకిస్తాన్‌కు కృతజ్ఞతలు చెప్పినట్టు గత నెల 25న పాక్ ఓ వీడియోను విడుదల చేసింది. గూఢచర్యం అభియోగాలపై జాదవ్‌కు పాక్ మిలటరీ న్యాయస్థానం మరణశిక్ష విధించింది. అయితే, భారత్ విజ్ఞప్తి మేరకు అంతర్జాతీయ న్యాయస్థానం జోక్యం చేసుకోవడంతో అతనికి మరణశిక్షను పాక్ వాయిదా వేసింది.

ఉద్యోగినుల భద్రతకు ఏం చర్యలు తీసుకున్నారు?

కేంద్ర, రాష్ట్రాలకు సుప్రీం ప్రశ్న

న్యూఢిల్లీ, జనవరి 4: ఉద్యోగినుల భద్రతపై సర్వోన్నత న్యాయస్థానం స్పందించింది. కార్యాలయాలు, కర్మాగారాలు, షాపులు, వివిధ సంస్థల్లో పనిచేసే మహిళా ఉద్యోగినులు లైంగిక వేధింపులకు గురికాకుండా ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారంటూ రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలను సుప్రీం కోర్టు ప్రశ్నించింది. పనిచేసే చోట ఉద్యోగినుల రక్షణ, లైంగిక వేధింపులకు సంబంధించి దాఖలైన పిటిషన్‌ను సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి దీపక్ మిశ్రా నేతృత్వంలోని ధర్మాసనం గురువారం విచారించింది. కార్యాలయాల్లో తాము వేధింపులకు గురవుతున్నట్టు బాధిత మహిళ ఫిర్యాదు చేసినా పట్టించుకునే యంత్రాంగ లేదని పిటిషనర్ ఆరోపించారు.

స్థానికంగా, జిల్లా స్థాయిలోనే కమిటీలు ఏర్పాటుచేయనేలేదని ఢిల్లీకి చెందిన ఇనిషియేటీవ్స్ ఫర్ ఇన్‌క్లూజన్ ఫౌండేషన్(ఐఐఎఫ్) అనే స్వచ్ఛంద సంస్థ సుప్రీంలో పిల్ వేసింది. మహిళా ఉద్యోగుల భద్రతకు సంబంధించిన చట్టం ఎక్కడా అమలవుతున్న దాఖలాలే లేవన్న సమాచారం ఆర్‌టీఐ ద్వారా తెలుసుకున్నట్టు పిటిషనర్ తరపున్యాయవాది ఇషా శేఖర్ తెలిపారు. పిటిషన్‌ను విచారించిన దీపక్ మిశ్రా సారథ్యంలోని జస్టిస్ ఎఎం ఖన్వీకర్, జస్టిస్ డివై చంద్రచూడ్‌తోకూడిన సుప్రీం బెంచ్ కేంద్ర ప్రభుత్వం, అన్ని రాష్ట్రాలను వివరణ కోరింది.

బిజినెస్

పరేఖ్‌కు భారీ వేతనం

- ఏడాదికి రూ. 18.6 కోట్లు పొందనున్న ఇన్ఫోసిస్ సీఈఓ
- నియామక ఆమోదం కోసం వాటాదారులకు పోస్టల్ బ్యాలెట్లు




బెంగళూరు, జనవరి 4: ఇన్ఫోసిస్ ప్రధాన కార్యనిర్వహణ అధికారి (సీఈఓ)గా బాధ్యతలు స్వీకరించిన సలీల్ పరేఖ్ ఈ సంవత్సరం ఏప్రిల్ నుంచి వేరియేబుల్ కాంపోనెంట్‌తో కలుపుకొని రూ. 18.6 కోట్ల వార్షిక వేతనం తీసుకోనున్నారు. ఈ సంవత్సరం తొలి మూడు నెలలకు అతను ఫిక్స్‌డ్ వేతనం, ఇతర ప్రయోజనాలతో పాటు రూ. 2.37 కోట్ల ఇనిషియల్ వేరియేబుల్ వేతనాన్ని అందుకోనున్నారు. ఇన్ఫోసిస్ పోస్టల్ బ్యాలెట్ ఈ వివరాలను వెల్లడించింది. అయిదేళ్ల పదవీకాలం కోసం ఈ నెల రెండో తేదీన పరేఖ్ బాధ్యతలు స్వీకరించారు. అయితే పరేఖ్ నియామకాన్ని ఆమోదించాల్సిందిగా ఇన్ఫోసిస్ తన వాటాదారులను కోరింది. ఈ బ్యాలెట్‌ను జనవరి 22-ఫిబ్రవరి 20 మధ్య కాలంలో ఓటింగ్‌కు పెడతారు. యుబీ ప్రవీణ్ రావుకు చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ (సీఓఓ), పూర్తి సమయం డైరెక్టర్ హోదాను ఇచ్చేందుకు కూడా ఇన్ఫోసిస్ తన వాటాదారుల ఆమోదాన్ని కోరింది. ఈ పోస్టల్ బ్యాలెట్ ఫలితాలను ఫిబ్రవరి 24న లేదా అంతకన్నా ముందు వెల్లడిస్తారు. ఈ పోస్టల్ బ్యాలెట్ ప్రకారం, పరేఖ్ వార్షిక వేతనంగా ఫిక్స్‌డ్ వేతనం రూ. 6.5 కోట్లు పొందుతారు. వార్షిక వేరియేబుల్ వేతనం రూ. 9.75 కోట్లపై గరిష్ఠంగా 125 శాతం పొందడానికి ఆయన అర్హులు. ఈ మొత్తం రూ. 12.18 కోట్ల వరకు అవుతుంది. అయితే దీనికి కొన్ని లక్ష్యాలను సాధించవలసి ఉంటుంది. వీటితో పాటు పరేఖ్ నియంత్రణతో కూడిన స్టాక్ యూనిట్లలో రూ. 3.25 కోట్లు పొందుతారు. వార్షిక పర్ఫార్మెన్స్ ఈక్విటీ గ్రాంట్లలో రూ. 13 కోట్లు, వన్ టైమ్ ఈక్విటి గ్రాంట్‌గా రూ. 9.75 కోట్లు స్వీకరిస్తారు.


ఇన్ఫోసిస్ వ్యవస్థాపకులతో ఏర్పడిన విభేదాలతో ఆ సంస్థ సీఈవో పదవి నుంచి నిరుడు ఆగస్టులో వైదొలగిన విశాల్ సిక్కా 2016-17 ఆర్థిక సంవత్సరంలో బోనస్, వాటాలతో కలుపుకొని మొత్తం పరిహారంగా రూ. 45.11 కోట్లు పొందారు.

2016-17 ఆర్థిక సంవత్సరంలో విప్రో సీఈఓ అబిదాలి నీముచ్‌వాలా తీసుకున్న వేతనం 2.09 మిలియన్ డాలర్లు (రూ. 13.2 కోట్లు). అదే సంవత్సరం టీసీఎస్ సీఈవో రాజేశ్ గోపినాథ్ రూ. 6.22 కోట్ల వేతనం పొందారు.

పుంజుకున్న కీలక సూచీలు

- కొత్త సంవత్సరంలో తొలిసారి 176 పాయింట్లు పెరిగిన సెన్సెక్స్
- 62 పాయింట్లు పెరిగిన నిఫ్టీ
- మదుపరులను ఆకట్టుకున్న పీఎస్‌బీలు





ముంబయి, జనవరి 4: కేంద్ర ప్రభుత్వం బ్యాంకుల రీక్యాపిటలైజేషన్ కార్యక్రమం అమలులో ముందడుగు వేయడంతో పాటు స్థూలార్థిక గణాంక సూచీలు మదుపరులను ఆకట్టుకోవడం, ప్రపంచ స్టాక్ మార్కెట్లలో సానుకూల ధోరణి నెలకొనడంతో దేశీయ స్టాక్ మార్కెట్లు గురువారం పుంజుకున్నాయి. బొంబాయి స్టాక్ ఎక్స్ఛేంజ్ (బీఎస్ఈ) సెన్సెక్స్ కొత్త సంవత్సరం 2018లో తొలిసారి గురువారం 176 పాయింట్లు పెరిగి, 33,970 పాయింట్ల వద్ద ముగిసింది. నిరర్థక ఆస్తుల భారంతో కుంగిపోతున్న ప్రభుత్వ రంగ బ్యాంకులను (పీఎస్‌బీలను) ఆదుకోవడానికి ప్రకటించిన రీక్యాపిటలైజేషన్ కార్యక్రమంలో భాగంగా బాండ్ల ద్వారా రూ. 80వేల కోట్లు అదనంగా వ్యయం చేయడానికి ఆమోదం తెలపాలని కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ గురువారం పార్లమెంటును కోరింది. దీంతో ఒక్కసారిగా ప్రభుత్వ రంగ బ్యాంకుల షేర్లకు స్టాక్ మార్కెట్‌లో మదుపరుల నుంచి మంచి ఆదరణ లభించింది. ఫలితంగా ప్రభుత్వ రంగ బ్యాంకులు ఆకర్షణీయమైన లాభాలను గడించాయి. సెన్సెక్స్ ప్యాక్‌లోని దిగ్గజ బ్యాంకు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) షేర్ ధర 1.72 శాతం పెరిగింది. యూకో బ్యాంక్, ఐడీబీఐ, పంజాబ్ నేషనల్ బ్యాంక్, బ్యాంక్ ఆఫ్ ఇండియా, బ్యాంక్ బరోడా, ఓరియెంటల్ బ్యాంక్ ఆఫ్ కామర్స్ గురువారం లాభపడిన వాటిలో ఉన్నాయి. కొత్త ఆర్డర్లు స్థిరపడటంతో దేశ తయారీ రంగం డిసెంబర్ నెలలో తిరిగి పుంజుకుందని ఒక నెలవారీ సర్వే వెల్లడించడంతో మార్కెట్‌లో సెంటిమెంట్ బలపడింది. సెన్సెక్స్ గురువారం 33,912.49 పాయింట్ల అధిక స్థాయిల వద్ద ప్రారంభమయి, 33,995.40-33,802.13 పాయింట్ల మధ్య కదలాడింది. చివరకు క్రితం ముగింపుతో పోలిస్తే 176.26 పాయింట్లు (0.52 శాతం) పుంజుకొని 33,969.64 పాయింట్ల వద్ద ముగిసింది. సెన్సెక్స్ క్రితం మూడు సెషన్లలో కలిపి 263.45 పాయింట్లు పడిపోయింది. 50 షేర్లతో కూడిన నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్ఎస్ఈ) నిఫ్టీ కూడా గురువారం క్రితం ముగింపుతో పోలిస్తే 61.60 పాయింట్లు (0.59 శాతం) పుంజుకొని, 10,504.80 పాయింట్ల వద్ద స్థిరపడింది. అంతకు ముందు ఈ సూచీ 10,513- 10,441.45 పాయింట్ల మధ్య కదలాడింది. ప్రపంచ స్టాక్ మార్కెట్లలో నెలకొన్న సానుకూల ధోరణితో పాటు దేశ సేవారంగాల పీఎంఐ గణాంకాలలో మెరుగుదల నమోదు కావడం.. స్తబ్దుగా ఉన్న దేశీయ మార్కెట్లు పుంజుకోవడానికి దోహదపడింది.

ప్రపంచ వృద్ధి సానుకూల అంచనాతో పాటు లోహ కంపెనీల షేర్లలో ఎడతెరిపి లేకుండా కొనుగోళ్లు నమోదు కావడంతో దేశీయ మార్కెట్లలో సెంటిమెంట్ బలపడింది. రీక్యాపిటలైజేషన్ కార్యక్రమం అమలులో ముందడుగు పడటంతో ప్రభుత్వ రంగ బ్యాంకుల షేర్లకు గిరాకీ బాగా పెరిగింది అని జియోజిత్ ఫైనాన్షియల్ సర్వీసెస్ పరిశోధన విభాగం అధిపతి వినోద్ నాయర్ తెలిపారు. ఇదిలా ఉండగా, బుధవారం ఫారిన్ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్లు (ఎఫ్‌పీఐలు) నికరంగా రూ. 96.31 కోట్ల విలువ గల షేర్లను కొనుగోలు చేయగా, దేశీయ సంస్థాగత మదుపరులు (డీఐఐలు) రూ. 269.20 కోట్ల విలువ గల షేర్లను విక్రయించారు. గురువారం నాటి లావాదేవీల్లో సెన్సెక్స్ ప్యాక్‌లోని టాటా స్టీల్ అత్యధికంగా 3.74 శాతం లాభపడింది. 3.14 శాతం లాభంతో డాక్టర్ రెడ్డీస్ తరువాత స్థానంలో నిలిచింది.

లాభపడిన ఇతర కంపెనీలలో ఎల్ అండ్ టీ, ఓఎన్‌జీసీ, ఆసియన్ పెయింట్స్, సన్ ఫార్మా, కోల్ ఇండియా, ఎస్‌బీఐ, ఇండస్‌ఇండ్ బ్యాంక్, భారతి ఎయిర్‌టెల్, టీసీఎస్, బజాజ్ ఆటో, రిలయన్స్ ఇండస్ట్రీస్, యెస్ బ్యాంక్, అదాని పోర్ట్స్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ ఉన్నాయి. వీటి షేర్ల ధరలు 3.08 శాతం వరకు పెరిగాయి.

రంగాల వారీ సూచీలలో లోహ 2.77 శాతం, కన్స్యూమర్ డ్యూరేబుల్స్ 2.53 శాతం, క్యాపిటల్ గూడ్స్ 2.11 శాతం, పీఎస్‌యూలు 1.55 శాతం, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ 1.03 శాతం, హెల్త్‌కేర్ 0.99 శాతం, చమురు- సహజ వాయువు 0.80 శాతం, బ్యాంకెక్స్ 0.51 శాతం, పవర్ 0.33 శాతం చొప్పున పెరిగాయి.

స్టార్టప్‌ల కోసం బిజినెస్ యాక్సిలేటర్

హైదరాబాద్, పుణే నగరాల్లో ప్రారంభించిన వాద్వానీ

ఆంధ్రభూమి బ్యూరో

హైదరాబాద్, జనవరి 4: స్టార్టప్‌ల కోసం వాద్వానీ ఫౌండేషన్ అనే సంస్థ నేషనల్ ఎంటర్ ప్రెన్యూర్‌షిప్ నెట్‌వర్క్ ఆధ్వర్యంలో బిజినెస్ యాక్సలేటర్ డబ్ల్యుఎఫ్ వెంచర్ స్కేప్‌లను హైదరాబాద్, పుణే నగరాల్లో ప్రారంభించినట్లు వాద్వానీ సంస్థ సిఇవో డాక్టర్ అజయ్ కేలా తెలిపారు. వినియోగదారులు, క్యాష్, కెపాసిటీపై కేంద్రీకృత కోచింగ్, కన్సెల్టింగ్‌ను అందిస్తున్నట్లు చెప్పారు. యుఎస్ కేంద్రదంగ ఉన్న యాష్ మౌర్య స్టార్టప్‌తో వీడియోకాన్ఫరెన్సు లేదా వ్యక్తిగతంగా సంభాషించి ఈ కార్యక్రమాన్ని ప్రయోజనాన్ని తెలుపుతారన్నారు. భారతదేశంలో ఇప్పుడు 140 యాక్సలేటర్లు ఉన్నాయన్నారు. చైనాలో 1500 ఇంక్యుబలేటర్లు, యాక్సలేటర్లు ఉన్నాయన్నారు. ఈ నెల 8వ తేదీ లోపు డబ్ల్యుఎఫ్ఎన్ఇఎన్. ఆర్గ్ వద్ద స్టార్టప్‌లలను నమోదు చేసుకోవచ్చన్నారు.

జనవరి 10న ఐపివోను ఆఫర్ చేయనున్న అపోలో మైక్రో

ఈ నెల 10వ తేదీన రూ.270 నుంచి రూ.275 ధరపై ఐపివోను ఆఫర్ చేయనున్నటుల అపోలో మైక్రో సిస్టమ్స్ ప్రకటించింది. 20 సంవత్సరాలుగా ఏరోస్పేస్, రక్షణ, అంతరిక్షణం, హోమ్ ల్యాండ్ సెక్యూరిటీ, ట్రాన్స్‌పోర్టేషన్ సెక్టార్ల రంగంలో తమ సంస్థ సేవలు అందిస్తున్నట్లు పేర్కొంది. తమ ఐపివో ముఖ విలువ రూ.156 కోట్లని, రిటైల్ ఇన్వెస్టర్లకు రూ.12 డిస్కౌంట్ ఇస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ నెల 10వ తేదీన ఐపివో ప్రారంభమై, 12వ తేదీన ముగిస్తామన్నారు. ఎన్ఎస్ఇ, బిఎస్ఇలోషేర్లు లిస్ట వుతాయన్నారు.

8 లక్షల మంది కార్మికులు ఉపాధికి దూరం

- బాణసంచా ఫ్యాక్టరీల మూసివేతపై డీఎంకే ఆందోళన
- పర్యావరణ పరిరక్షణ నిబంధనలు సడలించాలని వినతి

న్యూఢిల్లీ, జనవరి 4: బాణసంచాపై నిషేధం వల్ల ఏర్పడిన అనిశ్చితితో తమిళనాడులో 840 ఫ్యాక్టరీలు మూతపడి దాదాపు 8 లక్షల మంది కార్మికులు ఉపాధిని కోల్పోయారని రాజ్యసభలో డిఎంకే ఆందోళన వ్యక్తం చేసింది. రాజ్యసభలో జీరో అవర్ సందర్భంగా డిఎంకే సభ్యుడు తిరుచ్చి శివ మాట్లాడుతూ, కాలుష్యానికి బాణసంచా ఒక్కటే కారణం కాదని, పర్యావరణ పరిరక్షణ నిబంధనల నుంచి ఈ పరిశ్రమకు మినహాయింపు ఇవ్వాలని కోరారు. బాణసంచాపై దేశవ్యాప్త నిషేధం ఫ్యాక్టరీల యాజమాన్యాలను భయాందోళలకు గురి చేసిందని, వారు లైసెన్స్‌లను కోల్పోయే ప్రమాదం ఏర్పడిందన్నారు. 8 లక్షల మంది బాణసంచా కార్మికులు పనులు కోల్పోవడంతో శివకాశి పట్టణం ఎడారిలా మారిందన్నారు. బాణసంచా వ్యాపారులు పెట్టుబడులు పెట్టనందున గత నెలలో కొనుగోళ్లకు ఎలాంటి ఆర్డర్లు లేవన్నారు. ఏడాది పొడవునా పని ఉండే బాణసంచా కర్మాగారాల్లో దీపావళికి ముందు నెల రోజులు మాత్రమే అమ్మకాలుంటాయని ఆయన వివరించారు. ప్రపంచంలో ఎక్కడాలేని రీతిలో భారత్‌లో బాణసంచాపై నిషేధం విధించారని ఆయన అన్నారు. దేశ రాజధాని ఢిల్లీలో దీపావళి సందర్భంగా బాణసంచా విక్రయాలను నిషేధించినా, కాలుష్యం ఏ మాత్రం తగ్గలేదన్నారు. కాలుష్యానికి దీపావళి ఒక్కటే కారణం కాదని రుజువైందన్నారు. ప్రభుత్వం ఈ విషయాన్ని తీవ్రంగా ఆలోచించి బాణసంచా పరిశ్రమను, లక్షలాది మంది కార్మికులను ఆదుకోవాలని శివ కోరారు. పర్యావరణ పరిరక్షణ నిబంధన-1986లోని రూల్ 3బీ నుంచి బాణసంచా వ్యాపారాన్ని మినహాయించడమే శాశ్వత పరిష్కార మార్గం అని ఆయన అన్నారు. కార్మికుల జీవితాలనే కాదు, దేశ ఆర్థిక వ్యవస్థను మెరుగుపరచాలన్నా బాణసంచా పరిశ్రమపై ఆంక్షలు ఎత్తివేయాలన్నారు.

లాభదాయకం లేని బ్యారన్లను తొలగించండి

కేంద్రానికి పొగాకు రైతుల విజ్ఞప్తి

ఆంధ్రభూమి ప్రతినిధి

న్యూఢిల్లీ, జనవరి 4: ఏపీలో లాభాలలో లేని పొగాకు బ్యారన్లను తీసివేయడానికి అనుమతి ఇవ్వాలని గోదావరి జిల్లా రైతులు కేంద్ర వాణిజ్య శాఖ మంత్రి సురేష్ ప్రభుకి విజ్ఞప్తి చేశారు. ఎంపీలు తోట నరసింహం, మురళీమోహన్, మాగంటి బాబు, గల్లా జయదేవ్, రాయపాటి సాంబశివరావు, కంభంపాటి హరిబాబు, కొత్తపల్లి గీత గురువారం కేంద్ర మంత్రిని కలిసి వినతిపత్రం అందజేశారు. లాభదాయకంగా లేని బ్యారన్లను తొలిగించడానికి అనుమతి ఇవ్వడంతోపాటు రూ.10 లక్షలు పరిహారం కల్పించాలని కేంద్ర మంత్రిని అభ్యర్థించారు. అలాగే నకిలీ సిగరెట్లకు అడ్డుకట్ట వేస్తే, రైతులకు మంచి ధర వస్తుందని వివరించారు. బ్యారన్లను తొలిగించాలనుకుంటున్న రైతులను ఏ విధంగా అదుకోవాలన్న దానిపై పది రోజుల్లో నిర్ణయిస్తామని కేంద్ర మంత్రి హామీ ఇచ్చినట్టు రైతులు తెలిపారు.

సైనిక సంక్షేమానికి ఆర్చరీ జ్యోతి సురేఖ విరాళం

ఆంధ్రభూమి ప్రతినిధి

న్యూఢిల్లీ, జనవరి 4: సైనిక సంక్షేమ నిధికి రూ.5 లక్షల చెక్‌ను ప్రధాని నరేంద్ర మోదీకి ఆర్చరీ క్రిడాకారిణి జ్యోతి సురేఖ గురువారం అందజేశారు. పార్లమెంట్‌లో ప్రధాని నరేంద్ర మోదీని కలిసిన జ్యోతి సురేఖ తనకు వచ్చిన నగదును చెక్ రూపంలో సైనిక సంక్షేమ నిధికి ఇవ్వాలని నిర్ణయించుకున్నట్టు తెలిపారు. సరిహద్దులో దేశంకోసం పనిచేస్తున్న సైనికుల సంక్షేమానికి తన వంతు భాగస్వామ్య ఉండాలనే ఉద్దేశంలో ఈ నిర్ణయం తీసుకున్నట్టు వివరించింది. అర్చరీ వ్యక్తిగతం విభాగంలో ప్రపంచ చాంపియన్ పతకం సాధించాలనే లక్ష్యంతో ఉన్నట్టు సురేఖ తెలిపారు.

రూ. 500 ఇస్తే ఆధార్ వివరాలు!

ఖండించిన యుఐడీఏఐ

న్యూఢిల్లీ, జనవరి 4: ఐదొందల రూపాయలు చెల్లిస్తే పేటియంలో వ్యక్తుల ఆధార్ వివరాలు పొందవచ్చన్న మీడియా కథనాలను విశిష్ట గుర్తింపుప్రాధికారిత సంస్థ (యుఐడీఏఐ) కొట్టిపారేసింది. 500 రూపాలతో లక్ష మంది వ్యక్తుల ఆధార్ వివరాలు క్షణాల్లో లభిస్తాయని ఓ ఆంగ్ల పత్రికలో కథనాలు వెలువడ్డాయి. దీనిపై యూనిక్ ఐడీ తీవ్రంగానే స్పందించింది. 'ఆధార్ వివరాలకు పూర్తి భద్రత ఉంది. ఎట్టిపరిస్థితుల్లోనూ బయటకు వచ్చే అవకాశం లేదు. 12 అంకెల యూనిక్‌ఐడీ సురక్షితం'అంటూ సంస్థ ప్రకటించింది. ఆధార్ గోప్యతకు సంబంధించి ఎలాంటి అనుమానాలూ వద్దని ఇలాంటి వదంతులను నమ్మొద్దనని ప్రజలకు విజ్ఞప్తి చేసింది. పేటియం ఏజెంట్‌కు 500 రూపాయల చెల్లించి వేరే వ్యక్తుల ఆధార్ వివరాలు సంపాదించాడని పత్రిక పేర్కొంది. లాగిన్ ఐడీ, పాస్‌వర్డ్‌తో 10 నిముషాల్లో ఆధార్ వివరాలు రాబట్టవచ్చని కథనాలు వెలువడ్డాయి. అయితే ఇవన్నీ కల్పిత కథనాలని, వీటిని నమ్మవద్దనని యుఐడీఏఐ ఖండించింది.

పాలమూరు కంది రైతులకు కష్టాలు

- మద్దతు ధరకు తూట్లు
- హాకా కొనుగోళ్ల తర్వాత నెలరోజులకు చెల్లింపులు
- ఇదే అదనుగా భావించి రంగంలోకి దిగిన ప్రైవేటు వ్యాపారులు
- రైతులకు కుచ్చుటోపీ ...నిండిన ప్రభుత్వ గోదాము
- తరలింపులో జాప్యం..మార్కెట్ యార్డులలో రైతుల ఇక్కట్లు

ఆంధ్రభూమి బ్యూరో

మహబూబ్‌నగర్, జనవరి 4: కరవుకు, వలసలకు నిలయంగా మారి కొట్టుమిట్టాడుతున్న పాలమూరు రైతాంగానికి వ్యవసాయం కత్తిమీద సాముగానే మారింది. పండించిన పంటను మార్కెట్‌కు తీసుకువస్తే గిట్టుబాటుధర రాక ఇబ్బందులకు గురవుతున్నారు. మహబూబ్‌నగర్ జిల్లా లో కందిరైతులకు కష్టాలు మొదలయ్యాయి. ఆరుగాలం పండించిన కందులను మార్కెట్‌లోకి తీసుకువచ్చి అమ్మకం చేస్తే అందుకు నెలరోజుల తర్వాత డబ్బులు వస్తాయని చెబుతుండటంతో రైతులు అవాక్కుఅవుతున్నారు. ఇదే అదునుగా భావించిన దళారులు ప్రైవేటు వ్యాపారస్థులను రంగంలోకి దింపి కందుల కొనుగోళ్లకు శ్రీకారం చుట్టారు. ఈ తతంగం మహబూబ్‌నగర్ జిల్లాలోని వివిధ మార్కెట్ యార్డులలో బహిరంగంగానే కొనసాగుతోంది. నారాయణపేట తదితర ప్రాంతాల్లో కందిపంటను పెద్ద ఎత్తున రైతులు మార్కెట్ యార్డులకు తీసుకువస్తున్నారు. అయితే ఈ ఏడాది ప్రభుత్వం హాకాకు అప్పజెప్పింది. మహబూబ్‌నగర్ జిల్లాలో దాదాపు 80వేల మెట్రిక్ టన్నుల కందులు దిగుబడి అవుతాయని వ్యవసాయ శాఖ లెక్కలు చెబుతున్నాయి. అయితే ప్రస్తుతం కందులు మార్కెట్‌లోకి వచ్చాయి. హాకా అధికారులతో పాటు ఇతరాత్ర అధికారులు వ్యవహారించే తీరుతో పాలమూరు రైతాంగానికి కొత్త కష్టం వచ్చిపడింది. మద్దతు ధర కల్పించేందుకు ప్రభుత్వం హాకా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కందుల కొనుగోలు కేంద్రాల అధికారులు మాత్రం అధికంగా మార్కెట్లకు కందులు రావడంతో వారు చేతులు ఎత్తేశారు. అయితే ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర రూ.5.450కాగా గురువారానికి ఈ ధర ఒక్కసారిగా రూ.4,200గా ప్రైవేటు వ్యాపారస్థులు రంగంలోకి దిగడంతో రైతులను నట్టేట ముంచారు. బహిరంగంగానే ఈ వ్యవహారం జరుగుతున్నప్పటికీ జిల్లా అధికారులు చూసీచూడనట్టు వ్యవహరిస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. మహబూబ్‌నగర్ జిల్లా నారాయణపేటలో హాకా కేంద్రం ఆధ్వర్యంలో కందుల కొనుగోలు ప్రక్రియ ప్రారంభం అయ్యింది. అయితే పెద్ద ఎత్తున నారాయణపేట మార్కెట్‌కు కందులను రైతులు తీసుకురావడంతో వచ్చిన కందులను గోదాములలో నిలువ చేశారు. గోదాములన్నీ నిండిపోయాయి. గోదాములలో నిలువచేసిన కందులను తరలించేందుకు సైతం సమయం లేనందున ఇప్పటికిప్పుడు రైతులు తెస్తున్న కందులను కొనుగోలు చేసే పరిస్థితి లేదంటూ హాకా అధికారులు చేతులు ఎత్తేస్తున్నారు. అయితే కొనుగోలు చేసిన వాటికి కూడా నెలరోజుల తర్వాత తమ ఖాతాల్లోకి డబ్బులు వస్తాయని అధికారులు చెబుతుండడం రైతులను విస్మయానికి గురిచేస్తోంది. దీంతో చేసేది లేక రైతులు ప్రైవేటు వ్యాపారులను సైతం ఆశ్రయిస్తున్నారు. ఇదే అదనుగా భావిస్తున్న ప్రైవేటు వ్యాపారస్థులు కందులకు మద్దతు ధర కాకుండా దాదాపు రూ.1200 తగ్గించి కొనుగోలు చేస్తుండటంతో రైతులు తీవ్ర నష్టాలకు గురవుతున్నారు. ఈ విషయంపై హాకా మేనేజర్ శ్రీనివాస్‌మూర్తిని వివరణ కోరగా ప్రతి గింజను కొనుగోలు చేస్తామని, రైతులు ఎలాంటి అపోహాలకు గురికావద్దని గోదాములు నిండిపోయినందున కొంత ఆలస్యం అవుతోందని తెలిపారు. డబ్బులు పదిహేను రోజుల్లో రైతుల ఖాతాల్లో జమచేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఈ విషయంపై జిల్లా వ్యవసాయశాఖ అధికారి సుచరితను సంప్రదించగా జిల్లాలో ఈ ఏడాది కందుల దిగుబడి దాదాపు 80వేల మెట్రిక్ టన్నులు రావచ్చని ఇప్పటికే మార్కెట్‌లోకి దాదాపు లక్ష క్వింటాళ్లకు పైగా వచ్చిందని తెలిపారు. అయితే కందుల కొనుగోలు మొత్తం హాకా ద్వారా కొనసాగుతుందని తెలిపారు. ఇది ఇలా ఉండగా గురువారం మహబూబ్‌నగర్ జిల్లా కలెక్టర్ రోనాల్డ్‌రోస్ దేవరకద్ర వ్యవసాయ మార్కెట్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. మార్కెట్‌కు రైతులు తీసుకువచ్చిన కందులను పరిశీలించి కొనుగోళ్ల వివరాలను రైతులను అడిగి తెలుసుకుని రైతులకు ఇబ్బందులకు కలుగకుండా చూడాలని తెలిపారు. ఏదిఎమైనప్పటికీ మహబూబ్‌నగర్ జిల్లాలో మార్కెట్‌లోకి కందులు భారీగా రావడంతో గోదాములన్నీ నిండిపోవడం ప్రైవేటు వ్యాపారస్థులు రంగంలోకి దిగడంతో రైతులకు తీవ్రనష్టం జరుగుతుందని చెప్పవచ్చు.



మహబూబ్‌నగర్ జిల్లా ధన్వాడ సింగిల్ విండో కార్యాలయం దగ్గర బారులు తీరిన రైతులు తీసుకువచ్చిన కందుల ట్రాక్టర్లు

2,400 కిలోమీటర్లు ప్రయాణించిన 'ఓఖీ'!

★ నలభై ఏళ్ల చరిత్రలో ఇదే పెనుతుపాను

చెన్నై, జనవరి 4: భారత్‌కు సంబంధించి గత 40 ఏళ్లలో తీవ్రమైనదిగా, సుమారు 2,400 కిలోమీటర్ల మేరకు ప్రయాణించిన తుపానుగా 'ఓఖీ' రికార్డులు సృష్టించింది. బంగాళాఖాతం నుంచి గుజరాత్ తీరం వరకూ గత నవంబర్ 29న అల్పపీడనంగా ఏర్పడి, మరుసటి రోజున ఓఖీ తుపానుగా బీభత్సరూపం దాల్చింది. తమిళనాడులోని కన్యాకుమారి తీర ప్రాంతంలో ఇది తీవ్రస్థాయిలో ఏర్పడింది.

ఫలితంగా గుజరాత్ తీరం వరకూ విధ్వంసం కొనసాగింది. డిసెంబర్ 6న ఇది బలహీనపడింది. గత నాలుగు దశాబ్దాల కాలంలో 2,400 కిలోమీటర్ల మేరకు ప్రయాణించిన తుపానుగా ఓఖీ రికార్డు సృష్టించిందని చెన్నైలోని ప్రాంతీయ వాతావరణ కేంద్రం డైరెక్టర్ ఎస్.బాలచంద్రన్ చెబుతున్నారు. ఓఖీ కన్నా తీరంలో ఎక్కువ దూరం వ్యాపించిన తుపాను 1922 డిసెంబర్‌లో బంగాళాఖాతంలో ఏర్పడిందని ఆయన వివరించారు. ఆ తుపాన్ బంగాళాఖాతం నుంచి యమెన్ తీరం వరకూ 4వేల కిలోమీటర్ల మేరకు కొనసాగిందన్నారు. 1966 నవంబర్‌లో, 1977 నవంబర్‌లో, 1978 నవంబర్‌లో బంగాళాఖాతంలో ఏర్పడిన తుపాన్లు 3వేల కిలోమీటర్ల మేరకు విస్తరించాయని తెలిపారు. అయితే, ఈ తుపానులేవీ తమిళనాడుపై ప్రభావం చూపలేదని, ఓఖీ వల్ల తమిళనాడు దక్షిణ జిల్లాల్లో అధిక వర్షపాతం నమోదైందని తెలిపారు. ఓఖీ తుపానుపై అధ్యయనానికి సంబంధించి మరికొన్ని నివేదికలు ఇంకా అందాల్సి ఉందన్నారు. తుపానుల బారిన పడకుండా నెలరోజుల ముందు ఎలాంటి జాగ్రత్తచర్యలు తీసుకోలేమని, వాతావరణ శాస్త్రం ఇంకా విస్తృతం కావాల్సి ఉందన్నారు. ఓఖీ తుపాను కారణంగా తమిళనాడు, కేరళ, లక్షద్వీప్ తీర ప్రాంతాల్లో భారీగా ఆస్తి,ప్రాణనష్టం జరిగిందన్నారు. ఓఖీ తుపాను రావడానికి ముందే సముద్రంలోకి వెళ్లిన వందలాది మంది జాలర్లు ఇప్పటికీ ఆచూకీ లేకుండా పోయారు.

పరిశ్రమల కోసం 2000 ఎకరాల భూసేకరణ

విశాఖలో మౌలిక సదుపాయాలకు రూ.3000 కోట్లు ◆ అనుమతుల మంజూరులో విశాఖకు మొదటి స్థానం

ఆంధ్రభూమి బ్యూరో

విశాఖపట్నం, జనవరి 4: ఆర్థిక రాజధాని విశాఖ నగరంలో పరిశ్రమల స్థాపనకు అనేక కంపెనీలు ఆసక్తికనబరుస్తున్నాయి. గడచిన రెండు సంవత్సరాల నుంచి విశాఖలో సిఐఐ భాగస్వామ్య సదస్సులు జరుగుతున్నాయి. ఈ సంవత్సరం ఫిబ్రవరిలో మరో సదస్సు జరగనుంది. గడచిన రెండు సిఐఐ సదస్సుల్లో సుమారు 15 లక్షల కోట్ల రూపాయల పెట్టుబడులు రావల్సి ఉంది. అయితే, విశాఖకు అనుకున్న స్థాయిలో పరిశ్రమలు రావడం లేదు. దీనికి ప్రధాన కారణం భూముల విలువ గణనీయంగా పెరిగిపోవడమే. తమిళనాడులో కూడా భూముల ధరలు ఆకాశాన్నంటడంతో పారిశ్రామికవేత్తలు ఆంధ్రప్రదేశ్ వైపు దృష్టిసారించారు. అయితే, ఇక్కడ కూడా పెరిగిన ధరలు పారిశ్రామికవేత్తలను ఆందోళనకు గురిచేస్తున్నాయి.

తమిళనాడులో మారుతున్న రాజకీయ సమీకరణలు, అస్థిర ప్రభుత్వాల కారణంగా పారిశ్రామికవేత్తలు ఏపీలోనే పెట్టుబడులు పెట్టడానికి ఆసక్తి చూపాల్సి వచ్చింది. దీనివలనే నెల్లూరులోని శ్రీ సిటీకి పెద్ద ఎత్తున భారీ పరిశ్రమలు తరలి వస్తున్నాయి. ఇక్కడ కూడా ఎకరా 60 నుంచి 75 లక్షల రూపాయలు పలుకుతోంది. అదే పరిస్థితి విశాఖ జిల్లాలో కూడా ఉంది. అచ్యుతాపురం ఎస్‌ఈజెడ్‌లో ఎకరా 75 లక్షలు పలుకుతోంది. నక్కపల్లి, రాంబిల్లి తదితర ప్రాంతాల్లో ఎకరాల 60 లక్షలు విక్రయిస్తున్నారు. అయినా, భారీ పరిశ్రమలకు కావల్సినంత భూమి ఏపీఐఐసీ వద్ద లేదు. దీంతో కొత్తగా నక్కపల్లి, రాంబిల్లి మండలాల్లో మరో రెండు వేల ఎకరాల భూమిని సేకరించడానికి రంగం సిద్ధం చేశారు. అచ్యుతాపురం ఎస్‌ఈజెడ్‌లో కొంత భూమిని డీనోటిఫైడ్ చేయడం వలన పరిశ్రమల శాఖకు 5500 ఎకరాలు అందుబాటులోకి వచ్చాయి.

రాష్ట్రంలో మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ఏషియన్ డవలప్‌మెంట్ బ్యాంక్ ఆంధ్ర ప్రదేశ్‌కు ఆరు వేల కోట్ల రుణం మంజూరు చేసింది. ఈ మొత్తంతో శ్రీకాళహస్తి, విశాఖ జిల్లాలోని అచ్యుతాపురం, విశాఖ నగరంలో మౌలిక సదుపాయాలు కల్పించనున్నారు. ఈ ఆరు వేల కోట్లలో విశాఖ జిల్లాకు సుమారు 3000 కోట్లు వచ్చే అవకాశం ఉందని అధికారులు తెలియచేస్తున్నారు. ఈ నెలలో భూసేకరణ, మౌలిక సదుపాయాలకల్పన పనులు ఆరంభంకానున్నాయి.

రాంబిల్లిలో స్టీల్ ఫ్యాక్టరీ

ఇదిలా ఉండగా విశాఖ జిల్లా రాంబిల్లి వద్ద మిట్టల్ గ్రూప్ స్టీల్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేయబోతోంది. ఈ ప్రక్రియ వేగవంతంగా జరుగుతోందని పరిశ్రమల శాఖ అధికారులు తెలియచేశారు. అలాగే, పిడిలైట్ గమ్ కంపెనీ, సెయింట్‌గోబెన్ అద్దాల కంపెనీల యాజమాన్యాల ప్రతినిధులు స్థలాలను పరిశీలించి వెళ్లారు. ఇక 2016లో ఫార్మా రంగంలో లారస్ గ్రూప్ రెండు యూనిట్లను, అరబిందో ఫార్మసీ ఒక యూనిట్‌ను ప్రారంభించింది. అలాగా శ్రావణ్ షిప్పింగ్ కంపెనీకి 30 ఎకరాల భూమి కోసం దరఖాస్తు చేసుకుంది. విశాఖ జిల్లా చిప్పాడ వద్ద దివీస్ ల్యాబ్ విస్తరణకు గ్రీన్ ట్రిబ్యునల్ నుంచి అనుమతి లభించడంతో ఆ పనులు ప్రారంభమయ్యాయి. ఐఓసీఎల్ కొత్త యూనిట్ కోసం సుమారు 50 ఎకరాల భూమిని కేటాయించడంతో, నిర్మాణ పనులు ప్రారంభించింది. బీపీసీఎల్ విశాఖ పోర్టుకు సమీపంలో భూమి కోసం అన్వేషిస్తోంది. ఇదిలా ఉండగా 2017లో చైనాకి చెందిన నార్త్-ఈస్టర్న్ పవర్ కార్పొరేషన్ 500 కోట్ల పెట్టుబడితో విద్యుత్ ఉత్పత్తి కేంద్రాన్ని ఏర్పాటు చేయడానికి ముందుకు వచ్చింది. 100 కోట్ల రూపాయలతో చేపట్టిన తొలి దశ పనులు పూర్తయ్యాయి. విద్యుత్ ఉత్పత్తి ట్రయర్ రన్ ప్రస్తుతం జరుగుతోంది. ఏప్రిల్ నుంచి పూర్తి స్థాయిలో ఉత్పత్తి ప్రారంభించబోతోంది. అలాగే సబ్బవరం సమీపంలోని పైడి దగ్గర ఉడ్ పార్క్ ఏర్పాటు చేయబోతోన్నారు. జిల్లాలోని సామిల్లులన్నింటినీ ఒకే చోట చేర్చి, జాతీయ, అంతర్జాతీయ నాణ్యతతో కలప వ్యాపారానికి రంగం సిద్ధం చేస్తున్నారు. శ్రీకాకుళం జిల్లాలో గ్రానైట్ గనులు పెద్ద ఎత్తున ఉన్నందున గాలి భీమవరం వద్ద స్టోన్ పార్క్‌ను ఏర్పాటు చేయబోతున్నారు.

కాగా, పరిశ్రమలకు అనుమతులు మంజూరు చేయడంలో రాష్ట్రంలో విశాఖ జిల్లాలో మొదటి స్థానంలో ఉంది. గత ఏడాది పరిశ్రమలకు 98.4 శాతం అనుమతులు మంజూరు చేశారు.

జన్మభూమి పూర్తయ్యేలోగా వినతులు పరిష్కరించాలి

◆ పిటిషనర్ల మొబైళ్లకు ఆన్‌లైన్ ఎకనాలెడ్జ్‌మెంట్స్ వెళ్లాలి
◆ వీడియో కాన్ఫరెన్స్‌లో ముఖ్యమంత్రి చంద్రబాబు

ఆంధ్రభూమి బ్యూరో

విశాఖపట్నం, జనవరి 4: ఐదవ విడత జన్మభూమి-మా ఊరు కార్యక్రమం పూర్తయ్యేలోగా గతంలో, ప్రస్తుతం ప్రజల నుంచి స్వీకరించిన వినతులన్నింటినీ పరిష్కరించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్ని శాఖల కార్యదర్శులను, ఉన్నతాధికారులను ఆదేశించారు. గురువారం విశాఖలోని పోర్టు గెస్ట్‌హౌస్ నుంచి వీడియోకాన్ఫరెన్స్‌లో అధికారులతో మాట్లాడుతూ జన్మభూమి-మా ఊరు కార్యక్రమ ప్రగతిని సమీక్షించారు. రియల్‌టైమ్ గవర్నెన్స్ ముఖ్య కార్యదర్శి బాబు జన్మభూమి కార్యక్రమాల్లో సాధించిన ప్రగతిని అంశాల వారీగా సీఎంకు వివరించారు. ఆ తరువాత చంద్రబాబు మాట్లాడుతూ జన్మభూమిలో ఏ రోజు అందిన పిటిషన్లను ఆరోజే ఆన్‌లైన్‌లో అప్‌డేట్ చేసి పరిష్కరించాలని అన్నారు. అవసరమైతే కార్యాలయాల్లో రేయింబవళ్లు ఉండి, పిటిషన్ల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించాలని అన్నారు. వినతులు అందచేసిన వారికి వెంటనే వారి మొబైల్స్‌కు ఆన్‌లైన ఎకనాలెడ్జ్‌మెంట్ వెళ్లేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. ఏరోజుకు ఆరోజు అందిన పిటిషన్‌లను ఆరోజే ఆర్థిక, ఆర్థికేతర, వ్యక్తిగత, సామూహిక వినతులుగా విడగొట్టి, వాటిని తక్షణమే పరిష్కరించాలని అన్నారు. అంశాల వారీగా ప్రజల నుంచి సేకరించిన ఫీడ్‌బ్యాక్ ఆధారంగా,


వీడియోకాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న సీఎం చంద్రబాబు

ప్రజలు వేటిపై సంతృప్తిని, వేటిపై అసంతృప్తిని వ్యక్తం చేశారో తెలియచేస్తూ, రేటింగ్ జాబితాను రూపొందించాలని సూచించారు. టాప్-10, లాస్ట్-10పై ప్రత్యేక దృష్టిపై సారిస్తూ, టాప్ 10, లాస్ట్ 10 ర్యాంకింగ్‌లు రావడంపై విశ్లేషించాలని అన్నారు. పంచాయతీరాజ్, హెల్త్, డ్వాక్రా, వెటర్నరీ తదితర శాఖల ర్యాంకులు అధమంగా ఉండడానికి కారణాలను ఆయా శాఖల ఉన్నతాధికారులు వివరణ ఇవ్వాలని చంద్రబాబు ఆదేశించారు.

శుక్రవారం విద్య-వికాశం అంశంపై చర్చలు జరగనున్న నేపథ్యంలో విద్యార్థులు అందరినీ ఇందులో భాగస్వాములను చేయాలని, విద్యాశాఖల ఉన్నతాధికారులను ముఖ్యమంత్రి ఆదేశించారు. విదేశీ విద్యకు సుమారు నాలుగు వేల మందికి ప్రభుత్వపరంగా ఆర్థిక సహాయా న్ని అందిస్తున్నామని, అటువంటి వారిని స్కైప్ ద్వారా విద్యార్థులతో ముఖాముఖి మాట్లాడిస్తే, మంచి ఫలితాలు ఉంటాయని అన్నారు. జన్మభూమి కార్యక్రమంలో గ్రామాలు, మండలాలు, జిల్లాల వారీగా మంచి ప్రతిభ కనబరిచిన ప్రజాప్రతినిధులు, సర్పంచ్‌లు, అధికారులను గుర్తించాలని అన్నారు. ఈనెల 18, 19 తేదీల్లో కలెక్టర్ల సమావేశం నిర్వహిస్తున్నామని, 19 సాయంత్రం వారికి బహుమతులు ప్రదానం చేసి, విందు ఇవ్వనున్నట్టు సీఎం చెప్పారు. ఈ వీడియోకాన్ఫరెన్స్‌లో ముఖ్యమంత్రి ప్రత్యేక కార్యదర్శి చంద్రమౌళి, జన్మభూమి కార్యక్రమం జిల్లా ప్రత్యేక అధికారి వైవి అనురాధ, కలెక్టర్ ప్రవీణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

గర్భసంచి కొనుగోలు పేరుతో మోసం!

గర్భసంచి మార్పిడి ముఠా కలకలం

ఆంధ్రభూమి బ్యూరో

విజయనగరం, జనవరి 4: జిల్లా కేంద్రమైన విజయనగరంలో గర్భసంచి మార్పిడి ముఠా కలకలం రేపుతోంది. ఈ ముఠా వల్ల మోసపోయామని బాధితులు గురువారం టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో అసలు విషయం బయటకు పొక్కింది. ఎవరైనా మహిళ గర్భసంచి ఇస్తే వారికి రూ.8 లక్షలు ఇస్తామంటూ దళారీలు నమ్మబలకపడంతో ఆర్థికంగా చితికిపోయిన మహిళలు ఈ ఉచ్చులో చిక్కుకున్నారు. తగరపువలసకు చెందిన జ్యోతి అనే మహిళ దళారీగా వ్యవహరించి పట్టణంలోని బుంగవీధిలో పలువురు మహిళలను ఆకట్టుకుంది. పట్టణంలోని నక్కవీధికి చెందిన పార్వతీ అనే మహిళ ద్వారా పలువురి నుంచి వీరు డబ్బులు వసూలు చేశారు. గర్భసంచి తీసుకునేందుకు ముందుగా రక్తపరీక్షలు, హెచ్‌ఐవి టెస్ట్, ఇతర పరీక్షలు నిర్వహించాలని ఆయా మహిళలకు చెప్పి ఆ మేరకు తనిఖీలు చేయించారు. ఆ తరువాత చేసిన రక్త పరీక్షల్లో జబ్బులు ఉన్నాయని ల్యాబ్ రిపోర్టు వచ్చిందని, ఆ వ్యాధిని నయం చేయడానికి రూ.70 వేలు ఇస్తే మందులు ఇస్తామని చెప్పడంతో కొంతమంది మహిళలు ఆయా మొత్తాలను జ్యోతి, పార్వతీలకు అందజేశారు. జబ్బు నయమైతే తామే ఆ గర్భసంచి కొనుగోలు చేస్తామని పేర్కొనడంతో డబ్బుకు ఆశపడిన ఆ మహిళలు తమ ఇంట్లో ఉన్న మొత్తాన్ని వారికి అప్పగించారు. తీరా గర్భసంచి కొనుగోలు చేస్తామన్న మహిళలు కనబడకపోవడంతో బాధితులు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అప్పటికే జ్యోతి అనే మహిళ పరారైంది. ఆమె కోసం పోలీసులు గాలిస్తున్నట్టు సిఐ బివిజె రాజు తెలిపారు.

ఎమ్మార్ ప్రాపర్టీస్ కేసులో ఎల్‌వి సుబ్రహ్మణ్యంకు ఊరట

★ అభియోగాలను కొట్టివేసిన హైకోర్టు

ఆంధ్రభూమి బ్యూరో

హైదరాబాద్, జనవరి 4: ఎమ్మార్ ప్రోపర్టీస్ కేసులో ఆంధ్రాకు చెందిన సీనియర్ ఐఎఎస్ అధికారి ఎల్‌వి సుబ్రహ్మణ్యంకు అభియోగాల నుంచి విముక్తి కల్పిస్తూ హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. దీంతో ఈ అధికారికి ఈ కేసులో ఊరట లభించినట్లయింది. సిబిఐ ఈ కేసును దర్యాప్తు చేసింది. ఎమ్మార్ ప్రోపర్టీస్ కేసులో సుబ్రహ్మణ్యం సంస్థకు అనుకూలంగా వ్యవహరించారని, భూమిని కేటాయించారని సిబిఐ పేర్కొంది. ఈ కేసును జస్టిస్ బి శివ శంకర రావు విచారించారు. తనపై అభియోగాలను కొట్టివేయాలంటూ ఐఎఎస్ అధికారి సుబ్రహ్మణ్యం దాఖలు చేసిన పిటిషన్‌ను హైకోర్టు విచారించింది. ఈ కేసులో సుబ్రహ్మణ్యం చర్యల వల్ల ఖజానాకు నష్టం వాటిల్లినట్లు ఎటువంటి సాక్ష్యాన్ని సిబిఐ చూపించలేకపోయిందన్నారు. ఈ సందర్భంగా హైకోర్టు 169 పేజీల నివేదికతో కూడిన తీర్పు ఇచ్చింది. కేంద్రం ప్రాసిక్యూషన్‌కు అనుమతి ఇచ్చిన, సరైన విధి విధానాలులేవని కోర్టు పేర్కొంది.

జన్మభూమి సభలో రైతుల ఆత్మహత్యాయత్నం!

డోన్, జనవరి 4: అనుభవంలోని భూమికి పట్టాలివ్వని అధికారుల తీరును నిరసిస్తూ నలుగురు రైతులు జన్మభూమి సభలో పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. అయితే సకాలంలో స్పందించిన పోలీసులు అడ్డుకున్నారు. కర్నూలు జిల్లా డోన్ మండలం గోసానిపల్లెలో గురువారం ఈ సంఘటన జరిగింది. గ్రామంలో గురువారం జన్మభూమి సభ ప్రారంభం కాగానే రైతులు చిన్న రంగస్వామి, మాదయ్య, శ్రీనివాసులు, ఈశ్వరయ్య వెంట తెచ్చుకున్న పురుగుల మందుతాగి ఆత్మహత్యానికి పాల్పడగా పోలీసులు అడ్డుకున్నారు. తమ సాగులో ఉన్న భూమికి పట్టాలు ఇవ్వకుండా అధికారులు తిప్పించుకుంటున్నారని రైతులు ఆరోపించారు. దీంతో కొద్దిసేపు ఉద్రిక్తత చోటుచేసుకుంది.

ఇద్దరు కామాంధులకు జీవితఖైదు

అనంతపురం అర్బన్, జనవరి 4: చిన్నారులపై అత్యాచారం చేసిన కామాంధులకు జీవితఖైదు విధిస్తూ అనంతపురం జిల్లా జడ్జి శశిధర్‌రెడ్డి గురువారం తీర్పు చెప్పారు. మైనర్‌పై అత్యాచారం చేసిన ఆటోడ్రైవర్, కూతురుపై అత్యాచారం చేసిన తండ్రికి శిక్ష విధించారు. వివరాలు ఇలా ఉన్నాయి. ఆర్డీటీ వసతి గృహంలో ఉంటూ జిల్లా పరిషత్ పాఠశాలలో ఆరవ తరగతి చదువుతున్న విద్యార్థినిపై బత్తలపల్లి మండలం రాఘవంపల్లికి చెందిన ఆటో డ్రైవర్ సాకే శ్రీరాములు 2017 మార్చిలో అత్యాచారం జరిపాడు. ఈ కేసులో నేరం రుజువు కావడంతో నిందితునికి యావజ్జీవ కారాగార శిక్షతో పాటు రూ.50వేల జరిమానా విధిస్తూ జిల్లా జడ్జి శశిధర్ రెడ్డి తీర్పు చెప్పారు. అదే విధంగా కంబదూరుకు చెందిన రామాంజినేయులు గత ఆగస్టు 6వ తేదీ ఇంట్లో ఉన్న కూతురుపై అత్యాచారం జరిపాడు.

గ్యాంగ్‌స్టర్ అయూబ్ డిటెన్షన్ ఆర్డర్ కొట్టివేత

ఆంధ్రభూమి బ్యూరో

హైదరాబాద్, జనవరి 4: హైదరాబాద్ సిటీ పోలీసులకు హైకోర్టులో చుక్కెదురైంది. గ్యాంగ్‌స్టర్ ఆయూబ్‌ఖాన్‌ను డిటెన్షన్ చేస్తూ జారీ సిటీ పోలీసులు జారీ చేసిన ఆదేశాలను హైకోర్టు కొట్టివేసింది. తన భర్తను డిటెన్షన్ చేస్తూ సిటీ పోలీసులు జారీ చేసిన డిటెన్షన్ ఆదేశాలను సవాలు చేస్తూ ఆయూబ్ ఖాన్ భార్య హైకోర్టులో దాఖలుచేసిన పిటిషన్‌ను హైకోర్టు ధర్మాసనం విచారించింది. తన భర్తపై 65 కేసులు ఉన్నాయంటూ ముంబాయి ఇంటర్నేషనల్ విమానాశ్రయంలో 2016 డిసెంబర్ 25వ తేదీన అరెస్టు చేశారని ఆమె పిటిషన్‌లో పేర్కొన్నారు. ఈ కేసులో పిటిషనర్ తరపున కె మోహన్ రెడ్డి అనే న్యాయవాది వాదనలు వినిపించారు. ప్రభుత్వ వాదనలను ఏజి డి ప్రకాశ్ రెడ్డి వినిపిటంచారు.

ఏసీబీకి చిక్కిన సర్వేయర్

రైల్వేకోడూరు, జనవరి 4: భూమి సర్వే రిపోర్టు ఇచ్చేందుకు రూ.10 వేలు లంచం తీసుకున్న కడప జిల్లా రైల్వేకోడూరు సర్వేయర్ శ్రీరాములను ఏసీబీ అధికారులు గురువారం అరెస్టు చేశారు. కోడూరుకు చెందిన సుబ్బనరసమ్మ తన మామిడి తోట సర్వే రిపోర్టు కోసం సర్వేయర్ శ్రీరాములను సంప్రదించగా ఆయన రూ. 10 వేలు లంచం డిమాండ్ చేశాడు. దీంతో ఆమె తన బంధువు రమేష్ ద్వారా ఏసీబీ అధికారులకు ఫిర్యాదు చేసింది. వారి సూచన మేరకు రమేష్ గురువారం సర్వేయర్ శ్రీరాములుకు రూ.10 వేలు లంచం ఇస్తుండగా అదుపులోకి తీసుకున్నారు.

ఓర్వలేకనే జగన్ విమర్శలు: మంత్రి దేవినేని

ఆంధ్రభూమి ప్రత్యేక ప్రతినిధి

అమరావతి, జనవరి 4: రాబోయే కాలంలో కడప జిల్లా పులివెందుల నియోజకవర్గంలో జగన్‌కు ఆ నియోజకవర్గం ప్రజలు బుద్ధి చెప్పనున్నారని, పులివెందులలో వచ్చే ఎన్నికలలో తెలుగుదేశం పార్టీ తప్పక గెలుస్తుందని జలవనరుల శాఖ మంత్రి దేవినేని ఉమా మహేశ్వరరావు చెప్పారు. గురువారం స్థానిక జలవనరుల శాఖ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో మంత్రి ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్రంలో జరుగుతున్న ప్రాజెక్టులను అడ్డుకోవడానికి జగన్ అవినీతి పత్రిక, ఛానల్‌లో అడ్డగోలు రాతలు రాస్తూ ప్రాజెక్టుల అభివృద్ధిని అడ్డుకుంటున్నారన్నారు. అయినా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రతిపక్ష నేత ఎన్ని అవాంతరాలు సృష్టిస్తున్నా అవుకు టన్నెల్ పనులను మూడున్నరేళ్లలో పూర్తి చేసి అక్కడ నుంచి నీటిని గండికకోటకు పారించి పులివెందుల వరకు నీరు అందించారన్నారు. అదేవిధంగా గండికోట నుండి చిత్రావతికి నీరు అందిస్తుంటే ప్రభుత్వం చెంబుతో నీళ్లు ఇచ్చిందని చెప్పటం హాస్యాస్పదంగా ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో ఎంతో ప్రతిష్ఠాత్మకంగా రాయలసీమలో ప్రాజెక్టుల ద్వారా నీటిని అందిస్తుంటే ఓర్వలేక జగన్ మాట్లాడుతున్నారన్నారు. చిత్రావతి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌లో 5 టీఎంసీల నీళ్లు కన్పిస్తుంటే అజ్ఞానంగా మాట్లాడటం సిగ్గుచేటన్నారు.

గండికోటపై వైసీపీ అవాస్తవ ప్రచారం

విజయవాడ: తెలుగుదేశం ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న జన్మభూమి కార్యక్రమానికి ప్రజలు బ్రహ్మరథం పడుతుండటాన్ని జీర్ణించుకోలేని వైకాపా నేతలు బురద జల్లుతున్నారని రాష్ట్ర వ్యవసాయమంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి అన్నారు. జన్మభూమి కార్యక్రమాన్ని తెలుగుదేశం ప్రభుత్వం ప్రజల కార్యక్రమంలా నిర్వహిస్తుంటే, దాన్ని వైసీపీ సభలా మార్చేందుకు ఆ పార్టీ నేతలు ప్రయత్నించారని గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కార్యక్రమాన్ని హైజాక్ చేయాలని చూశారని, కడప జిల్లాలో ఎంపీ అవినాష్‌రెడ్డి చర్యలను రాష్ట్ర రైతాంగం తీవ్రంగా నిరసిస్తోందని ధ్వజమెత్తారు. గండికోట సీబీఆర్ లిఫ్ట్ సిస్టమ్, పులివెందుల బ్రాంచ్ కెనాల్, చిత్రావతి (లింగాల కెనాల్).. ఈ మూడు ప్రాజెక్టులకు వైఎస్ పాలనా కాలంలో రూ.1100 కోట్లు ఖర్చుచేయగా.. మూడున్నరేళ్లలో ఈ ఏడాది జనవరి 3నాటికి తెలుగుదేశం ప్రభుత్వం రూ.2053 కోట్లు ఖర్చుచేసిందని తెలిపారు. గండికోట ప్రాజెక్టుకు తెలుగుదేశం ప్రభుత్వం రూ.72 కోట్లు మాత్రమే ఖర్చుచేసిందంటూ వైకాపా నేతలు అవాస్తవాలు ప్రచారం చేస్తున్నారన్నారు. గండికోట ప్రాజెక్టు నిర్వాసిత రైతులకు రూ.472 కోట్ల పరిహారం ఇచ్చింది ఎవరు? తెలుగుదేశం ప్రభుత్వం కాదా? కాంగ్రెస్ ప్రభుత్వాలు రూ.1100 కోట్లు సక్రమంగా ఖర్చుచేస్తే ఏడేళ్ల కిందటే ప్రాజెక్టు నిర్మాణం పూర్తయి రైతుల కష్టాలు తీరేవని అన్నారు. కీలకమైన అవుకు టన్నెల్ నిర్మించలేదని, రైతులకు పరిహారం చెల్లిస్తే కమీషన్ రాదనే దురుద్దేశంతో మట్టి పనులు చేసి డబ్బులు కాజేశారని ఆరోపించారు.

మతాల మధ్య చిచ్చుకు యత్నాలు!

రాజమండ్రి లాలాచెరువు నూరానీ మసీదు మౌజన్ మహ్మద్ ఫరూఖ్ హత్యపై స్పందించి నిందితులను వెంటనే పట్టుకున్నారని ప్రభుత్వ విప్ ఎంఎ షరీఫ్ తెలిపారు. మూడు రోజుల్లో ఈ కేసును ఛేదించి ఈ దుర్ఘటనకు పాల్పడిన నిందితులను వెంటనే పట్టుకున్నందుకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు, రాష్ట్ర డీజీపీ నేతృత్వంలో రాజమండ్రి అర్బన్ ఎస్‌పి రాజకుమారి, పోలీసు అధికారులకు అభినందనలు తెలియజేస్తున్నామన్నారు. అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి వేలిముద్రల ఆధారంగా గుర్తించారన్నారు.

ఎమ్మెల్యేలకు గౌరవమివ్వాల్సిందే!

◆ క్రమశిక్షణ ఉల్లంఘిస్తే సరైన సమయంలో చర్యలు
◆ ఆంధ్రభూమి కథనంపై స్పందన

ఆంధ్రభూమి ప్రత్యేక ప్రతినిధి

అమరావతి, జనవరి 4: పార్టీ శాసనసభ్యులకు ఎవరైనా గౌరవం ఇవ్వాల్సిందేనని ముఖ్యమంత్రి, టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు స్పష్టం చేశారు. ఎంపీలు, మంత్రులు ఎమ్మెల్యేల నియోజకవర్గాల్లో పర్యటించే ముందు వారికి సమాచారం ఇవ్వాల్సిందేనని ఆయన ఆదేశించారు. ఈ సందర్భంగా గురువారం తన నివాసంలో పార్టీ నేతలతో పశ్చిమ గోదావరి సహా, వివిధ జిల్లాల్లో పార్టీలో జరుగుతున్న పరిణామాలపై చర్చించారు. పార్టీలో అంతర్గతంగా జరుగుతున్న వివాదాలపై గురువారం నాటి ఆంధ్రభూమిలో వచ్చిన కథనంపై చంద్రబాబు స్పందించారు. ప్రధానంగా తన నియోజకవర్గంలో తనకు చెప్పకుండా ఎంపీ మాగంటి బాబు కార్యక్రమాలు నిర్వహిస్తుండటం, తనకు వ్యతిరేకంగా వర్గాన్ని ప్రోత్సహిస్తున్న వైనంపై మాజీ మంత్రి పీతల సుజాత నాయకత్వానికి ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. ఆ పరిణామాలపై చంద్రబాబు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. నియోజకవర్గాల్లో పర్యటించే ముందు ఎంపీలు, మంత్రులు ఆయా ఎమ్మెల్యేలకు ముందుగా సమాచారం ఇవ్వాలన్న విషయాన్ని మరోసారి అందరికీ అర్థమయ్యేలా చెప్పాలని పార్టీ నాయకులను ఆదేశించారు. ఈ వ్యవహారంలో ఎంపీ మాగంటి బాబుతో మాట్లాడాలని ఆదేశించారు. పీతల సుజాతతో కూడా మాట్లాడి సర్దిచెప్పాలని సూచించినట్లు సమాచారం. పార్టీ నేతలు, ప్రజాప్రతినిధులు క్రమశిక్షణ ఉల్లంఘిస్తే సహించేది లేదని, తన సహనానికీ హద్దు ఉంటుందని, పార్టీని ధిక్కరిస్తూ రోడ్డెక్కే వారిపై సరైన సమయంలో చర్యలు ఉంటాయని, అప్పుడు ఎవరూ కాపాడలేరన్న విషయాన్ని వారికి స్పష్టం చేయాలని నేతలను ఆదేశించారు.

దుర్గగుడి పాలకవర్గంపై బాబు ఆగ్రహం

ఆంధ్రభూమి ప్రత్యేక ప్రతినిధి

అమరావతి, జనవరి 4: దుర్గగుడి వ్యవహారంపై ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దృష్టి సారించారు. గత మూడురోజుల నుంచి ఆలయంలో జరుగుతున్న వివాదాస్పద అంశాలపై పార్టీ నేతల వద్ద ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆలయ పాలక వర్గ తీరుపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేసినట్లు సమాచారం. ఆలయంలో జరుగుతున్న వివాదాలు, ఈఓ పనితీరు, సమన్వయం తదితర అంశాలపై తనకు ముందుగానే ఎందుకు చెప్పలేదని ఆయన ప్రశ్నించారు. పాలకవర్గం క్రియాశీలకంగా పనిచేయాలని, అదే సమయంలో అధికారులతో సమన్వయం చేసుకుని వెళ్లాలని సూచించారు. ఇకనైనా అంతా కలసిపనిచేసుకోవాలని, వివాదం వచ్చిన తర్వాత స్పందించే బదులు, దానికంటే ముందుగానే మేల్కొని ఏదైనా ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని ఆదేశించారు. అంతకంటే ముందు విజయవాడ పార్టీ నగర అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బుద్దా వెంకన్నను తన నివాసానికి పిలిపించుకుని దుర్గగుడి వ్యవహారంపై చర్చించారు. పాలకమండలి సభ్యులతో మాట్లాడి ఏం జరిగిందో తెలుసుకుని తనకు నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. ఆ తర్వాత బుద్దా వెంకన్న కేశినేని భవన్‌లో పాలకమండలి సభ్యులతో భేటీ అయి, ఈఓ పనితీరు, ఆలయంలో జరుగుతున్న వ్యవహారాలను అడిగి తెలుసుకున్నారు. ఆ సందర్భంగా ఈఓ తమకు కనీస గౌరవం ఇవ్వడం లేదని, సొంత నిర్ణయాలు తీసుకోకపోవడంతో తమకు విలువ లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేసినట్లు సమాచారం.

1వ పేజీ తరువాయి

కుప్పం నుంచే విజయ యాత్ర

అభివృద్ధి చేస్తానని అన్నారు. కంభంవారిపల్లె మండలం బలిజపల్లె చేరుకున్న జగన్‌కు వైఎస్సార్‌సీపీ నాయకులు,కార్యకర్తలు పూల వర్షం కురిపించారు. గ్రామస్థులు జగన్‌ను కలిసి, వైకాపా ప్రభుత్వం రాగానే ఆధార్ కార్డు కల్గిన రైతుల కు లక్షరూపాయల వరకు రుణమాఫీ చేయాలని కోరారు.

ఇందుకు జగన్ సమాధానం ఇస్తూ, చంద్రబాబులా మాయమాటలు చెప్పి అధికారంలోకి వస్తే ఆయనకు, తనకు తేడా ఉండదన్నారు. కురవపల్లెలో ఓ వృద్ధురాలితో ఆయన మాట్లాడుతూ, తన ప్రభుత్వం అధికారంలోకి రాగానే 'ఈ మనవడు నెలకు 2వేలు పింఛన్ ఇస్తాడమ్మా..' అని అన్నారు. ఉన్నత చదువులకు ప్రత్యేక ప్యాకేజీని అమలుచేస్తామని, వెలుగు మహిళల రుణాలను దశలవారీగా మాఫీ చేస్తామన్నారు. సాయంత్రం 4గంటలకు జగన్ తన పాదయాత్రను కంభంవారిపల్లె కురవపల్లె వద్ద నిలిపివేసి అక్కడే బసచేశారు.

అధికారాలకు కత్తెర!

డెప్యుటేషన్‌కు కేంద్రం సుముఖత వ్యక్తం చేయడంతో త్వరలోనే ఆమె బాధ్యతలు స్వీకరించవచ్చని భావిస్తున్నారు. కొత్త ఈవో వచ్చేంత వరకూ ప్రస్తుత ఈవో సూర్యకుమారి ఎటువంటి కీలక నిర్ణయాలు తీసుకోకుండా ఆదేశాలు జారీ చేశారు. వివాదంలో చిక్కుకున్న ఆలయ ప్రధాన అర్చకుడు బద్రీనాథ్ దీర్ఘకాలిక సెలవుపై వెళ్లారు. తాంత్రిక పూజ ల ఉదంతం వెలుగు చూసిన వెంటనే ఆయనను కొండ కింద ఉన్న ఉపాలయాలకు బదిలీ చేశారు. ఏన్నో ఏళ్లుగా పని చేస్తున్న తనను అకారణంగా అనుమానిస్తున్నారంటూ ఆవేదన వ్యక్తం చేస్తూ ఆయన సెలవుపై వెళ్లారు. దుర్గగుడి వ్యవహారానికి తెరదించేందుకు ఎమ్మెల్సీ బుద్దా వెంకన్నను సీఎం తన ఇంటికి గురువారం పిలిపించుకుని మాట్లాడారు.

తాంత్రిక పూజలు జరిగాయా? లేదా? అన్న అంశంపై ఆరా తీయాలని ఆదేశించారు. దుర్గగుడి వ్యవహారాలను ప్రక్షాళన చేసేందుకు సీఎం నిర్ణయించి ఈ మేరకు ఆదేశించారు. సీఎం ఆదేశాల మేరకు ఎమ్మెల్సీ బుద్దా పాలకమండలి సభ్యులతో ఎంపీ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈవో ఏకపక్ష నిర్ణయాలు తీసుకుంటున్నారని పాలకమండలి సభ్యులు చెప్పారని, ఇకపై వివాదాలకు స్వస్తిపలకాలని తాను చెప్పినట్లు ఎమ్మెల్సీ తెలిపారు. తాంత్రిక పూజలు జరిగాయని విచారణలో తేలితే బాధ్యులపై చర్యలు తీసుకుంటారని స్పష్టం చేశారు. వైకాపా కావాలని ఈ అంశాన్ని రాజకీయం చేస్తోందని బుద్దా ఆరోపించారు.

వయసు నిర్ధారణ తప్పనిసరి

ఆధార్‌నూ పరిగణనలోకి తీసుకుంటారు ◆ మహిళా భక్తులపై శబరిమల ఆలయ బోర్డు వెల్లడి

తిరువనంతపురం, జనవరి 4: కేరళలోని ప్రసిద్ధి శబరిమల అయ్యప్ప స్వామి ఆలయాన్ని సందర్శించాలనుకునే మహిళలు వయసుకు సంబంధించి కచ్చితమై ధృవీకరణ అందజేయాల్సి ఉంటుంది. పదేళ్ల లోపుబాలికలు, 50 ఏళ్ల పైబడ్డ మహిళలకు ఆలయ ప్రవేశం నిషిద్ధం. ఈ నేపథ్యంలో అయ్యప్ప ఆలయాన్ని దర్శించుకోవాలనుకునే మహిళా భక్తులు వారి వయసు ధృవీకరించే ఆధారాలు చూపాల్సి ఉంటుందని ద ట్రావెన్‌కోర్ దేవస్వాం బోర్డు(టీడీబీ) స్పష్టం చేసింది. పడిపూజల సీజన్ కాబట్టి భక్తుల రద్దీ విపరీతంగా ఉంటుందని బోర్డు పేర్కొంది. ఇప్పటికే దేశం నలుమూల వేలాది మంది భక్తులు అయ్యప్పమాలలు ధరించారు. మూడు నెలల దీక్ష జనవరి 14తో ముగియనుంది. మకర సంక్రాంతి రోజుతో దీక్షలు ముగుస్తాయి. రుతుస్రావంలో ఉన్న మహిళలు ఆలయాన్ని సందర్శించుకోడానికి వీల్లేదు. అయ్యప్పస్వామి ఆలయంలో పూజాది కార్యక్రమాలు అత్యంత నిష్ఠగా పాటిస్తారు. పైగా అయ్యప్పస్వామి కఠోర బ్రహ్మచారి. అందుకే ఎక్కడా ఎలాంటి ఆలయ పవిత్రతకు భంగం కలగకూడదనే ఉద్దేశంతోనే భక్తురాండ్ర వయస్సుకు సంబంధించి కచ్చితంగా వ్యవహరించాలని నిర్ణయించినట్టు టీబీడీ అధ్యక్షుడు ఏ పద్మకుమార్ వెల్లడించారు. కొంత మొదల్లోనే తనిఖీలు నిర్వహిస్తారన్న ఆయన అప్పుడే మహిళలను వయసు నిర్ధారణకు సంబంధించి ధృవీకరణ పత్రాలు చూపాలని స్పష్టం చేశారు. వయసు నిర్ధారణకు ఆధార్ కార్డును కూడా పరిగణనలోకి తీసుకుంటామని ఆయన చెప్పారు. పదేళ్లలోపు, 50ఏళ్లపైబడిన భక్తురాండ్రు ఇటీవల ఆలయంలోకి ప్రవేశించడానికి ప్రయత్నించినందున ఈ జాగ్రత్తలు తీసుకున్నట్టు కుమార్ తెలిపారు. దేవస్థానం అధికారులు, పోలీసులతో వాగ్వాదానికి దిగకుండా కచ్చితమైన ధృవీకరణతో రావాలని మహిళలకు ఆయన విజ్ఞప్తి చేశారు. బోర్డు తీసుకున్న ఈ నిర్ణయాన్ని ఆయన సమర్థించుకున్నారు. ఇటీవల తమిళనాడుకు చెందిన ఓ బాలిక తండ్రి, బంధువులతోకలిసి శబరిమల ఆలయంలోకి ప్రవేశించడానికి ప్రయత్నించిందని ఆయన పేర్కొన్నారు. తనిఖీ అధికారులకు అనుమానం వచ్చి నిలదీస్తే బాలిక తండ్రి అధికారులతో గొడవకు దిగాడని, అయితే భద్రతాధికారులు మాత్రం నిబంధనలకు లోబడే ఆమెను లోపలికి అనుమతించలేదని బోర్డు చైర్మన్ తెలిపారు. చివరికి గుర్తింపు కార్డును చూపించారని, దాన్లో ఆమె వయసు 11 ఏళ్లుగా ఉందని పద్మకుమార్ చెప్పారు. ఆలయ ఆచార, వ్యవహారాల విషయంలో రాజీపడేది లేదని బోర్డు చీఫ్ స్పష్టం చేశారు. కొండ కిందే పంబా వద్ద మహిళా పోలీసులు, మహిళా సిబ్బంది సంయుక్తంగా తనిఖీలు నిర్వహిస్తారని ఆయన వెల్లడించారు. ఇప్పటికే పంబా వద్ద ఈ సీజన్‌లో 10-50 వయస్కులైన 260 మంది మహిళలను ఆపేసినట్టు ఆయన తెలిపారు. ఇలా ఉండగా పదేళ్ల లోపు, 50 ఏళ్ల పైబడ్డ మహిళల ఆలయ ప్రవేశంపై విధించిన నిషేధాన్ని సవాల్ చేస్తూ సుప్రీం కోర్టులో ఓ పిటిషన్ దాఖలైంది. పిటిషన్ ప్రస్తుతం రాజ్యాంగ ధర్మాసనం వద్ద పెండింగ్‌లో ఉంది.

బ్యాంకు ఉద్యోగిని పెళ్లి చేసుకోవద్దు

ముస్లిం సంస్థ ఫత్వా

లక్నో, జనవరి 4: బ్యాంక్ ఉద్యోగులను పెళ్లి చేసుకోవద్దంటూ దారూల్ ఉలూమ్ డియోబాండ్ అనే ముస్లిం సంస్థ ఫత్వా జారీ చేసింది. బ్యాంక్ ఉద్యోగులు అక్రమ పద్ధతుల ద్వారా డబ్బు సంపాదిస్తారని, అందువల్ల వారితో వివాహానానికి దూరంగా ఉండాలని ముస్లిం కుటుంబాలకు విజ్ఞప్తి చేసింది. 'అక్రమ పద్ధతుల ద్వారా సమకూర్చుకున్న డబ్బు హాని చేస్తుంది. వారికి నైతిక విలువలూ ఉండవ్'అని ఫత్వాలో పేర్కొంది. బ్యాంకు ఉద్యోగం కలిగి ఉన్న ముస్లిం కుటుంబాల వధువు/వరుడును కోరుకోవద్దని విజ్ఞప్తి చేసింది. తనకు బ్యాంకు సంబంధం వచ్చింది.. చేసుకోవచ్చాఅంటూ ఓ వ్యక్తి దారుల్ ఉలూమ్ సంస్థను కోరారు. దీన్ని పరిశీలించిన సంస్థ ఫత్వా విభాగం వద్దని చెప్పింది. 'ఆ కుటుంబం అక్రమ పద్ధతుల ద్వారానే సంపాదించారు.

దానికి నైతికత లేదు. కాబట్టి అలాంటి కుటుంబాలను ఎంపిక చేసుకోవద్దు. గౌరవ ప్రదమైన కుటుంబంతో సంబంధాలు చూసుకోండి' అంటూ ఇస్లామిక్ సంస్థ స్పష్టం చేసింది. అలాగే వ్యాపారాల్లో పెట్టుబడులు పెట్టడం కూడా ఇస్లాంకు వ్యతిరేకమని సంస్థ తేల్చింది. అలాంటి లావాదేవీలపై నిషేధం విధిస్తూ ఫత్వా జారీ చేసింది.

సిరియాలో రష్యా వైమానిక దాడులు

23 మంది పౌరులు మృతి

బీరట్, జనవరి 4: సిరియాలో రెబెల్స్‌కు పట్టున్న ఘౌటా తూర్పు ప్రాం తంలో రష్యా జరిపిన వైమానిక దాడుల్లో 23 మంది పౌరులు మరణించారు. బ్రిటన్‌కు చెందిన సిరియాలో పౌర హక్కుల పర్యవేక్షకులు మాత్రం 18 మంది మృతి చెందినట్లు వెల్లడించారు. వారిలో 11 మంది మహిళలతోపాటు ముగ్గురు పిల్లలు కూడా ఉన్నారని పర్యవేక్షక సంఘం అధిపతి రమి అబ్దుల్ రహ్మాన్ తెలిపారు.

2011 నుంచి సిరియాలో జరుగుతున్న అంతర్యుద్ధంలో ఇప్పటివరకు దాదాపు 3,40,000 మరణించగా, వేలాదిగా ఇళ్లు నేలమట్టమయ్యాయి. ఘౌటా తూర్పు ప్రాంతం డమాస్కస్ సమీపంలో ఉన్నప్పటికీ అక్కడ జైష్- అల్-ఇస్లామ్ గ్రూపునకు చెందిన తీవ్రవాదులు ఎక్కువగా ఉన్నట్లు తెలుస్తోంది. 2015 నుంచి రష్యా సేనలు సిరియా అధ్యక్షుడు బషర్ అల్ అసద్‌కు మద్దతుగా రెబెల్స్‌పై దాడులు కొనసాగిస్తోంది.


రష్యా వైమానిక దాడుల్లో తీవ్రంగా గాయపడిన ఓ చిన్నారి

బాలికపై సామూహిక అత్యాచారం

▪ సామాజిక మాధ్యమాల్లోకి వీడియో అప్‌లోడ్
▪ పెద్దపల్లి జిల్లాలో దారుణం

సుల్తానాబాద్, జనవరి 4: ఓ బాలికపై ఇరువురు యువకులు అత్యాచారానికి పాల్పడిన ఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. రేప్ దృశ్యాల వీడియోను సామాజిక మాధ్యమాల్లో అప్ లోడ్ చేయడంతో అది వైరల్‌గా మారింది. పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ మండల కేంద్రంలోని మార్కండేయకాలనీకి చెందిన ఓ బాలిక (16)పై కదంబాపూర్ గ్రామానికి చెందిన బండి శ్రీనివాస్ (25), పెద్ది నగేష్ (24) నెల రోజుల క్రితం అత్యాచారం పాల్పడ్డారు. ఆ దృశ్యాలను సెల్‌ఫోన్‌లో చిత్రీకరించి నెట్‌లో అప్‌లోడ్ చేశారు. అది వైరల్‌గా మారడం, ఈ విషయంపై పెద్ద మనుషుల వద్ద పంచాయితీ జరిగినట్లు ప్రచారం జరుగుతోంది. బాధితురాలు బుధవారం రాత్రి పోలీ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు పెద్దపల్లి ఏసీపీ హబీబ్‌ఖాన్ విచారణ చేపట్టారు. ఘటనపై సమగ్ర విచారణ జరిపి నిందితులను త్వరలోనే అదుపులోకి తీసుకుంటామని ఏసీపీ తెలిపారు. బాలిక ఫిర్యాదు మేరకు ఇద్దరు యువకులపై గ్యాంగ్‌రేప్, ఫోక్సో, నిర్భయ, ఎస్సీ, ఎస్టీతో పాటు పలు సెక్షన్లతో కూడిన కేసు నమోదు చేశామని, ఈ సంఘటన నెల రోజుల క్రితం జరిగినట్టు సుల్తానాబాద్ సీఐ అడ్లూరి రాములు గురువారం తెలిపారు.

క్రీడ



కేప్ టౌన్‌లో టెస్టు సిరీస్ ట్రోఫీని ఆవిష్కరిస్తున్న భారత్, దక్షిణాఫ్రికా కెప్టెన్లు విరాట్ కోహ్లీ, ఫఫ్ డు ప్లెసిస్

కోహ్లీ ప్రతిభకు సిసలైన పరీక్ష!

కేప్ టౌన్, జనవరి 4: జట్టులోని మిగతా ఆటగాళ్లకు ఎలావున్నా, టీమిండియా కెప్టెన్ విరాట్ కోహ్లీకి మాత్రం దక్షిణాఫ్రికా టూర్ పరీక్షగా నిలవనుంది. తిరుగులేని ఆధిపత్యాన్ని కనబరుస్తూ, భారత అత్యుత్తమ కెప్టెన్లలో ఒకడిగా ఎదిగిన కోహ్లీ ప్రతిభాపాటవాలు విదేశాల్లో ఏ విధంగా కొనసాగుతాయన్నది ప్రశ్న. కెప్టెన్ ఒక్కడే ఏమీ చేయలేడని, జట్టు బలం మీదే అతని విజయాలు, వైఫల్యాలు ఆధారపడి ఉంటాయని గతంలో మాజీ ఓపెనర్ వీరేందర్ సెవాగ్ చేసిన వ్యాఖ్యలను ఈ సందర్భంగా గుర్తు చేసుకోవాలి. భారత జట్టు 2011లో వరల్డ్ కప్ సాధించినప్పుడు, అది అప్పటి కెప్టెన్ మహేంద్ర సింగ్ ధోనీ ప్రతిభగా అందరూ కీర్తిస్తుంటే, సెవాగ్ అందుకు భిన్నంగా స్పందించాడు. జట్టు మొత్తం సమష్టిగా పోరాడకపోతే, కెప్టె ఒక్కడే ఏమీ చేయలేడని స్పష్టం చేశాడు. వరుస సిరీస్‌లను కైవసం చేసుకోవడం టీమిండియాలోని ఆటగాళ్లందరి సమష్టి కృషి ఫలితమా లేక కోహ్లీ నాయకత్వ పటిమకు నిదర్శనమా అన్నది తేలాలంటే, దక్షిణాఫ్రికా టూర్ పూర్తి కావాలని కొంత మంది చేస్తున్న వాదనలో బలం లేకపోలేదు. అయితే, కోహ్లీ స్వయంగా రాణిస్తూ, అద్వితీయ ప్రతిభాపాటవాలు కనబరుస్తున్నాడు కాబట్టి, భారత్ తిరుగులేని ఆధిపత్యం వెనుక అతనిదే కీలక పాత్రగా చాలా మంది పేర్కొంటున్నారు. ఒకవైపు బ్యాట్స్‌మన్‌గా, మరోవైపు కెప్టెన్‌గా అతను దూసుకుపోతున్నాడు. ఇటీవల స్వదేశంలో శ్రీలంకతో జరిగిన టెస్టు సిరీస్‌లో అత్యుత్తమ ఆటను ప్రదర్శించిన కోహ్లీ అదే దూకుడును కొనసాగిస్తాడా లేదా అన్న ఆందోళన అభిమానుల్లో స్పష్టంగా కనిపిస్తున్నది.

శ్రీలంకతో న్యూఢిల్లీలోని ఫిరోజ్ షా కోట్లా మైదానంలో జరిగిన చివరి, మూడో టెస్టులో డబుల్ సెంచరీ చేసి కోహ్లీ రికార్డు పుస్తకాల్లో చోటు సంపాదించాడు. టెస్టుల్లో కెప్టెన్‌గా అత్యధిక డబుల్ సెంచరీలు సాధించిన ఆటగాళ్ల జాబితాలో బ్రియాన్ లారా రికార్డును అతను అధిగమించాడు. నాగపూర్ టెస్టులో డబుల్ సెంచరీ చేసినప్పుడు, కెప్టెన్‌గా ఐదు డబుల్ సెంచరీలతో లారా రికార్డును సమం చేసిన కోహ్లీ, ఢిల్లీలో ఆ రికార్డును బద్దలు చేశాడు. కాగా, కెప్టెన్‌గా సేవలు అందిస్తున్నప్పుడు నాలుగేసి పర్యాయాలు డబుల్ సెంచరీలు చేసిన డొనాల్డ్ బ్రాడ్‌మన్, మైఖేల్ క్లార్క్, గ్రేమ్ స్మిత్ ఇప్పుడు సంయుక్తంగా మూడో స్థానంలో నిలిచారు. ఇలావుంటే, టెస్టుల్లో అత్యధిక డబుల్ సెంచరీలు చేసిన భారత బ్యాట్‌మెన్ జాబితాలో సచిన్ తెండూల్కర్, వీరేందర్ సెవాగ్ సరసన కోహ్లీకి చోటు దక్కింది. వీరంతా తలా ఆరు డబుల్ సెంచరీలు సాధించారు. ప్రపంచ టెస్టు క్రికెట్‌లో ఎక్కువ డబుల్ సెంచరీలు చేసిన బ్యాట్స్‌మెన్‌లో సచిన్, సెవాగ్‌తో పాటు మర్వన్ అటపట్టు (శ్రీలంక), జావేద్ మియందాద్ (పాకిస్తాన్), యూనిస్ ఖాన్ (పాకిస్తాన్), రికీ పాంటింగ్ (ఆస్ట్రేలియా)తో కలిసి కోహ్లీ సంయుక్తంగా ఐదో స్థానంలో కొనసాగుతున్నాడు. వీరంతా ఆరేసి డబుల్ సెంచరీలు చేశారు. ఈ జాబితాలో సర్ డొనాల్డ్ బ్రాడ్‌మన్ (ఆస్ట్రేలియా) అగ్రస్థానాన్ని ఆక్రమించాడు. అతని ఖాతాలో 12 టెస్టు డబుల్ సెంచరీలు ఉన్నాయి. కుమార సంగక్కర (శ్రీలంక) 11, బ్రియాన్ లారా (వెస్టిండీస్) 9 డబుల్ సెంచరీలతో వరుసగా రెండు, మూడు స్థానాల్లో ఉన్నారు. వారీ హమ్మండ్ (ఇంగ్లాండ్), మహేల జయవర్ధనే (శ్రీలంక) చెరి ఏడు డబుల్ సెంచరీలతో నాలుగో స్థానాన్ని పంచుకుంటున్నారు. మొత్తం మీద టెస్టు క్రికెట్‌లో కోహ్లీ తనకంటూ ఒక ప్రత్యేక అధ్యాయాన్ని లిఖించుకున్నాడు. వినోద్ కాంబ్లీ తర్వాత, రెండు వరుస టెస్టుల్లో డబుల్ సెంచరీలు చేసిన రెండో భారతీయుడిగా కూడా అతని పేరు రికార్డు పుస్తకాల్లోకి ఎక్కింది. ప్రపంచ టెస్టు క్రికెట్‌లో కోహ్లీ కంటే ముందు ఈ ఫీట్‌ను కేవలం ముగ్గురు ఆటగాళ్లు మాత్రమే సాధించారు. డొనాల్డ్ బ్రాడ్‌మన్ (ఆస్ట్రేలియా/ ఇంగ్లాండ్‌పై) మూడు పర్యాయాలు వరుస టెస్టుల్లో డబుల్ సెంచరీలు చేసి, ఎవరికీ అందనంత ఎత్తున ఉన్నాడు. వాలీ హమ్మండ్ (ఇంగ్లాండ్/ న్యూజిలాండ్‌పై), వినోద్ కాంబ్లీ (భారత్/ ఇంగ్లాండ్‌పై), గ్రేమ్ స్మిత్ (దక్షిణాఫ్రికా/ ఇంగ్లాండ్‌పై)తో కలిసి కోహ్లీ (భారత్/ శ్రీలంకపై) సంయుక్తంగా రికార్డును పంచుకుంటున్నాడు.

లంకతో టెస్టు సిరీస్ ముగిసిన తర్వాత, వనే్డ, టీ-20 ఇంటర్నేషనల్స్ సిరీస్‌ల నుంచి కోహ్లీ విశ్రాంతి తీసుకున్న విషయం తెలిసింది. ఆ సమయంలోనే అతను బాలీవుడ్ నటి అనుష్క శర్మను వివాహం చేసుకున్నాడు. పెళ్లి, హనీమూన్, న్యూఢిల్లీ, ముంబయి నగరాల్లో భారీ విందుల తర్వాత తిరిగి జాతీయ జట్టుకు సేవలు అందించేందుకు అతను దక్షిణాఫ్రికా చేరుకున్నాడు. శ్రీలంకపై పూర్తి ఆధిపత్యాన్ని కనబరచిన అతని నుంచి సహజంగానే అభిమానులు భారీ అంచనాలతో ఉన్నారు. దక్షిణాఫ్రికాలో వాతావరణం, పిచ్‌ల తీరు పూర్తిగా భిన్నంగా ఉంటాయి కాబట్టి, పరుగుల వరద పారించడం లేదా సెంచరీల మీద సెంచరీలు కొట్టడం అతనికి అనుకున్నంత సులభం కాదు. కానీ, అభిమానులు మాత్రం కోహ్లీ నుంచి అదే స్థాయి ఆటను కోరుతున్న నేపథ్యంలో, అతనిపై ఒత్తిడి తీవ్రమవుతుందనేది వాస్తవం. ఈ ఒత్తిడిని ఎంత వరకూ అధిగమిస్తాడో, ఏ స్థాయిలో రాణిస్తాడో చూడాలి. మొత్తం మీద దక్షిణాఫ్రికా టూర్ కోహ్లీ ప్రతిభకు గీటురాయిగా విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. అదీ నిజమే..

దక్షిణాఫ్రికాలో భారత్ ఇప్పటి వరకూ ఆరు సిరీస్‌లు ఆడింది. వాటిలో ఐదింటిని చేజార్చుకుంది. అత్యంత ఉత్తమ ప్రదర్శనగా 2010-11 టూర్ నమోదైంది. మూడు మ్యాచ్‌ల ఆ సిరీస్‌ను భారత్ 1-1గా డ్రా చేసుకుంది. మరో రకంగా చెప్పాలంటే, దక్షిణాఫ్రికాలో భారత జట్టు మొత్తం 17 టెస్టులు ఆడింది. రెండు విజయాలు సాధించింది. ఎనిమిది పరాజయాలను ఎదుర్కొంది. ఏడు టెస్టులను డ్రా చేసుకుంది.

ప్రాక్టీస్‌కు డుమ్మా

కేప్ టౌన్, జనవరి 4: దక్షిణాఫ్రికాతో కష్టతరంగా భావిస్తున్న టెస్టు సిరీస్‌లో భాగంగా మొదటి మ్యాచ్ శుక్రవారం నుంచి ప్రారంభం కానుండగా, టీమిండియా క్రికెటర్లు గురువారం నాటి అత్యంత కీలకమైన ప్రాక్టీస్ సెషన్‌కు డుమ్మా కొట్టారు. ఈ టెస్టుకు ముందు ఒక వామప్ మ్యాచ్ ఆడాల్సి ఉండగా, దానిని రద్దు చేయించుకున్న భారత జట్టు ఇప్పుడు ప్రాక్టీస్ సెషన్‌ను కూడా వినియోగించుకోలేదు. నేరుగా టెస్టులోనే బరిలోకి దిగుతామని జట్టు మేనేజ్‌మెంట్ ప్రకటించింది. క్రికెటర్లు ఎవరూ రాకపోయినా, చీఫ్ కోచ్ రవి శాస్త్రి, అసిస్టెంట్ కోచ్ సంజయ్ బంగార్, జాతీయ సెలక్షన్ కమిటీ చైర్మన్ ఎమ్మెస్కే ప్రసాద్ తదితరులు కేప్ టౌన్ పిచ్‌ని నిశితంగా పరిశీలించారు. కొంత సేపు అక్కడ నిలబడి, వికెట్ తీరుపై చర్చించుకున్నారు.

ప్రెస్ మీట్‌కు హాజరుకాని భారత కెప్టెన్

భారత జట్టు కెప్టెన్ విరాట్ కోహ్లీ శుక్రవారం అధికారికంగా నిర్వహించే ప్రెస్ మీట్‌కు హాజరుకాలేదు. పాత్రికేయులకు దూరంగా ఉండాలని అతను నిర్ణయించుకున్నాడు. దీనితో విలేఖరుల సమావేశంలో అసిస్టెంట్ కోచ్ సంజయ్ బంగార్ పాల్గొన్నాడు. మాజీ కెప్టెన్ మహేంద్ర సింగ్ ధోనీ మ్యాచ్‌కి ముందు జరిగే ప్రెస్ మీట్స్‌కు ఎప్పుడు గైర్హాజరుకాలేదు. ప్రత్యేకించి విదేశాలకు వెళ్లినప్పుడు, తప్పనిసరిగా తానే విలేఖరులకు సమాధానాలిచ్చేవాడు. కానీ, కోహ్లీ అందుకు భిన్నంగా ప్రెస్ మీట్‌కు దూరంగా ఉండగా, అతని బదులు హాజరైన బంగార్ మాట్లాడుతూ దక్షిణాఫ్రికాతో సిరీస్‌కు అన్ని విధాలా సిద్ధంగా ఉన్నామని చెప్పాడు. ప్రత్యర్థి బలాబలాల గురించి ఎక్కువగా ఆలోచించడం లేదని స్పష్టం చేశాడు. సిరీస్ ఏదైనా, ప్రత్యర్థులు ఎవరైనా, అంతర్జాతీయ స్థాయి క్రికెట్‌లో ప్రతి మ్యాచ్ ఉత్కంఠ భరితంగానే సాగుతుందని వ్యాఖ్యానించాడు. ఏ జట్టునూ ఎక్కువగా ఊహించడంగానీ, తక్కువ అంచనా వేయడంగానీ తప్పని స్పష్టం చేశాడు.

కేట్ టౌన్‌లో భారత్‌కు విజయావకాశాలు ఎక్కువగా ఉన్నాయని ఆల్ రౌండర్ రవీంద్ర జడేజా అన్నాడు. ఇక్కడి వికెట్ టెస్టులకు అన్ని విధాలా అనుకూలిస్తుందని అతను జోస్యం చెప్పాడు. రెండు, మూడు టెస్టులు జరిగే సెంచూరియన్, జొహానె్నస్‌బర్గ్‌తో పోలిస్తే కేప్ టౌన్ పిచ్ భిన్నంగా ఉంటుంది. ఆ రెండు వికెట్లు ఫాస్ట్ బౌలింగ్‌కు అనుకూలిస్తాయి. టేప్ టౌన్‌లో అటు పేసర్లు, ఇటు స్పిన్నర్లు కూడా మెరుగైన ఫలితాలను రాబట్టుకోగలుగుతారని జడేజా అన్నాడు. ఇలాంటి పిచ్‌పై ఆడడం టీమిండియాకు కొత్త కాదని, అందుకే, తొలి టెస్టులో విజయావకాశాలు తమకే ఉన్నాయని పేర్కొన్నాడు. ఇలావుంటే, ఎంత మంది స్పిన్నర్లతో మ్యాచ్ ఆడతారన్నది ఇంకా స్పష్టం కాలేదు. బహుశా ఒకే స్పిన్నర్‌ను ప్లేయింగ్ ఎలెవెన్‌లోకి తీసుకోవచ్చు.



ఆండీ ముర్రే

ఆస్ట్రేలియా ఓపెన్‌కు ముర్రే దూరం

మెల్బోర్న్, జనవరి 4: బ్రిటిష్ టెన్నిస్ స్టార్, ప్రపంచ మాజీ నంబర్ వన్ ఆండీ ముర్రే ఆస్ట్రేలియా ఓపెన్ గ్రాండ్ శ్లామ్ నుంచి వైదొలిగాడు. కాలి కండరాల నొప్పి కారణంగా అతను సుమారు ఎనిమిది నెలలుగా ఏటీపీ టోర్నీలకు దూరమయ్యాడు. ఇప్పుడు కోలుకున్నానని, ఆస్ట్రేలియా ఓపెన్‌కు సిద్ధంగా ఉన్నానని రెండు రోజుల క్రితం ఇక్కడికి చేరుకున్న ముర్రే ప్రకటించాడు. అయితే, ప్రాక్టీస్ సెషన్‌లోనే కాలి కండరాల నొప్పి తిరగబెట్టింది. ప్రస్తుతం మ్యాచ్‌లు ఆడే పరిస్థితిలో లేనని, అందుకే ఆస్ట్రేలియా ఓపెన్‌లో ఆడడం లేదని ముర్రే ప్రకటించాడు. ఫిట్నెస్ సమస్య నుంచి పూర్తిగా బయటపడలేదన్న విషయం ఇక్కడికి వచ్చిన తర్వాతే స్పష్టమైందని అతను ఒక ప్రకటనలో తెలిపాడు.

నిషికొరికి గాయం!

జపాన్ ఆటగాడు కెయ్ నిషికొరి కూడా గాయంతో బాధపడుతున్నాడు. అతను ఈసారి ఆస్ట్రేలియా ఓపెన్‌లో ఆడే అవకాశం దాదాపుగా లేదని తెలుస్తున్నది. మోచేతి గాయం బాధిస్తున్నదని, తుది పరీక్షల అనంతరం ఈ టోర్నీలో ఆడే విషయంపై ఒక నిర్ణయం తీసుకుంటానని నిషికొరి ఒక ప్రకటనలో తెలిపాడు. అయితే, మరో పది రోజుల్లో టోర్నమెంట్ ప్రారంభం కానున్న నేపథ్యంలో అతను పూర్తి ఫిట్నెస్‌ను సంపాదించుకోవడం అసాధ్యంగానే కనిపిస్తున్నది.



షెన్‌జెన్ ఓపెన్ సెమీస్‌కు షరపోవా

షెన్‌జెన్, జనవరి 4: ప్రపంచ మాజీ నంబర్ వన్, రష్యా టెన్నిస్ బ్యూటీ మరియా షరపోవా ఇక్కడ జరుగుతున్న షెన్‌జెన్ ఓపెన్ టోర్నమెంట్‌లో సెమీస్ చేరింది. క్వార్టర్ ఫైనల్‌లో ఆమె జరినా దియాస్ (ఖజకస్థాన్)ను 6-3, 6-3 తేడాతో ఓడించింది. 30 ఏళ్ల షరపోవా చాలా కాలం తర్వాత తన పూర్వవైభవాన్ని గుర్తుకు తెచ్చే రీతిలో ఆడుతున్నది.



కెరీర్‌లో వరుసగా 150వ టెస్టు మ్యాచ్ ఆడుతున్న ఇంగ్లాండ్ మాజీ కెప్టెన్ అలస్టర్ కుక్. విరామం లేకుండా ఎక్కువ వరుస టెస్టులు ఆడిన బ్యాట్స్‌మెన్ జాబితాలో అలాన్ బార్డర్ (153) తర్వాత అతను రెండో స్థానాన్ని ఆక్రమించాడు. ఇంగ్లాండ్ తరఫున అత్యధిక టెస్టులు ఆడింది కూడా అతనే.

ఇంగ్లాండ్ 5 వికెట్లకు 233

ఆస్ట్రేలియాతో చివరి, ఐదో టెస్టు

సిడ్నీ, జనవరి 4: ఆస్ట్రేలియాతో గురువారం ప్రారంభమైన చివరి, ఐదో టెస్టు మ్యాచ్ మొదటి రోజు ఆట ముగిసే సమయానికి ఇంగ్లాండ్ ఐదు వికెట్ల నష్టానికి 233 పరుగులు చేసింది. మొదటి మూడు మ్యాచ్‌ల్లో పరాజయాలను ఎదుర్కొని, సిరీస్‌ను 0-3 తేడాతో కోల్పోయిన ఇంగ్లాండ్ నాలుగో టెస్టును డ్రాగా ముగించిన విషయం తెలిసిందే. చివరి టెస్టును సాధించి, కొంతైనా ఊరట పొందాలనుకుంటున్న ఈ జట్టు టాస్ గెలిచి, బ్యాటింగ్ ఎంచుకుంది. అయితే, మొదటి రోజు ఆటలో కెప్టెన్ జో రూట్ (83), దావీద్ మలాన్ (55 నాటౌట్) అర్ధ శతకాలు, జొష్ హాజెల్‌వుడ్, పాట్ కమిన్స్ చెరి రెండు వికెట్లు కూల్చడాన్ని మినహాయించి ఎలాంటి ఆసక్తికరమైన అంశాలు చోటు చేసుకోలేదు. జట్టు స్కోరు 28 పరుగుల వద్ద మార్క్ స్టోన్‌మన్ (24) రూపంలో ఇంగ్లాండ్ తొలి వికెట్ కోల్పోయింది. పాట్ కమిన్స్ బౌలింగ్‌లో అతను వికెట్‌కీపర్ టిమ్ పైన్‌కు చిక్కాడు. జేమ్స్ విన్స్ 54 బంతుల్లో 25 పరుగు చేసి, పాట్ కమిన్స్ బౌలింగ్‌లోనే టిమ్ పైన్‌కే క్యాచ్ ఇచిచ వెనుదిరిగాడు. క్రీజ్‌లో నిలదొక్కుకోవడానికి కష్టపడిన మాజీ కెప్టెన్, ఓపెనర్ అలస్టర్ కుక్ 104 బంతులు ఎదుర్కొని, 39 పరుగులు చేశాడు. అతనికి ఇది వరుసగా 150 టెస్టు మ్యాచ్ కావడం విశేషం. మధ్యలో ఎక్కడా విరామం లేకుండా ఎక్కువ టెస్టులు ఆడిన బ్యాట్స్‌మెన్ జాబితాలో అతను చోటు సంపాదించిన అతను జొష్ హాజెల్‌వుడ్ బౌలింగ్‌లో ఎల్బీగా ఔట్‌కాగా, జట్టుకు అండగా నిలిచిన జో రూట్ 141 బంతుల్లో 83 పరుగులు చేసి మిచెల్ స్టార్క్ బౌలింగ్‌లో మిచెల్ మార్ష్ క్యాచ్ అందుకోవడంతో పెవిలియన్ చేరాడు. వికెట్‌కీపర్-బ్యాట్స్‌మన్ జానీ బెయిర్‌స్టో కేవలం ఐదు పరుగులు చేసి, టిమ్ పైన్‌కు క్యాచ్ ఇచ్చి, జొష్ హాజెల్‌వుడ్ బౌలింగ్‌లో ఔటయ్యాడు. ఈ వికెట్ కూలిన వెంటనే మొదటి రోజు ఆటను ముగిస్తున్నట్టు అంపైర్లు ప్రకటించారు. అప్పటికి ఇంగ్లాండ్ 81.4 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 233 పరుగులు చేసింది. దావీద్ మలాన్ 55 పరుగులతో నాటౌట్‌గా ఉన్నాడు.

సంక్షిప్త స్కోర్లు

ఇంగ్లాండ్ తొలి ఇన్నింగ్స్: 81.4 ఓవర్లలో 5 వికెట్లకు 233 (అలస్టర్ కుక్ 39, జేమ్స్ విన్స్ 25, జో రూట్ 83, దావీద్ మలాన్ 55 నాటౌట్, జొష్ హాజెల్‌వుడ్ 2/47, పాట్ కమిన్స్ 2/44).


శ్రీజేష్‌కు ప్రొబేషన్!

న్యూఢిల్లీ, జనవరి 4: భారత హాకీ గోల్‌కీపర్ శ్రీజేష్‌ను ఏడాది పాటు ప్రొబేషన్‌లో ఉంచాలని హాకీ ఇండియా (హెచ్‌ఐ) నిర్ణయించింది. అంతేగాక, అతనిపై 15 రోజుల సస్పెన్షన్ వేటు వేసింది. మోకాలి గాయం కారణంగా శ్రీజేష్ సుమారు ఎనిమిది నెలలుగా వైద్య చికిత్స పొందుతున్నాడు. ఇప్పుడు హాకీ శిక్షణా శిబిరంలో ప్రాక్టీస్ చేస్తున్న అతను గత ఏడాది ముందస్తు అనుమతి తీసుకోకుండా ముంబయిలో జరిగిన ఒక సెలబ్రిటీ ఫుట్‌బాల్ చారిటీ మ్యాచ్‌లో పాల్గొన్నాడు. దీనిని తీవ్రంగా పరిగణించిన హెచ్‌ఐ అధికారులు విచారణకు ఆదేశించారు. నివేదిక అందిన తర్వాత, శ్రీజేష్‌ను ఏడాది పాటు ప్రొబేషన్‌లో ఉంచుతున్నట్టు ప్రకటించారు. మరోసారి అలాంటి పొరపాటే పునరావృతమైతే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

Printed and Published from Vijayawada by **K.Sudhakar** on behalf of Deccan Chronicle Holdings Limited at Deccan Chronicle Holdings Press, No.C 3 & 4, Patamata, Industrial Estate, Vijayawada. Chief Editor **T.V.Ravi Reddy**, Phones:2555284,2555185,2555287 Regd. No.AP/VJA/41/51/2000. RNI Registration No.52743/90

భూమిక
bhoomika@andhrabhoomi.net
ఆంధ్రభూమి
శుక్రవారం 5, జనవరి 2018

ఇతరుల కోసం ఒక్క క్షణం..



అది లాల్ బహదూర్ శాస్త్రి దేశ ప్రధానిగా పాలిస్తున్న రోజులు. భోపాల్‌లో ఆయన ఓ కార్యక్రమంలో పాల్గొనటానికి వెళ్లారు. ఓ ఉర్దూకవి ఆయనను చూసి మీ వేషం (ధోవతి, కుర్తా) ప్రస్తుత ప్రధాన మంత్రి హోదాకు తగ్గట్లుగా లేదు. ప్రతిరోజూ ఎంతోమంది విదేశీయులను మీరు కలుసుకోవాలి. దానికి తగ్గట్టుగా లేదు అని అన్నారు. దానికి ఆ నిరాడంబర ప్రధాని ఇలా అన్నారు. "చేసే పనులను బట్టి ఓ వ్యక్తి శీలాన్ని నిర్ణయించాలి. కానీ అతని వేషధారణను బట్టి కాదు. ఒక దేశం గురించి చెప్పేటప్పుడు ఆ దేశ ప్రజల గుణగణాలను చూడాలి కాని జనాభా సంఖ్య ముఖ్యం కాదు". మరి ఈ దృష్టితో చూస్తే లాల్ బహదూర్ శాస్త్రి ఎంత గొప్పవారు. 18 నెలల పాటు ప్రధానిగా చేసినా, కేంద్ర మంత్రిగా పనిచేసినా ఆయన అస్తుపాస్తులేవీ సంపాదించలేదు. పాపం అలహాబాద్‌లో ఒక ఇల్లు కొనుక్కోవాలని అనుకున్నారు గాని రేటు ఎక్కువ ఉండటంతో వదిలేశారు. ప్రధాని పదవిలో ఉండికూడా నిజాయతీకి నిలువుటద్దంగా నిలిచిన లాల్ బహదూర్ శాస్త్రి నిరాడంబరతత్వాన్ని, నిజాయతీని పొగడకుండా ఉండగలమా!

గోరుముద్ద




"ఇతరుల కోసం జీవించేవారే నిజంగా జీవిస్తున్నట్లు" అని స్వామి వివేకానంద చెప్పారు. కాని మనం పక్కవారి కోసమే ఆలోచించం. మనమూ, మన సౌకర్యాల గురించే నిరంతరం తపించిపోతుంటాం. పిల్లల్ని సైతం అలాగే పెంచుతున్నాం. ఇటీవల ఓ టాలీవుడ్ సినిమా హీరో ఇంటర్వ్యూ టీవీలో వచ్చింది. ఆయన చనిపోయాడనుకోండి. ఆయన జ్ఞాపకార్థం ఆ ఇంటర్వ్యూను మళ్లీ ప్రసారం చేశారు. తాను వాన కురిసే రేకుల షెడ్‌లో పెరిగినా.. తన పిల్లలను మాత్రం బెంజ్ కారులో పంపించాను అని చెప్పారు. కాని ఆ హీరో పేదల కోసం ఎన్నో సేవాకార్యక్రమాలు చేశారు. ఆలాంటి సేవా దృక్పథం మరి పిల్లలకు జీవితాంతం ఉంటుందా అని అంటే కాలమే చెప్పాల్సి ఉంటుంది. పిల్లలకు ఎక్కడ కష్టం అవుతుందోనని లక్షలు ఖర్చుపెట్టి ఎయిర్ కండీషన్డ్ స్కూళ్లలో చదివించే తల్లిదండ్రులు వారిని చిన్నతనం నుంచే సుఖాలకు, విలాసాలకు అలవాటు చేస్తున్నారు. సాధారణంగా జీవించటం, ఉన్నతంగా ఆలోచించడం అనే విషయాన్ని ఏనాడో మరిచిపోయాం. టీవీ, మొబైల్ ఫోన్లు, కంప్యూటర్లతో కాలక్షేపం చేయిస్తున్నాం. చిన్నప్పటి నుంచి ఇలాంటి సుఖాలకు, విలాసాలకు అలవాటు పడినవారు ఇతరుల కష్టాలను ఎలా అర్థం చేసుకుంటారు. ఇతరుల కోసం చేస చిన్న పని అయినా మన అంతరంగంలో నిక్షిప్తమై ఉన్న సింహసదృశ్యమైన శక్తిని మేల్కొల్పుతుంది. ఇలాంటి శక్తి పుస్తక విజ్ఞానం వల్ల, సాంకేతిక పరిజ్ఞానం వల్ల కూడా రాదనే విషయం గ్రహించలేకపోతున్నాం. అందుకే స్వామి వివేకానంద మనం నిజంగా జీవించటల్లేదని ఆనాడే ఆయన నొక్కి వక్కాణించారు. ఇతరుల కోసం చిన్నపాటి సాయం చేసినా వారి మనసులో శాంతి నెలకొంటుంది. చిన్నప్పటి నుంచే పిల్లల్లో సేవా భావాన్ని అలవాటు చేస్తే జీవితంలో విజేతలుగా నిలుస్తారనటంలో ఎలాంటి సందేహం లేదు. జీవితంలో కష్టాలనే ఊహించలేని పిల్లలను తయారుచేస్తున్నాం. అందుకే పిల్లలు అపజయాలకు కుంగిపోతూ వివిధ మానసిక వ్యాధులకు, అశాంతికి గురవుతున్నారు.



ఓసారి ఓ యువకుడు స్వామి వివేకానంద వద్దకు వచ్చి మనశ్శాంతి కోసం ఇంటి తలుపులు, కిటికీలు మూసేసి ధ్యానం చేస్తున్నాను. కాని మనసుకు శాంతి కలుగటం లేదు అని అన్నాడు. దానికి స్వామిజీ సమాధానం ఇస్తూ..ఇపుడు నువ్వు చేస్తున్న పనికి వ్యతిరేకంగా చేయాలి అని అన్నారు. ఇంటి తలుపులు, కిటికీలు తెరిచి చూడు బయట ఎంతోమంది కష్టాలు పడుతున్నారు. సాయం కోసం ఎదురుచూసే వారు కనిపిస్తారు. వారి కోసం పనిచేయి. నీకు మనశ్శాంతి కలుగుతుంది అని అన్నారు. అమాయకమైన పిల్లల్లో తెలియని స్వార్థం ఉంటుంది. అలాంటి స్వార్థాన్ని ఉగ్గుపాలతో తొలగించాల్సిన తల్లిదండ్రులు నిస్వార్థాన్ని నేర్పకపోగా.. నేను, నా తల్లిదండ్రులు అనే సంకుచిత మనస్తత్వంతో ఆలోచించేలా చేస్తున్నాం. అందువల్లే నేడు పిల్లలు పెద్దయిన తరువాత ఎన్నో దురాగతాలకు పాల్పడుతున్నారు. తోటివారిని మాటలతోగానీ చేతలతో హింసిస్తున్నారు. మనం చిన్నప్పుడే తోటివారిని హింసించవద్దని చెబితే నేడు జరిగే ఎన్నో అకృత్యాలను అరికట్టగలం. కాబట్టి స్వామి వివేకానంద చెప్పినట్లు అంతా మనవారే అని నేర్పితే పిల్లల జీవితం శాంతిమయమే.

-హరి చందన

పిచ్చివాడిలో భగవంతుడ్ని చూశాడు..



అది 2002 సంవత్సరం. డిసెంబర్ 31వ తేదీ రాత్రి. నూతన సంవత్సర వేడుకలను యువతీ యువకులు హోటళ్లలోనూ, పబ్‌లలో ఆనందోత్సాహాల మధ్య జరుపుకుంటున్నారు. బెంగళూరులోని తాజ్ హోటల్‌లో పనిచేసే నారాయణా కృష్ణన్ హోటల్‌లో వండాల్సిన వంటలన్నీ వండేసి తన ఇంటికి బయలుదేరాడు. నారాయణా కృష్ణన్ వండిన వంటకం రుచి అమోఘం అని ప్రసిద్ధి. అతని వంటల రుచి చూసిన స్విట్జార్లాండ్‌లోని ఓ హోటల్ వారు అతనికి లక్షల్లో జీతం ఇస్తాం రమ్మన్నారు. మరో వారం రోజుల్లో దేశం విడిచి వెళ్లిపోతున్నాడు. ఎప్పటిలాగానే డిసెంబర్ 31వ తేదీ రాత్రి ఇంటికి బయలుదేరాడు. అతను రోడ్డుదాటుతుంటే ఓ దృశ్యం కనిపించింది. ఒక్కసారిగా అతనిలో ఏడుపు కట్టలు తెంచుకు వచ్చింది. ఓ పిచ్చివాడు. ఆకలికి తాళలేక తన మలాన్ని తానే తింటూ కనిపించాడు. ఆ చెఫ్‌కు దుంఖః ఆగలేదు. వెంటనే హోటల్ లోనికి పరుగెత్తుకుంటూ వెళ్లి వేడి వేడి ఇడ్లీలు ఐదింటిని తీసుకువచ్చి ఆ పిచ్చివాడి ఎదుట పెట్టాడు. వాటిని చూడగానే ఆ పిచ్చివాడు మలాన్ని వదలేసి ఆబగా ఇడ్లీలు తిన్నాడు. అతను తాగటానికి మంచినీళ్లు ఇచ్చాడు. మంచినీళ్లు తాగిన తరువాత ఆ పిచ్చివాడు నవ్విన నవ్వు ఎలా ఉందంటే.. సాక్షాత్తు తిరుపతి వెంకటేశ్వర స్వామి నవ్వు వలే ఉన్నదని అనుకున్నాడు.

ఈ సంఘటన అతని జీవితాన్నే మార్చేసింది. పదంకెల జీతాన్ని వద్దనుకున్నాడు. చెఫ్ ఉద్యోగాన్ని సైతం వదిలేశాడు. బట్టలు సర్దుకుని తన సొంత ఊరు అయిన మధురైకి వెళ్లిపోయాడు. తండ్రితో తాను ఏమి చేయదలుచుకున్నాడో చెప్పాడు. ఆ తండ్రి సైతం అడ్డుచెప్పలేదు. కొడుకు చేయబోతున్న పనికి పొంగిపోయాడు. ఆ రోజు నుంచి ఆ తండ్రీ కొడుకులిద్దరూ ప్రతిరోజూ వేడి వేడి ఆహార పదార్థాలు వండి వీధులు వెంట తీసుకువెళ్లి ఎక్కడ పిచ్చివాళ్లు కనిపిస్తే వారికి పెట్టడం ప్రారంభించారు. ఇది ఏదో ఒక్క పూట కాదు. రోజుకు మూడుసార్లు వండి వేడివేడిగా ఐదువందల మంది పిచ్చివాళ్లకు పెడుతున్నారు. కేవలం పిచ్చివాళ్లనే ఎందుకు ఎన్నుకున్నావు అని అడిగితే.. మామూలు భిక్షగాళ్లను పట్టించుకునే వారు చాలామంది ఉన్నారు. కాని ఇలాంటి పిచ్చివాళ్లను ఎవరు పట్టించుకుంటారు. వారిని దగ్గరకు తీయాలంటేనే భయపడతారు. అందుకే వీరిలోనే ఆ భగవంతుడ్ని చూస్తూ.. సేవ చేస్తున్నాను అని బదులిస్తాడు నారాయణ కృష్ణన్. ఈ యువకుడికి 2010లో అమెరికాలో 200 మంది ప్రముఖులు పాల్గొన్న సభలో "రియల్ హీరో ఆఫ్ ది వరల్డ్" అవార్డు బహుకరిస్తున్నపుడు ఆ వేదికపై ఈ యువకుడు ఇలా అంటాడు. "నేను ఇలా సేవ చేస్తున్నాను అంటే నా తండ్రి అందించిన ప్రోత్సాహమే, చేయూతే కారణం" అని బదులిచ్చాడు. మరి ఆలోచించండి.



బెడ్ షీట్స్ వల్ల ఆస్తమా!

బెడ్ షీట్స్ ఎప్పటికప్పుడు మార్చుకుంటే ఎలర్జీ సమస్యలకు దూరంగా ఉంటాం. రోజుల తరబడి ఉంచటం వల్ల ఆస్తమాకు మీరు దగ్గరవుతారని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. బెడ్ మీద కూర్చొని చాలామంది తినటం, తాగటం చేస్తుంటారు. దీంతో దుమ్మూ ధూళి, మరికొన్ని రకాల బాక్టీరియా, చర్మకణాలు బెడ్ షీట్స్‌ను ఎల్లప్పుడూ అంటి పెట్టుకుని ఉంటాయి. ఉదయం నిద్ర లేచిన వెంటనే బెడ్‌షీట్స్‌ను ఇంట్లో కాకుండా ఆరుబయట ఎండలో దులిపి మళ్లీ వేసేకుంటే మంచిది. దీనివల్ల బాక్టీరియా దరిచేరదు. చాలాకాలం పాటు అసలు బెడ్‌షీట్స్‌ను మార్చక పోవటం వల్ల వీటికి అంటుకున్న దుమ్మూ ధూళి పురుగులు, చర్మకణాలు ముక్కులోని శ్లేష్మ పొర ద్వారా లోనికి వెళ్లి ఆస్తమాకు దారితీస్తుంది. అంతేకాదు తామరా లాంటి అంటువ్యాధులు కూడా అంటుకుంటున్నాయి. కాబట్టి వారానికి రెండుసార్లు బెడ్‌షీట్స్ మార్చితే కుటుంబ సభ్యుల ఆరోగ్యాన్ని కాపాడగలుగుతాం. బెడ్‌షీట్స్‌లో పేరుకుపోయిన దుమ్మూ ధూళే బాక్టీరియాకు కమ్మటి భోజనం. రాత్రివేళల్లో వీటిపని సజావుగా నిర్వర్తిస్తుంటాయి. నిద్రలేచిన వెంటనే కనీసం బెడ్‌షీట్స్‌ను చక్కగా ఆరుబయట దులిపి వేసుకోవాలి. దీనివల్ల ఇలాంటి చెడు బాక్టీరియా మళ్లీ ఇంట్లోకి ప్రవేశించదు. అలాగే పిల్లో కవర్స్‌ను కూడా రెండువారాలకు ఒకసారి మార్చితే మంచిది. ఎందుకంటే చుండ్రు తదితర వాటిని నివారించుకోవటమే కాకుండా జుట్టు శుభ్రంగా ఉంటుంది. నాణ్యమైన బెడ్‌షీట్స్ వేసుకుంటే మరీ మంచిది. పరుపులో ఉండే దుమ్మూ ధూళి, బాక్టీరియా మన శరీరానికి అంటుకోకుండా అడ్డుకుంటుంది. ఇలా వారానిక రెండుసార్లు బెడ్‌షీట్స్, పిల్లో కవర్లు శుభ్రంగా ఉతికి ఎండలో ఆరబెట్టి వేసుకోవాలి. అలర్జీ, చర్మ సంబంధ వ్యాధులు, ఆస్తమా తదితర వాటి నుంచి మనల్ని మనం కాపాడుకోగలం.

చారలు.. చమక్!



కొత్త ఏడాది సరికొత్త ఫ్యాషన్ ట్రెండ్స్‌ను మోసుకొచ్చింది. ముఖ్యంగా చలికాలంలో చారల ప్రింట్స్ చమక్కుమంటూ మెరుపులు కురిపిస్తున్నాయి. చారల అందాలు ప్రముఖం కానున్నాయని ఫ్యాషన్ డిజైనర్లు సైతం అంగీకరిస్తున్నారు. చారల డిజైన్ టాప్స్, స్కర్ట్‌ల పైనా అందంగా కనిపిస్తాయి. ప్రయాణాలలోనూ, పార్టీలలోనూ ఎంతో సౌకర్యవంతంగా కనిపిస్తాయి. బాలీవుడ్ సినీతారల వార్డ్‌రోబ్‌లో నాటికల్ చారల డిజైన్ల దుస్తులతో నిండిపోయి ఉంటాయి. దీపికాపడుకునే, కంగనరానౌత్, ప్రియాంక చోప్రా, కరీష్మాకపూర్ తదితరులు టాప్స్‌ను చారల డిజైన్లలోనే ఇష్టపడుతున్నారు. సినీతారలు అనుసరిస్తున్నారు కదా అని మనం కూడా అనుసరిస్తే తప్పులేదుకానీ మన బాడీ లాంగ్వేజీకి తగ్గట్లు ఎంపిక చేసుకోవటం ఉత్తమం అని అంటున్నారు బెంగళూరుకు చెందిన బ్లాగర్ అంచల్. ఈమె తన బ్లాగులో నాటికల్ ప్రింట్స్ దుస్తులు ధరించిన చిత్రాలనే ఎక్కువగా పోస్ట్ చేస్తుంటారు. నలుగురిలో ప్రత్యేక గుర్తింపును నాటికల్ ప్రింట్ దుస్తులు కలిగిస్తాయంటారు ఆమె. అమ్మాయిలు మెడపైన చారల ప్రింట్ ఉన్న కండువాను కప్పుకున్నా వైవిధ్యంగా కనిపిస్తారని రేష్మా అనే ఫ్యాషన్ డిజైనర్ చెబుతున్నారు. తెల్లటి దుస్తులపై నలుపు, ఎరుపు, ఉదా రంగుల్లో ఉండే చారలు వింత అందాన్నిస్తాయి. జీన్స్ మీద చారల టీ షర్ట్ వేసుకుంటే ప్రత్యేకంగా కనిపిస్తారు. పాత మోడల్ అనుకోకుండా ఉంటే ఆడంబరంగానూ కనిపిస్తారు. ఎత్తు, బరువు ఎక్కువగా ఉండేవారు నిలువు చారలు ఎంచుకుంటే మంచిదంటున్నారు ఫ్యాషన్ డిజైనర్లు. బ్రైట్ కలర్స్, వినూత్నమైన డిజైన్లు, అతి సున్నితమైన వర్క్‌తో ఉమెన్స్ వేర్ మార్కెట్లోకి వచ్చాయి. పసుపు, కూరగాయల ఆకు





పచ్చ, ఎరుపు వంటి రంగులను ఎంపిక చేసుకుంటే మంచిది. ఈ తరం అమ్మాయిలు ఇంకాస్త ముందడుగు వేసి ఆధునిక శైలికి అనుగుణంగా చారలతో అనేక ప్రయోగాలూ చేస్తున్నారు. కాస్త ఆధునికంగా కనిపించాలంటే పొడవాటి చారలు మరింత అందాన్ని తెచ్చిపెడుతున్నాయి. వీటిని ఇష్టపడేటపుడు పెద్దగా నగలతో అవసరం ఉండదు. సింపుల్ వియర్‌రింగ్స్‌తో సూపర్‌లుక్స్ సొంతం చేసుకోవచ్చు. అన్ని సందర్భాలకు టీ షర్ట్స్ సెట్ కావు. లోగోలు లేకుండా ఉన్నవి కొనుక్కోవడం మంచిది. వీటికి సెట్ అయ్యే షూస్ లేకపోతే మొత్తం లుక్ దెబ్బతింటుంది. కార్పొరేట్ కల్చర్‌కు సరిపడేలా ఈ డిజైన్లు ఉంటాయి. పండుగ సందర్భంగా ఇచ్చే విందుల్లో ఈ డ్రెస్సె వేసుకుంటే ఆ వేడుకలో మెరిసిపోవటం ఖాయం. ఎప్పుడూ ఒకేలాంటి టీ షర్ట్స్ వేసుకోవాలన్నా బోర్ కొడుతుంది. కాబట్టి కాస్త వైవిధ్యంగా కనిపించే చారల పైటాప్స్ వేసుకోండి.

ముత్యాల ముగ్గు




బి.దేవి, ఉండ్రాజవరం, పశ్చిమగోదావరి జిల్లా.



19 చుక్కలు
5 వరుసలు
5 వచ్చే వరకు



చాగంటి. రాధారెడ్డి, కుంచనపల్లి, గుంటూరు జిల్లా.



15 చుక్కలు
5 వరుసలు
5 వచ్చే వరకు
సరిచుక్క

ముగ్గులు పంపాల్సిన చిరునామా

ఎడిటర్, ఆంధ్రభూమి దినపత్రిక, 36, సరోజినీదేవి రోడ్, సికిందరాబాద్-500003.
★కలర్ స్కానింగ్ చేసిన ముగ్గులను JPG ఫార్మాట్‌లో bhoomika@andhrabhoomi.net కు మెయిల్‌లో కూడా పంపొచ్చు.

వ్యూహం



11 **అలపర్తి రామకృష్ణ**

సంపాదించినదంతా ఊళ్ళో పేదవాళ్ళకు ఉదారంగా ఇస్తూ వుండేవాడు.

"మీవాడికి శత్రువులు ఎవరన్నా ఉన్నారా?"

"మొదట్లో హాస్పిటల్ గూర్చిచాలా గొప్పగా చెప్పేవాడు.. సీనియర్ డాక్టర్లు డాక్టరుగా చేయగూడని పనులు చేస్తున్నారు. అమాయకుల కిడ్నీలు, ఇతర అవయవాలు అమ్ముకుంటున్నారు. వాళ్ళ భరతం పట్టాలి! పోలీసులకు చెప్పాలి అంటూ వుండేవాడు ఈమధ్య.. ఆ గొడవలు నీకెందుకు? అక్కడ ఉద్యోగం మానేసి మన ఊళ్ళోనే సొంతంగా హాస్పిటల్ పెట్టుకోరాదా? అని అడిగేవాడిని..

"పోలీసులకు చెప్పినా, అక్కడ ఉద్యోగం మానేసినా నన్ను బ్రతకనివ్వరు అని సమాధానమిచ్చాడు.. తమాషాకు అంటున్నాడేమోననుకున్నాను గానీ ఇంత ఉపద్రవం ముంచుకు వస్తుందని కల్లో కూడా అనుకోలేదు" భుజంమీది ఉత్తరీయంతో కళ్ళు తుడుచుకుంటూ అన్నాడు సాయన్న.

"చనిపోయే ముందు మీ అబ్బాయి మీ ఇంట్లో రెండ్రోజులుగా ఉన్నాడు గదా! అప్పుడేదన్నా సంఘటన జరిగిందా? ఎవరన్నా వచ్చి మీ అబ్బాయితో మాట్లాడేరా?"

గుర్తుకు తెచ్చుకునే ప్రయత్నం చేశాడు పెద్దాయన.

"మా బంధువు గవర్నమెంటు హాస్పిటల్లో పని చేస్తున్నాడు.. వాడు వచ్చి మా అబ్బాయితో చాలా సేపు మాట్లాడేడు.. అతనొచ్చి మాట్లాడేకే హాస్పిటల్ వాళ్ళని తిట్టిపోశాడు.. పొరపాటున ఆ హాస్పిటల్లో చేరానని మదన పడ్డాడు."

"ఆ డాక్టరు అడ్రస్ చెబుతారా?"

ఏదో బలమైన క్లూ దొరికినట్లుగా అన్పించింది స్కందకు.

సాయన్న గవర్నమెంటు డాక్టరు అడ్రెస్ చెబితే జేబులో వున్న చిన్న నోట్‌బుక్‌లో రాసుకున్నాడు.

⁂

నల్గొండలో వున్న రమేష్ ఇంటికి వెళ్ళాడు.

సివిల్ అసిస్టెంట్ సర్జన్‌గా గవర్నమెంటు హాస్పిటల్లో పనిచేస్తున్నాడు రమేష్.


"నా పేరు స్కంద.. పోలీస్ ఆఫీసర్ని.. కొన్ని వివరాలు కావాలి.." తనను తాను పరిచయం చేసుకుని ఐడెంటికీ కార్డు చూపిస్తూ అన్నాడు.

రెండు నిమిషాలపాటు తొట్రుపాటు పడ్డాడు రమేష్, పోలీస్ ఆఫీసర్ తనింటికి వచ్చేసరికి. ఏం విషయంమీద అతను వచ్చి వుంటాడని ఆలోచనలో పడ్డాడు.

స్కందను ఇంట్లోకి తీసుకువెళ్లి తన రూములో కూర్చోబెట్టాడు.. భార్యను టీ పెట్టమని పురమాయించి, స్కంద ఎదురుగా కూర్చున్నాడు.

"మీరు డెడికేటెడ్ డాక్టరని సిన్సియర్‌గా మీ డ్యూటీ చేస్తారని, ఊళ్ళో మీకు మంచి పేరు వుందని విన్నాను" అన్నాడు స్కంద.

కొంచెం స్థిమిత పడ్డాడు పోలీస్ ఆఫీసర్ తనను



పొగిడేసరికి.

"మొన్నీమధ్య మీరు డాక్టర్ మౌర్యగారింటికి వెళ్ళేరట. అక్కడ మౌర్యగారితో ఏవో హాస్పిటల్‌కు సంబంధించిన విషయాలు మాట్లాడేరట.. మీరు ఏదీ దాచుకోకుండా జరిగింది జరిగినట్లు చెబితే మా ఇన్వెస్టిగేషన్‌కు సహకరించినవారవుతారు.. మీ లాంటిమంచి వ్యక్తులు మౌనంగా వుండకుండా మాకు సహకరిస్తే గుడ్ సమారిటన్ హాస్పిటల్ వాళ్ళు చేసే అకృత్యాలను ఆపగల్గుతాం! మీకు నేను ప్రొటెక్షన్ ఇస్తాను. ఎవరికి భయపడాల్సిన అవసరం లేదు" అన్నాడు స్కంద రమేష్ భుజాన్ని తడుతూ.

రమేష్ భార్య టీ కప్పులు తెచ్చి ఇద్దరికీ ఇచ్చింది.

ఇంటి బయట పోలీసు జీపు ఆగి వుండటంతో ఆమె కంగారు పడుతూ అక్కడే నిలబడింది.

"నువ్వెళ్ళు! ఏదో ఇన్‌ఫర్మేషన్ కోసం వచ్చారు.. ఆదుర్దా పడాల్సిన పనేం లేదు".

ఆమె వెళ్లిపోయాక తను చేసిన పోస్ట్‌మార్టమ్ కేసు గురించి వివరంగా చెప్పడం మొదలుపెట్టాడు.

"గవర్నమెంటు హాస్పిటల్లో నా రెగ్యులర్ డ్యూటీస్ రోగులకు పరీక్షచేసి మందులు ఇవ్వడం, అవసరమైన కేసుల్లో ఆపరేషన్స్ చెయ్యడం.. అప్పుడప్పుడు పోలీసులు రిఫర్ చేసిన శవాలకు పోస్టుమార్టమ్ చేస్తూ వుంటాము. మాకు హెల్పర్స్ వుంటారు. వాళ్ళే శవాన్ని కోసి చూపిస్తూ వుంటారు. మేము పరీక్షచేసి ఏ కారణాల మూలంగా రోగి చనిపోయాడో వివరాలు పోస్టుమార్టమ్ రిపోర్టులో పొందుపరుస్తాం. మాకు ఫోరెన్సిక్ మెడిసిన్‌తో కూడా టచ్ వుంటుంది.

.. ఎల్లయ్య అనే రోగికి కడుపునొప్పి తరచుగా వస్తూ వుంది. డాక్టర్ మౌర్య పనిచేసే హాస్పిట్లో చేరాడు. ఇన్‌పేషెంట్‌గా అడ్మిట్ చేసుకున్నారు. అతను వ్యవసాయ కూలి.. హాస్పిటల్లో చేరిన రెండు రోజులకే కడుపునొప్పి తగ్గిపోయింది. నన్ను డిశ్చార్జి చెయ్యండి సార్.. కూలి పనులకు వెళ్లాలని మొత్తుకున్నాడతను. అతన్ని పరీక్షచేస్తున్న డాక్టరు మాత్రం "నీకు చాలా ప్రమాదకరమైన జబ్బు వుంది. మా దగ్గర నెల రోజులపాటు వుండాలి.. నవ్వేం కంగారుపడాల్సిన అవసరం లేదు. హాస్పిటల్లో అయ్యే ఖర్చు మేమే భరిస్తాం.. నువ్వు పైసా కూడా మాకు చెల్లించాల్సిన పనిలేదు" అన్నారు అతనికి ట్రీట్‌మెంటు ఇస్తున్న డాక్టర్లు. రోజూ మంచి ఆహారం, పళ్ళు, పాలు ఇచ్చేవాళ్ళు.. రోగితోపాటు వచ్చిన అతని భార్యక్కూడా భోజన వసతి సదుపాయాలు ఏర్పాటుచేశారు.

నెల రోజుల తరువాత "మీ ఆయనకు అర్జెంటుగా ఆపరేషన్ చెయ్యాలి! కాగితంమీద సంతకం పెట్టు" అని అతని భార్యతో సంతకం పెట్టించుకున్నారు. అతన్ని ఆపరేషన్ థియేటర్‌కు తీసుకువెళ్లారు. థియేటర్ నుంచి బయటకు వచ్చేటప్పుడు శవమై వచ్చాడు..

రాయిలా వుండే మనిషి చనిపోవడమేమిటానని అనుమానం ఆ వూరి సర్పంచ్‌కు వచ్చి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోస్టుమార్టమ్ కోసం ఎల్లయ్య శవం మా దగ్గరకు వచ్చింది.

.. పోస్ట్‌మార్టమ్ చేస్తుంటే నాకు ఆశ్చర్యం కల్గించే విషయం బయటపడింది. అతని పొట్టలో ఎటువంటి అల్సర్స్ లేవు.. ఏదో అజీర్తి చేసి కడుపు నొప్పి వచ్చి వుంటుంది.

అన్ని భాగాలను చెక్ చేస్తూ వుండిపోయాను.

లివర్ పార్ట్ కన్పించలేదు.. లివర్ మిస్సింగ్.. లివర్ భాగాన్ని తీసివేశారు.

హెల్పర్ నాముందే శవాన్ని కోసింది.. అతను లివర్, కిడ్నీలను, పొట్టలోని పేగులను అంటుకోలేదు.

- ఇంకా ఉంది

మంచిమాట

కరుణామూర్తి



తిరుప్పావై 21వ పాశురమ్

ఏత్తకలంగళ్ ఎదిర్ పొంగి మీదళిప్ప
మాత్తాదే పాల్ శొరియుమ్ వళ్ళల్ పెరుం పశుక్కళ్
ఆత్త ప్పడైత్తాన్ మకనే అఱివుఱాయ్
ఊత్తముడైయాయ్ పెరియాయ్ ఉలకిని
తోత్తమాయ్‌నిన్ఱ శుడరే తుయిల్ ఎళాయ్
మాత్తార్ ఉనక్కు వలితులైందు ఉన్ వాశల్ కణ్
ఆత్తాదు వన్దు ఉన్నడి పణియుమాపోలే
పోత్తి యా వన్దోమ్ పుకళుందు ఏలోరెమ్బావాయ్

భావం:ఈనాటి పాశురంలో ఆచార్యుడి వాత్సల్యాన్ని, సమస్త జ్ఞానాధికుడైన ఆచార్యుని ఔదార్యాన్ని ఆ ఆచార్యుడి ఆధీనంలో వుండే పరమాత్మను కొనియాడుతూ, కరుణించుటకు లేచి రమ్మని కోరుతున్నారు గోపికలు. ఆచార్యుడైన నందగోపుని ఆతని ఆధీనంలో ఉన్న పరమాత్మ శ్రీకృష్ణుడి ఉన్నత గుణాలను ప్రశంసిస్తున్నారు. ఆశ్రిత రక్షణుడైన పరమాత్మ శ్రీకృష్ణుడి ఉన్నత గుణాలను ప్రశంసిస్తున్నారు. ఆశ్రిత రక్షణుడైన పరమాత్మ బలపరాక్రమాలకు శతృవులు ఓడిపోయి వచ్చి ఆతని పాదాలకు శరణు వేడినట్లుగా, గోపికలు తమలోని ఇంద్రియ శక్తులకు ఓడింపజేసుకొని నీ బల పరాక్రమాలకు మంగళా శాసనాలు పాడటానికి వచ్చాము. ఇప్పుడైనా లేచి వచ్చి మమ్ము కరుణించు అని వేడుకొంటున్నారు గోపికలు.

పాలు పితుకుటకై పొదుగు క్రింద పెట్టిన భాండములు పాలతో నిండి పైపైకి పొంగి పొరలునట్లు ఆగక పాలు స్రవించే ఔదార్యంగల, నిండైన క్షీర సంపదనిచ్చే పెద్ద గోవులు సమృద్ధిగా గలవాడు నందగోపుడు. ఆతని కుమారుడైన ఓ శ్రీకృష్ణా మేల్కొనాలి. ఆశ్రిత రక్షణా స్వభావం కలవాడా! పరమాత్మ స్వరూపుడా! నీ నిద్ర (యోగనిద్ర) నుండి మేల్కొనాలి. శత్రువులు (రాక్షస గుణాలు) బలాన్ని పోగొట్టుకొని నీకు లోబడి వేరే గతి లేక, వచ్చి నీ పాదాలను శరణు వేడి నిలిచినట్లే, మేము కూడా (మాలోని రాక్షస గుణాలైన ఇంద్రియ శక్తులతో జీవితంలో పోరాడి పోరాడి అలసిపోయి, ఓడిపోయి నీ పాదాలను శరణువేడి, నీ కళ్యాణ గుణాలను కీర్తించి మంగళం పాడటానికై వచ్చి నిల్చిన వారము. మా అల్పత్వాన్ని గ్రహించాము. మమ్ము కరుణించి, రక్షించి, నీ దర్శనాన్ని కల్గించు తండ్రీ! అని ఆర్తిగా వేడుకుంటున్నారు గోపికలు ఈనాటి పాశురంలో.

ఆండాళ్ తిరువడిగళే శరణమ్

- డాక్టర్. పరవస్తు కమల

యాజ్ఞసేని



- త్రోవగుంట వేంకట సుబ్రహ్మణ్యము 3

'అగ్నివేశ్యుడు' అనే మహాముని శ్రేష్ఠునివద్ద ద్రోణుడు వేదాధ్యయనం చేసి, ధనుర్వేదం నేర్చుకొంటున్న కాలంలో పాంచాల రాజైన పృషతుని కుమారుడు ద్రుపదుడు కూడా వచ్చి ద్రోణునికి మిత్రుడై అతడితోపాటు గురువు వద్ద అన్ని విద్యలు నేరుస్తాడు. విద్యాభ్యాసం ముగిసిన తరువాత ద్రుపదుడు తన రాజ్యానికి వెళుతూ తనకు ద్రోణునితోకల మిత్రబృందాన్ననుసరించి అతడితో "నేను పాంచాల దేశానికి రాజైనప్పుడు నీవు నా దగ్గరికి రావాలి సుమా! నా రాజ్యభోగాలు నీవు కూడా అనుభవించటానికి అర్హుడవు" అని ప్రార్థిస్తాడు. పృషతుని మరణానంతరం ద్రుపదుడు రాజౌతాడు.

ద్రోణుడు ధనుర్విద్యను అభ్యసించి గొప్ప ధనుర్విద్య పారంగుతడు అవుతాడు. అగ్నిశేశ్యుని వద్ద నుండి 'ఆగ్నేయాస్త్రము' మొదలుగాకల అనేక దివ్యాస్త్రాలను ప్రయోగ సంహారాలతోపాటు పొందుతాడు.

తండ్రి భరద్వాజుని ఆజ్ఞ మేరకు పుత్రులను పొందటానికై ద్రోణుడు 'కృపాచార్యుని' చెల్లెలైన 'కృపి' అనే ఆమెను వివాహం చేసికొంటాడు. కృపి యందు కొంతకాలానికి ద్రోణుడు 'అశ్వత్థామ' అనే ఒక కుమారుని పొందుతాడు.


జమదగ్ని కుమారుడైన పరశురాముడు బ్రాహ్మణులకు గొప్పగా ధనాన్ని ఇస్తున్నాడని వింటాడు ద్రోణుడు. మహేంద్రగిరిపై తపస్సు చేస్తున్న అతడి వద్దకు ధనాపేక్షతో వెళతాడు ద్రోణుడు. పరశురాముడిని చూసి సవినయంతో-

"మహర్షీ! నేను భరద్వాజుడి పుత్రుడనైన ద్రోణుడను. నా ప్రణామములు స్వీకరించండి. ధనాన్ని ఆశించి తమ వద్దకు వచ్చాను' అని అన్నాడు.

"లోకం చేత పొగడ్తలందుకున్న ఓ ద్రోణా! నేను ఉన్న ధనాన్నంతా ముందే బ్రాహ్మణులకు ఇచ్చివేశాను. భూమినంతటినీ కశ్యప మహర్షికి ఇచ్చాను. నా దగ్గర ఇపుడు ఏమీయు లేవు. ఒక్క శస్త్రాలూ, అస్త్రాలూ, ఈ శరీరం మాత్రమే మిగిలి ఉన్నాయి. వీటిలో నీకు కావలసినవాటిని తీసుకొనుము. తప్పక యిస్తాను" అని అన్నాడు పరశురాముడు.

జనులచేత ప్రశంసింపబడే ఓ మహర్షీ! ధనాలలో మిక్కిలి మేలైన ధనాలు శస్త్రాస్త్రాలు. సంతోషంతో వీటిని తీసికొని కృతార్థుడనౌతాను. ఆ శస్త్రాస్త్ర సమూహాన్ని నాకిమ్ము" అని సవినయంతో ప్రార్థించాడు.

ఆ మాటలు విన్న పరశురాముడు సంతోషించాడు.



"నా వద్ద దివ్యాస్త్రాలనన్నింటినీ వాటి ప్రయోగ మర్మాలతో, మంత్రాలతో నీకు ప్రసాదిస్తున్నాను. సంతోషంతో వాటి ప్రయోగోప సంహారాలతో గైకొనుము' అని ఉదకధారతో ప్రసాదించాడు పరశురాముడు. "మహర్షీ! ధన్యుడను. ధన్యుడను సదా కృతజ్ఞుడను" అని ద్రోణుడు సంతోషంతో వెనుదిరిగి తన ఆశ్రమానికి వచ్చాడు.

ద్రోణునికి భార్య కృపివలన అశ్వత్థామ అనే కుమారుడు కలిగాడు. ధనం లేని చేత సంసారాన్ని భరించలేనివాడౌతాడు. ఇతరులను యాచించకుండా ధర్మార్గంలోనే కాలం గడుపుతుంటాడు.

ధనవంతుల బిడ్డలు ప్రతిదినం సంతోషంతో పాలు త్రాగుతుండగా ఒక రోజు అశ్వత్థామ అమ్మా! నాకు కూడా పాలు పోయండి" అని ఏడవటం మొదలుబెట్టాడు.

తనకున్న దారిద్ర్యాన్ని తలంచిన ద్రోణుడు పరితపిస్తాడు. ఏమి చెయ్యాలో ఆలోచిస్తాడు. ఒక్కసారిగా తనబాల్యమిత్రుడైన ద్రుపదుడు జ్ఞాపకమొస్తాడు. అతడు ఇప్పుడు రాజైనాడు. అతడు అప్పట్లో నన్ను ఆహ్వానించి వెళ్ళావు. కావున అతడిని సహాయ మార్జించటంలో తప్పు లేదు.

"నేను కోరితే ధనాన్ని ఇవ్వలేకపోయినా నాలుగు పాడి ఆవులైనా ఇవ్వకపోతాడా" అని తనలో తాను నిర్ణయించుకొని పాంచాల రాజధాని అయిన 'కాంపిల్యానికి' బయలుదేరాడు.

సకల సంపదలతో తులతూగుచున్న కాంపిల్యానికి వస్తాడు ద్రోణుడు. రాజప్రసాదానికి చేరుతాడు. అక్కడ వున్న ప్రతీహారులతో..

నేను ద్రోణుడను ద్రుపద మహారాజుకు స్నేహితుడను. నా రాకను మహారాజుకు తెలియపరచండి" అని అంటాడు.

భటులు ద్రోణుని రాకను ద్రుపదునికి తెలియపరిచి అతడి అనుజ్ఞతో ద్రోణుని తోడ్కొని ద్రుపదుని వద్దకు పోతారు.

ద్రోణుని చూచిన ద్రుపదుడు రాజగర్వంతో ద్రోణుని సాదరంగా ఆహ్వానించడు గదా మిత్రత్వాన్ని కూడా పాటించడు. అపుడు ద్రుపదుని చూచిన ద్రోణుడు నిలబడే...

"నేను నీ బాల్యమిత్రును, ద్రోణుడను. గతంలో మనిద్దరం ఒకే ముని వద్ద ధనుర్విద్యను నేర్చుకున్నాము గదా, గతంలో నీవు పాంచాలానికి తిరిగి వస్తూ, 'నేను పాంచాల దేశానికి రాజైనపుడు నీవు నా దగ్గరికిరావాలి సుమా! నా రాజ్యభోగాలు నీవు కూడా అనుభవించటానికి అర్హుడవు" అని అన్నావు.

- ఇంకా ఉంది

రచనలు పంపవలసిన చిరునామా: **ఎడిటర్,** ఆంధ్రభూమి దినపత్రిక, 36, సరోజినీదేవి రోడ్, సికింద్రాబాద్-500 003

నేర్చుకుందాం



శ్రీ నరసింహ శతకములోని పద్యము

సీ. **ఆది నారాయణా! యనుచు నాలుక తోడ**
పలుక నేర్చినవారి పాదములకు
సాష్టాంగముగ నమస్కారమర్పణ జేసి
ప్రస్తుతించెదనయ్య బహువిధముల
ధరణిలో నరులెంత దండి వారైనను
నిన్నుఁ గానని వారినే స్మరింప
మేము శ్రేష్ఠులమంచు మిడుకు చుండెడివారి
చెంతఁజేరగఁ బోను శేషశయన

తే. **పరమ సాత్త్వికులైన నీ భక్తవరుల**
దాసులకు దాసుడను సుమీ! ధరణిలోన
భూషణవికాస! శ్రీధర్మపుర నివాస!
దుష్టసంహార! నరసింహ! దురితదూర!

భావం: స్వామీ! నరసింహా! నీవే ఈ విశ్వసృష్టికి మూల పురుడవని స్తుతించే వారి పాదపద్మాలకు నేను సాగిలపడి మొక్కుతున్నాను. కాని, భూప్రపంచంలో మానవులెంత దొడ్డవారైనా, నిన్ను కనలేని వారైతే వారిని నేను పల్కరించను. అంతేకాదు 'నీకంటే మేమే శ్రేష్టుల'మని విఱ్ఱవీగే వారి చెంత చేరను. ఓశేషశాయీ ప్రపంచంలో సత్త్వగుణం గల్గిన నీభక్తులెల్లరికి దాసానుదాసుడనుగా ఉంటాను. భగవంతుని పూజించడం కన్నా భాగవతులను సేవించడం అంటే పరమాత్మకు పరమ ప్రీతి. తన భక్తుని ఎవరైనా నిందిస్తున్నారంటే ఆయన తట్టుకోలేడు. కనుక అటువంటి భక్తవాత్సల్యం గల భగవంతుని కరుణనుపొందిన భాగవతులను సేవిస్తాను అని కవి అంటున్నారు.

మాటాట : 1529

నిర్వహణ: సుధామ

1		2		■	■	3
	■		■	4		
5		■	6		■	
■	■	7	■		■	■
8	■	9		■	10	11
12			■	13	■	
	■	■	14			

ఆధారాలు

అడ్డం:
1. ఇది భూమిలో క్రుంకిన సమయంలో కర్ణుడిని బాణం వేసి వధించాడు అర్జునుడు
4. వేడుక
5. దెబ్బలాట
6. అయ్యప్పస్వామి
9. దేవాలయం
10. చోరుడు
12. ఉత్సాహము
14.హంస

నిలువు:
1. వెండి
2..కుచము
3. పుకారు
4. కొందరికి జీవితం వడ్డించిన ఇది
7. బంక
8. భుజము
11. గొంతు
13. కలంలో పోసి రాసేది

మాటాట - 1528 సమాధానం

■	1 క	మ	2 ల	ద	ళం	■
3 సా	■	■	వ	■	■	4 పు
5 గు	6 డి	■	ణం	■	7 గో	రె
■	8 మ	ట్ట	■	9 పూ	లు	■
10 నో	ము	■	11 గా	■	12 సు	13 త
రు	■	■	రా	■	■	రా
■	14 చె	ర	బం	డ	రా	జు

రాశిఫలం



- గౌరీభట్ల దివ్యజ్ఞాన సిద్ధాంతి

- **మేషం (అశ్విని, భరణి, కృత్తిక 1పా.)**
కోరుకునేది ఒకటైతే జరిగేది మరొకటవుతుంది. అనారోగ్య బాధలు స్వల్పంగా వున్నాయి. వేళ ప్రకారం భుజించుటకు ప్రాధాన్యమిస్తారు. చంచలంవల్ల కొన్ని ఇబ్బందులెదురవుతాయి.
- **వృషభం (కృత్తిక 2, 3, 4పా., రోహిణి, మృగశిర 1, 2పా.)**
కష్టాలన్నీ క్రమేణా తొలగిపోతాయి. నూతన కార్యాలకు శ్రీకారం చుడతారు. కుటుంబ సౌఖ్యం సంపూర్ణంగా వుంటుంది. బంధు, మిత్రులతో కలిసి సరదాగా కాలక్షేపం చేస్తారు.
- **మిథునం (మృగశిర 3, 4 పా., ఆరుద్ర, పునర్వసు 1, 2, 3పా.)**
ఋణప్రయత్నాలు సులభంగా ఫలిస్తాయి. కుటుంబంలో అనారోగ్య బాధలుండును. బంధు, మిత్రులతో వైరమేర్పడకుండా జాగ్రత్తపడుట మంచిది.
- **కర్కాటకం (పునర్వసు 4 పా., పుష్యమి, ఆశ్రేష)**
వ్యవహారంలో ఇబ్బందులను ఎదుర్కొనే అవకాశం వుంది. బంధు, మిత్రులతో జాగ్రత్తగా నుండుట మంచిది. ఋణప్రయత్నాలు చేస్తారు.
- **సింహం (మఖ, పుబ్బ, ఉత్తర 1 పా.)**
శుభకార్య ప్రయత్నాలు సులభంగా నెరవేరతాయి. దూర బంధువులతో కలుస్తారు. తద్వారా లాభాలుంటాయి. విదేశయాన ప్రయత్నాలు సంపూర్ణంగా నెరవేర్చుకుంటారు.
- **కన్య (ఉత్తర 2, 3, 4పా., హస్త, చిత్త 1, 2 పా.)**
బంధు మిత్రుల సహాయ సహకారాలు లభిస్తాయి. మానసికాందోళనతో కాలం గడుస్తుంది. ఆకస్మిక ధననష్టమేర్పడే అవకాశముంటుంది. స్థిరమైన నిర్ణయాలు తీసుకోలేకపోతారు.
- **తుల (చిత్త 3, 4పా., స్వాతి, విశాఖ 1, 2, 3పా.)**
మానసికానందం లభిస్తుంది. కొన్ని పనులు పూర్తవుతాయి. విందులు, వినోదాల్లో పాల్గొంటారు. వృత్తిరీత్యా అభివృద్ధిని సాధిస్తారు.
- **వృశ్చికం (విశాఖ 4 పా., అనూరాధ, జ్యేష్ఠ)**
విదేశయాన ప్రయత్నాలు అనుకూలిస్తాయి. అనారోగ్య బాధలు అధికమవుతాయి. ఆకస్మిక ధననష్టమేర్పడే అవకాశముంటుంది. బంధు, మిత్రులతో విరోధమేర్పడకుండా జాగ్రత్త వహించుట మంచిది.
- **ధనుస్సు (మూల, పూర్వాషాఢ, ఉత్తరాషాఢ 1 పా.,)**
బంధు, మిత్ర విరోధమేర్పడకుండా జాగ్రత్త వహించుట మంచిది. మానసికాందోళన అధికమగును. అనారోగ్య బాధలను అధిగమిస్తారు.
- **మకరం (ఉత్తరాషాఢ 2, 3,4పా., శ్రవణం, ధనిష్ఠ 1, 2పా.)**
ఆత్మీయుల సహకారం ఆలస్యంగా లభిస్తుంది. ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతారు. అజీర్ణ బాధలు అధికమగును. శుభవార్తలు వింటారు.
- **కుంభం (ధనిష్ఠ 3, 4పా., శతభిషం, పూర్వాభాద్ర 1,2, 3పా.)**
శుభవార్తలు వింటారు. ధనలాభంలో ఆనందంగా వుంటారు. ప్రయత్నకార్యాలన్నింటిలో సఫలీకృతులవుతారు. కీర్తి, ప్రతిష్ఠలు అధికమవుతాయి.
- **మీనం (పూర్వాభాద్ర 4 పా., ఉత్తరాభాద్ర, రేవతి)**
ధనలాభముంది. అద్భుతమైన అవకాశాలు లభించును. అన్నింటా విజయాన్నే సాధిస్తారు. బంధు, మిత్రులు కలుస్తారు. శుభవార్తలు వింటారు.

సాహసమే శ్వాసగా..



గమ్యాన్ని చేరుకునే క్రమంలో ఎన్ని సవాళ్లనైనా ధైర్యంగా ఎదుర్కొనాలే తప్ప నిరాశతో నీరస పడకూడదని 'మహిళా స్టంట్ రైడర్'గా సత్తా చాటుకుంటున్న 22 ఏళ్ల అనమ్ హషీమ్ ఎంతో ఆత్మవిశ్వాసంతో చెబుతోంది. అమ్మాయిలకు 'రోల్ మోడల్'గా నిలవాలన్నదే తన ఆకాంక్ష అని, మగువలు సాహసం చేస్తే సాధ్యం కానిది ఏదీ ఉండదని అంటోంది. మహిళలను స్టంట్ రైడర్లుగా తీర్చిదిద్దేందుకు ఓ జాతీయ స్థాయి అకాడమీని ఏర్పాటు చేయాలన్నదే తన భావి ప్రణాళిక అని హషీమ్ తన అంతరంగాన్ని ఆవిష్కరిస్తోంది. భారత్‌లో స్టంట్ రైడింగ్‌ను వృత్తిగా చేసుకున్న ఏకైక మహిళగా ప్రఖ్యాతి పొందిన ఆమె ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన 'అంతర్జాతీయ ఔత్సాహిక పారిశ్రామిక వేత్తల సదస్సు'లో పాల్గొని స్టంట్ రైడింగ్ అంటే పురుషులకు సంబంధించిన విద్య కాదని చాటింది. మోటార్ బైకింగ్ రంగం నుంచి ఈ సదస్సులో పాల్గొన్న ఏకైక ప్రతినిధిగా ఆమె తన విశిష్టతను చాటుకుంది.

గత ఏడాది మే నెలలో జకార్తాలో జరిగిన 'జింఖానా స్టంట్ రైడ్ పోటీల'లో మూడో స్థానాన్ని కైవసం చేసుకున్న హషీమ్ 'బైక్ రైడింగ్' అనేది ఎన్నటికీ 'తీరని దాహం' లాంటిదని చెబుతోంది. ప్రపంచంలోనే మూడవ అతి ఎత్తయిన 'ఖర్దంగ్ లా' శిఖరంపైకి చేరుకుని రికార్డు సృష్టించిన ఆమె 2015లో 'బైక్ రైడింగ్'ను ఎంచుకుంది. 'ఖర్దంగ్ లా'పైకి చేరుకున్న పిన్న వయస్కురాలిగా ఇరవై ఏళ్ల ప్రాయంలోనే ఘనతను సాధించిన ఆమె మరిన్ని లక్ష్యాలను సాధించేందుకు దూసుకుపోతోంది. 'ఖర్దంగ్ లా' శిఖరంపైకి చేరుకున్నాక ఆమెను అంతా 'సెలబ్రిటీ' మాదిరి చూడడం ప్రారంభించారు. 'స్టంట్ రైడర్'గా విన్యాసాలను ప్రారంభించిన తొలినాళ్లలో హషీమ్ పేరు సోషల్ మీడియాలో మార్మోగింది. స్టంట్ రైడర్‌గా తాను చేసిన సాహసాలకు సంబంధించిన ఫొటోలు, వీడియాలను ఆమె సోషల్ మీడియాలో ఉంచడంతో అందరి దృష్టినీ ఆకర్షించింది. పాఠశాల రోజుల్లో తనకు సాహస క్రీడలంటే ఎంతో మక్కువ అని చెప్పే ఆమె- బైక్‌లపై కుర్రాళ్లు చేసే విన్యాసాలను చూసి తాను కూడా అలాగే 'స్టంట్ రైడింగ్' చేయాలని ఆరాటపడేది. 15 ఏళ్ల ప్రాయంలోనే స్టంట్ రైడింగ్ పట్ల ఆమెలో ఆసక్తి పెరిగింది. అయితే, సొంతంగా ఓ 'రేసింగ్ బైక్'ను కొనేంత వరకూ కొన్నేళ్లపాటు నిరీక్షించక తప్పలేదని ఆమె తన జ్ఞాపకాలను వివరిస్తోంది.

అడ్డంకులను అధిగమించి..

సొంతంగా రేసింగ్ బైక్‌ను కొనుక్కున్నా బహిరంగంగా విన్యాసాలు చేసేందుకు హషీమ్‌కు తొలి నాళ్లలో ఎన్నో అవరోధాలు ఎదురయ్యాయి. ఆడపిల్ల బైక్ నడపడాన్ని అంతా వింతగా చూసేవారు. ఇక బైక్‌పై విన్యాసాలంటే మరీ విడ్డూరంగా మాట్లాడుకునేవారు. అయినప్పటికీ ఆత్మవిశ్వాసాన్ని కోల్పోకుండా ధైర్యంగా ఆమె ప్రాక్టీస్ చేసేది. కొంత మంది బైక్ మెకానిక్‌లు కూడా ఆమెను నిరుత్సాహ పరిచారు. శారీరక దారుఢ్యం (ఫిట్‌నెస్) ఉంటే తప్ప ఇలాంటి విన్యాసాలను చేయడం కష్టమని ఆ దిశగా ఆమె ప్రయత్నాలు చేసింది. శారీరక, మానసిక ఆరోగ్యం ఉంటే ఎలాంటి సాహస క్రీడల్లోనైనా అనుకున్నది సాధించవచ్చని ఆమె చెబుతోంది. 'స్టంట్ బైకింగ్' మగాళ్లకు సంబంధించిన క్రీడాంశం అని, దీనిని అమ్మాయిలు వృత్తిగా చేసుకునేందుకు అవకాశం లేదని హషీమ్ తల్లిదండ్రులు కూడా అనేవారు. పూణెలో ఇంజినీరింగ్ చదవాలని ఆమెపై పేరెంట్స్ వత్తిడి తెచ్చేవారు. అయితే, బైక్ రైడింగ్ పట్ల తపన ఉన్న హషీమ్ తాను ఎంచుకున్న మార్గంలోనే పయనిస్తానని తల్లిదండ్రులను ఒప్పించింది. సొంతంగా రేసింగ్ బైక్‌ను 2013లో కొనుక్కున్నాక, లక్ష్యసాధన కోసం నిత్యం సాధన చేయడం ఆమెకు అలవాటుగా మారింది. మన దేశంలో ఇప్పటికీ సాహస క్రీడలను పురుషులకు పరిమితం చేయడం సరి కాదని ఆమె అంటోంది. ఎవరిపైనా ఆధారపడకుండా లక్ష్యసాధన కోసం చేసే కృషిలో ఆత్మసంతృప్తికి అంతులేదని చెబుతోంది.




మన దేశంలో బాలికలను క్రీడారంగంలో ప్రోత్సహించడం అరుదని, అలాంటిది స్టంట్ రైడింగ్ వంటి సాహస కృత్యాల్లో ప్రవేశించడం దుర్లభమని, ఈ పరిస్థితులు మారితేనే మహిళలు సమానత్వాన్ని సాధించినట్టు అవుతుందని హషీమ్ అంటోంది. బాలికల ఇష్టాలను గమనించి వారు ఆసక్తి చూపే రంగంలో పేరెంట్స్ ప్రోత్సహించాలని అంటోంది. స్టంట్ రైడింగ్‌కు సరైన వసతి సౌకర్యాలు, మైదానాలు సమకూర్చాలని ఆమె విజ్ఞప్తి చేస్తోంది. స్టంట్ రైడింగ్‌లో గాయాలు తగలడం సహజమని, అంతమాత్రాన దీనిని ప్రాణాంతక క్రీడగా పరిగణించరాదని సూచిస్తోంది. ఓసారి స్టంట్ రైడింగ్ సందర్భంగా తన తలకు గాయమైందని, అయితే అదృష్టవశాత్తూ చిన్న గాయం కావడంతో తిరిగి సాధన ప్రారంభించానని తెలిపింది. స్టంట్ రైడింగ్ చేసేవారు విధిగా హెల్మెట్ ధరించాలని సలహా ఇస్తోంది. ప్రభుత్వాలు కూడా రహదారుల పరిస్థితిని మెరుగుపరచాలని కోరుతోంది. తగిన సలహాలు, జాగ్రత్తలు తీసుకుంటే అమ్మాయిలు స్టంట్ రైడింగ్‌లో రాణించడం కష్టమేమీ కాదంటోంది.

కాలం మారుతోంది..

గతంతో పోల్చిచూస్తే భారత్‌లో ఇటీవలి కాలంలో పరిస్థితులు మారుతున్నాయని, అమ్మాయిలు వారికి నచ్చిన రంగంలో కృషి చేసేందుకు ఆసక్తి చూపుతున్నారని హషీమ్ ఆనందం వ్యక్తం చేస్తోంది. సాహస క్రీడలను ప్రోత్సహించేందుకు తగిన వేదికలుండాలని, ఓటమి నుంచి పాఠాలు నేర్చుకుని గమ్యం వైపు దూసుకుపోవాలని ఆమె అంటోంది. మహిళా సాధికారత కోసం కృషి చేస్తున్న ప్రభుత్వాలు సాహస క్రీడల్లో అమ్మాయిలను ప్రోత్సహించాలంటోంది. స్టంట్ రైడింగ్‌ను ఒక క్రీడగా గుర్తించి, అందులో అమ్మాయిలను ప్రోత్సహించాలని కోరుతోంది. మరిన్ని అంతర్జాతీయ పోటీల్లో పాల్గొన్ని స్టంట్ రైడింగ్‌లో భారత్ కీర్తిపతాకాన్ని రెపరెపలాడించాలన్నదే తన ధ్యేయమని హషీమ్ చెబుతోంది.

కొలువు కోసం కొత్త ట్రెండ్

డబ్బులు ఊరికే రావు.. ఇప్పటి వరకూ ఇచ్చింది చాలు..' అంటూ ఇటీవలి కాలంలో తెగ ప్యాపులర్ అయిన ఓ నగల దుకాణం ప్రకటనను నేటి యువత తమ కోసం కాస్త సవరించుకుని- 'ఉద్యోగాలు ఊరికే రావు.. ఇప్పటివరకూ కాలక్షేపం చేసింది చాలు.. కాస్త నైపుణ్యం, వైవిధ్యం ఉండాలి..' అని అనుకోక తప్పదు. ఎందుకంటే డిగ్రీ సర్టిఫికెట్లు, ఇంటర్వ్యూలో ప్రతిభ ఆధారంగా ఉద్యోగాలిచ్చే రోజులు పోయాయి. అర్హతలు ఎన్ని ఉన్నా, సంబంధిత రంగంలో నైపుణ్యం ఉంటే తప్ప ఉద్యోగం దక్కని పరిస్థితి నేడు నెలకొంది. 'ఆటోమేషన్' పుణ్యమాని ఉద్యోగావకాశాలు నానాటికీ తగ్గుముఖం పడుతున్నందున నియామకాల సందర్భంగా అనూహ్యమైన పోటీ నెలకొంటోంది. నిరుద్యోగులే కాదు, ప్రస్తుతం ఉద్యోగం చేస్తున్న వారు సైతం నైపుణ్యాలను పెంచుకోవల్సిన అవసరం ఏర్పడింది. ఐటీ రంగం గత ఏడాది నిరాశ పరచినా, ఈ కొత్త సంవత్సరంలో పరిస్థితులు మెరుగై ఉద్యోగావకాశాలు కొంతమేరకు పెరుగుతాయని 'టీమ్‌లీజ్' సంస్థ అంచనా వేసింది. ఉద్యోగాలు ఆశించేవారు, ఉద్యోగంలో ఉన్నవారు దానిని కాపాడుకోవాలన్నా నూతన నైపుణ్యాలను అభ్యసించడం కొన్ని రంగాల్లో అనివార్యమవుతోంది. కొన్ని రంగాల్లో ఉపాధి అవకాశాలు తగ్గినా, మొబైల్స్ తయారీ, ఆర్థిక సేవల సాంకేతికత, అంకుర సంస్థల్లో అవకాశాలుంటాయి. డిజిటలీకరణ కోసం డిజిటల్ సాంకేతికతలో నైపుణ్యం ఉన్న 50 శాతం మంది అదనంగా అవసరం అవుతారు. కొత్తతరం సాంకేతికతల వినియోగానికి డిజిటల్ నైపుణ్యాలున్న ఉద్యోగుల అవసరం ఎంతో ఉందని 'అడోబ్ ఇండియా' ఓ సర్వేలో తేల్చింది. అధిక నైపుణ్యం ఉన్న ఉద్యోగులు బయటకు పోకుండా సంబంధిత సంస్థలు కాపాడుకోవడం కూడా ఓ సవాలుగా మారనుంది.



నవీకరణ వైపు ఆసక్తి..

ఐటీ రంగంలో వస్తున్న నూతన సాంకేతిక నైపుణ్యాలను ఆకళింపు చేసుకుని ఎక్కువమంది నిపుణులు తమను తాము నవీకరించుకుంటున్నారు. నైపుణ్యాల నవీకరణపై జరిగిన తాజా అధ్యయనంలో అనేక ఆసక్తికరమైన అంశాలు వెలుగుచూశాయి. ఐటీలో 5ఏళ్ల అనుభవం ఉన్నవారు ఆధునిక సాంకేతిక నైపుణ్యం వైపు మొగ్గు చూపుతున్నారు. నూతన సాంకేతిక పరిజ్ఞానంపై నైపుణ్యం సాధించాలనే తపన సీనియర్‌లో వ్యక్తమవుతోంది. ఏఐ/ఎంఎల్ నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని ప్రోత్సహించే వ్యవస్థలు ఏర్పాటు కావాలని నిపుణులు సూచిస్తున్నారు. 'ఆటోమేషన్' ప్రభావంతో నీరసపడిపోవడానికి బదులు నూతన సాంకేతికతను అలవరచుకుంటే కెరీర్ ఉజ్వలంగా ఉంటుందని అనుభవజ్ఞులు సూచిస్తున్నారు.

లెక్కకు మించి డిగ్రీలున్న వారికి ఇపుడు నియామక పత్రాలు అందే పరిస్థితి లేదు. సరికొత్త సాంకేతిక నైపుణ్యాలున్న వారికే ప్రముఖ సంస్థలు ఆహ్వానిస్తున్నాయి. సరికొత్త నైపుణ్యాలను ఎప్పటికప్పుడు అందిపుచ్చుకోవడం ఇపుడు ఉద్యోగార్థులకు అదనపు అర్హత. ఉద్యోగ నియామక ప్రక్రియలో కొత్త ధోరణులు చోటు చేసుకుంటున్నాయి. కేస్ స్టడీస్, గ్రూప్ డిస్కసన్, పర్సనాలిటీ టెస్ట్‌లు, ప్రెజంటేషన్లు, నివేదికలు వంటివి ఇపుడు అవసరం అవుతున్నాయి. ఇవన్నీ నూతన నైపుణ్యాలలో భాగమే. విద్యార్హతలు ఏవి ఉన్నా, సాంకేతిక నైపుణ్యం అవసరం ఎంతో ఉంది. ఉద్యోగం కోసం అన్వేషించేవారే కాదు, ఉద్యోగం చేస్తున్నవారు కూడా సరికొత్త నైపుణ్యాలను ఆకళింపు చేసుకోవాల్సిందే. మార్కెట్ ట్రెండ్స్, వినియోగదారుల సైకాలజీ వంటి అంశాలను ముందే తెలుసుకోవాలి. సోషల్ మీడియాను, మారుతున్న సామాజిక, ఆర్థిక పరిస్థితులను తెలుసుకునేవారే ఇంటర్వ్యూలో ప్రతిభను చాటుకునే అవకాశం ఉంటుంది. మారిన 'ట్రెండ్'తో పాటు 'అప్‌డేట్' అయినపుడే ఉద్యోగార్థుల శ్రమకు తగ్గ ఫలితం లభిస్తుంది.



నోకియా 'పాంచ్ పటాకా'!

హెచ్ఎండి గ్లోబల్' ద్వారా స్మార్ట్‌ఫోన్ మార్కెట్‌లోకి నోకియా సరికొత్తగా రీ ఎంట్రీ ఇచ్చిన సంగతి అందరికీ తెలిసిందే. ఈ నేపథ్యంలో స్మార్ట్‌ఫోన్ ప్రేమికుల్లో నోకియా సరికొత్త ఆశలను రేకెత్తించింది. నోకియా బ్రాండ్‌కు సంబంధించి బడ్జెట్, ప్రీమియం సెగ్మెంట్లలో పలు స్మార్ట్‌ఫోన్లు ఇదివరకే మార్కెట్‌లోకి వచ్చి సత్తాచాటాయి. ఈ కొత్త సంవత్సరంలోనూ అదే ఊపును కొనసాగించేందుకు నోకియా సిద్ధమైంది. అయితే, గతంలో కంటే భిన్నంగా ఈ ఏడాది ఒకేసారి 5 స్మార్ట్‌ఫోన్లను విడుదల చేసేందుకు నోకియా కసరత్తు చేసింది. నోకియా నుంచి ఈ ఏడాది నోకియా-9, ఆండ్రాయిడ్ నౌగట్ ఆధారిత నోకియా 1, నోకియా 6 (2018), నోకియా 4, మరో హైఎండ్ ఎడిషన్ నోకియా 7 లేదా నోకియా 7 ప్లస్ కాని మార్కెట్‌లోకి దూసుకురానున్నాయని మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి. నోకియా 4, నోకియా 7 ప్లస్‌లు ఈ ఏడాది మార్కెట్ తలుపులు తట్టబోతున్నాయని నోకియా కెమెరా యాప్ కూడా తేల్చి చెప్పింది. ముందస్తు నివేదికల ప్రకారం నోకియా 6 (2018), నోకియా 1 ఫోన్లతో నోకియా ఈనెల 9న హెచ్ఎండి గ్లోబల్ ప్రకటిస్తుందని తెలిసింది. నోకియా 4, నోకియా 7 ప్లస్ ఈ ఏడాది ద్వితీయార్థంలో ప్రవేశపెట్టొచ్చని తెలుస్తోంది. నోకియా 9 హై ఎండ్ స్మార్ట్‌ఫోన్‌గా రాబోతున్న నోకియా 9, 5.5 అంగుళాల ఓలెడ్ ప్యానెల్, బెజెల్ లెస్ డిస్‌ప్లే, క్వాల్‌కామ్ స్నాప్‌డ్రాగన్ 835, 3,250 ఎంఏహెచ్ బ్యాటరీ, ఫాస్ట్ ఛార్జింగ్ టెక్నాలజీ, వెనుకవైపు డ్యూయెల్ కెమెరాలను కలిగి ఉండబోతోంది.

నోకియా-7

5.2 అంగుళాల 1080 పిక్సెల్ ఎల్‌సిడి డిస్‌ప్లే, ఆండ్రాయిడ్ 7.1.1 నౌగట్ ఆపరేటింగ్ సిస్టం (అప్‌గ్రేడబుల్) ఆండ్రాయిడ్ 8.0 ఓరియో), క్వాల్కమ్ స్నాప్ డ్రాగన్ 630 ప్రాసెసర్, ర్యామ్ వేరియంట్స్ (4 జిబి, 6 జిబి), 64 జిబి ఇంటర్నల్ స్టోరేజ్, మైక్రో ఎస్డీ స్లాట్ ద్వారా ఫోన్ స్టోరేజ్ కెపాసిటీని విస్తరించుకునే అవకాశం, 16 మెగా పిక్సెల్ రియర్ ఫేసింగ్ కెమెరా, 5 మెగా పిక్సెల్ ఫ్రంట్ ఫేసింగ్ కెమెరా, కార్ల్‌జిస్ ఆప్టిక్స్ టెక్నాలజీ, 360 డిగ్రీ క్రిస్టల్ క్లియర్ సౌండ్, ఫింగర్ ప్రింట్ సెన్సర్, 3000 ఎంఏహెచ్ బ్యాటరీ.

నోకియా-9




5.3 అంగుళాల క్వాడ్ హైడెఫినిషన్ కర్వ్‌డ్ గ్లాస్ ఎడ్జ్ టు ఎడ్జ్ డిస్‌ప్లే, స్నాప్‌డ్రాగన్ 835 చిప్ సెట్, 13 మెగా పిక్సెల్ డ్యూయల్ రియర్ ఫేసింగ్ కెమెరా, 8 జిబి ర్యామ్. ఈ ఫోన్ ధర ఇండియన్ మార్కెట్‌లో రూ.45,000 వరకు ఉండొచ్చు.

నోకియా -1

5 ఇంచ్ డిస్‌ప్లే, స్నాప్‌డ్రాగన్ 212 ప్రాసెసర్, 1 జిబి ర్యామ్, 8 జిబి స్టోరేజ్, డ్యూయెల్ సిమ్, ఆండ్రాయిడ్ 8.0 ఓరియో (గో ఎడిషన్), 4 జి విఓఎల్‌టిఇ, 4000 ఏంఏహెచ్ కెపాసిటీ ఉన్న భారీ బ్యాటరీ వంటి ఫీచర్లను ఆవిష్కరిస్తున్నట్లు సమాచారం.

నోకియా-6 (2018)

5.5 అంగుళాల ఫుల్ హైడెఫినిషన్ ఐపిఎస్ డిస్‌ప్లే (రిజల్యూషన్ 1920/1080 పిక్సెల్స్) విత్ 2.5 కార్నింగ్ గొరిల్లా గ్లాస్ ప్రొటెక్షన్, ఆండ్రాయిడ్ 7.1.1 నౌగట్ ఆపరేటింగ్ సిస్టం, క్వాల్కమ్ స్నాప్ డ్రాగన్ 430 ప్రాసెసర్, ర్యామ్ వేరియంట్స్ (4 జిబి, 3 జిబి), మైక్రో స్డీ స్లాట్ ద్వారా ఫోన్ స్టోరేజ్ కెపాసిటీని 128 జిబి వరకు విస్తరించుకునే అవకాశం, 16 మెగా పిక్సెల్ రియర్ ఫేసింగ్ కెమెరా, 8 మెగా పిక్సెల్ ఫ్రంట్ ఫేసింగ్ కెమెరా, ఫింగర్ ప్రింట్ సెన్సర్, 4 జి ఎల్‌టిఇ సపోర్టు, వైఫై, ఎన్‌ఎఫ్‌సి సపోర్ట్, మైక్రో యుఎస్‌బి, 3000 ఎంఏహెచ్ బ్యాటరీ. ఆర్టీ బ్లాక్, మాటీ బ్లాక్, టెంపర్డ్ బ్లూ, కాపర్ వైట్ వంటి ఆకర్షణీయ రంగుల్లో లభిస్తుంది.



కొత్త కొత్తగా..

క్వాడ్ కెమెరాలతో జియోనీ ఎస్-11

చైనాకు చెందిన జియోనీ కంపెనీ ఈనెలలోనే భారతీయ మార్కెట్‌లో ఎస్11 స్మార్ట్‌ఫోన్‌ను విడుదల చేసేందుకు రంగం సిద్ధమైంది. ఈ ఫోన్ ధర 20వేల రూపాయలు మించి ఉంటుందని అంచనా. ఫీచర్ల పరంగా చూస్తే- 5.99 అంగుళాల డిస్‌ప్లేతో సన్నని బెజెల్స్, ఫుల్ హెచ్‌డి 2160/1080 పిక్సెల్ రిజల్యూషన్, 18.9 యాస్పెక్ట్ రేషియో కలిగి వుంటుంది. 4 జిబి రామ్, 64 జిబి స్టోరేజ్ స్పేస్‌తో 2.5 గిగా ఆక్టాకోర్ మీడియాటెక్ యంటి 6737టి హెలియా పి23 ప్రాసెసర్ ఇందులో ఆకర్షణలు. క్వార్ట్జ కెమెరాలు ఇందులోని మరో విశిష్ఠత. బ్యాక్‌సైడ్ డ్యూయెల్ కెమెరా సెటప్ వుంటుంది. ముందువైపు 16 మెగా పిక్సెల్ మెయిన్ సెన్సర్, సెల్ఫీ, వీడియో కాలింగ్ క్లిక్ కోసం 8 మెగా పిక్సెల్ సెకండరీ సెన్సర్ వుంటుంది. దీంతో ఫొటోలు, వీడియోలు మరింత అందంగా తీసుకోవచ్చు. 4జి, ఓల్ట్, వైఫై 3.5 ఎంఎం ఆడియో జాక్, హైబ్రిడ్ సిమ్ స్లాట్ వంటి స్టాండర్డ్ కనెక్టివిటీ ఫీచర్లు ఉన్నాయి. హ్యాండ్ సెట్ పూర్తి స్క్రీన్ డిజైన్, క్వాడ్ కెమెరాలతో వుంటుంది. ఇందులోని బ్యాటరీ సామర్థ్యం 3410 ఎంఏహెచ్‌గా వుంటుంది. జియోనీ ఎస్11 ఆండ్రాయిడ్ 7.1 నౌగట్ ఓఎస్‌ను బాక్స్ నుంచి బయటకు తెస్తుంది.



ఫేస్‌బుక్‌కూ 'ఆధార'మే..

సంక్షేమ పథకాలకు, ఇతర సేవలకు అనుసంధానం చేసినట్లే ఇకపై 'ఫేస్‌బుక్' ఖాతాదారులు 'ఆధార్'ను వినియోగించాల్సిందే. నకిలీ ఖాతాలను అరికట్టేందుకు 'ఆధార్'ను ప్రాతిపదికగా తీసుకోవాలని సామాజిక మీడియా దిగ్గజం అయిన 'ఫేస్‌బుక్' నిర్ణయించింది. సెల్‌ఫోన్ ద్వారా కొత్తగా ఫేస్‌బుక్‌లో ఖాతాలు తెరిచేవారు ఇక 'ఆధార్'లోని తమ పేరును ఇవ్వాల్సి ఉంటుంది. 'ఆధార్'లోని పేరు మాత్రం ఇవ్వడం వల్ల నకిలీ ఖాతాలను అరికట్టే అవకాశం ఉంటుంది. కుటుంబ సభ్యులు, సన్నిహితులు సులభంగా తమ వారిని 'ఫేస్‌బుక్'లో సులువుగా గుర్తించేందుకు 'ఆధార్' దోహదం చేస్తుంది. తాము 'ఆధార్'లో ఉన్న పేరు మాత్రమే అడుగుతున్నామని, ఇతర వివరాలను తెలపాల్సిన అవసరం లేనందున గోప్యతకు ఎలాంటి భంగం వాటిల్లదని 'ఫేస్‌బుక్' యాజమాన్యం భరోసా ఇస్తోంది. ఖాతాదారులు ఆధార్‌లోని తమ పేర్లను ఇవ్వడం ప్రస్తుతానికి ఐచ్ఛికమే అయినప్పటికీ త్వరలో దీనిని తప్పనిసరి చేసే అవకాశం లేకపోలేదు. ఫేస్‌బుక్‌లో తప్పుడు ఖాతాలు కుప్పలుతెప్పలుగా ఉంటున్నందున 'ఆధార్' వినియోగంతో వాటి బెడద కొంతవరకైనా తగ్గే వీలుంటుందని 'ఫేస్‌బుక్' అంచనా వేస్తోంది.





ఈ ల్యాపీ ధర రూ.7 లక్షలు!

ల్యాపీ దిగ్గజం ఏసర్ ప్రీడేటర్ 21 ఎక్స్ పేరుతో అత్యంత ఖరీదైన ధరలో నూతన గేమింగ్ ల్యాప్‌టాప్‌ను లాంచ్ చేసింది. బెర్లిన్‌లో 2016లో ఐఎఫ్ఏలో తొలుత దీన్ని లాంచ్ చసిన తర్వాత మార్కెట్‌లోకి దీన్ని ప్రవేశపెట్టింది. కాగా కర్వ్‌డ్ స్క్రీన్ డిస్‌ప్లేతో వచ్చిన ప్రపంచపు తొలి గేమింగ్ ల్యాప్‌టాప్ ఇదే కావడం విశేషం. ఈ ల్యాప్‌టాప్‌లో వీడియో గేమ్ ఆడుతుంటే థియేటర్‌లో ఉన్నట్లు అనుభూతి ఉంటుంది. ఫ్లిప్‌కార్ట్‌లో ప్రీ ఆర్డర్‌కు వచ్చిన ఈ ల్యాప్‌టాప్ ఇప్పటికే అందుబాటులోకి రానుంది. ఈ ల్యాప్‌టాప్ ఖరీదు రూ.6,99,999గా కంపెనీ పేర్కొంది. అమెరికాలో పోలిస్తే భారత్‌లో దీని ధర ఎక్కువగా ఉంది. అమెరికాలో దీని ధర 8,999 డాలర్లు అంటే సుమారుగా రూ.5,77,000గా ఉంది. విండోస్ 10 ఆధారితంగా ఇది రూపొందింది.

ఏసర్ ప్రిడేటర్ 21 ఎక్స్ ఫీచర్లు

21అంగుళాల కర్వ్‌డ్ ఫుల్ హెచ్‌డి అల్ట్రా వైడ్ ఐపిఎస్ డిస్‌ప్లే, జి-సింక్ సపోర్టు, 2560/1080 పిక్సెల్ రెజల్యూషన్ 7వ జనరేషన్ ఇంటెల్ కోర్ ఐ7- 7820 హెచ్‌కె ప్రాసెసర్, 64 జిబి ర్యామ్, 512 జిబితో వర్క్‌చేసే నాలుగు సపరేట్ డ్రైవ్స్, 1 టిజిబి ఆర్‌పిఎం హార్డ్ డ్రైవ్ 8.5 కిలోగ్రాముల బరువు, ఆరు బిల్డ్ ఇన్ స్టీరియో స్పీకర్లు.



సోనీ సరికొత్త మోడల్

ఎక్స్-ఎ2 అల్ట్రా' పేరుతో మొబైల్ దిగ్గజం సోనీ సంస్థ సరికొత్త స్మార్ట్‌ఫోన్‌ను మార్కెట్‌లోకి తీసుకొస్తోంది. ఈ ఏడాది బార్సిలోనాలో జరిగే 'మొబైల్ వరల్డ్ కాంగ్రెస్' సందర్భంగా ఈ ఫోన్‌ను ఆవిష్కరిస్తారని సమాచారం. ఎక్స్‌పీరియా ఎక్స్ ఎ1 అల్ట్రాకు పొడిగింపుగా వస్తున్న ఈ విభిన్న స్మార్ట్‌ఫోన్ 6 అంగుళాల డిస్‌ప్లే కలిగి వుంటుంది.

ఇందులోని ఫీచర్లు..

1920/1080 పిక్సెల్ రిజల్యూషన్ క్వాల్‌కామ్ స్నాప్ డ్రాగన్ 630 ప్రాసెసర్, 4జిబి రామ్, 64 జిబి ఇంటర్నల్ స్టోరేజ్, ఆండ్రాయిడ్ 8.0 ఓరియో, 2 ఫ్రంట్ ఫేసింగ్ కెమెరాలు.

కొన్ని నెలల క్రితమే భారత్‌లో విడుదలైన ఎక్స్‌పీరియో ఎక్స్‌జెడ్1 స్మార్ట్‌ఫోన్ నీలం, నలుపు, గులాబీ, సిల్వర్ రంగుల్లో వినియోగదారులకు అందుబాటులో ఉంటుంది. 3డీ క్రియేటర్‌తో విడుదలైన ఈ తొలి మొబైల్ ధరను రూ.44,990/-గా నిర్ణయించారు. ఇందులో 3డీ స్కానర్లను నేరుగా సృష్టించవచ్చు. 3డీ ప్రింటర్‌తో అనుసంధానం చేయవచ్చు. ఐపి 68 సర్టిఫికేషన్‌తో వాటర్, డస్ట్ రెసిసెన్స్ ఫీచర్లు ఇందులో అదనపు ఆకర్షణలు. 5.2 అంగుళాల ఫుల్ హెచ్‌డిఆర్ డిస్‌ప్లే, 1920/1080 పిక్సెల్ రిజల్యూషన్, ఆండ్రాయిడ్ ఓరియో 8.0 19ఎం.పి మోషన్ కెమెరా, 13 ఎంపి సెల్ఫీ కెమెరా, 4జిబి రామ్, 64 జిబి స్టోరేజ్‌ని 256దాకా విస్తరించుకునే సదుపాయం, 2700 ఎంఏహెచ్ బాటరీ ఎక్స్‌పీరియా ఎక్స్‌జెడ్1లోని అదనపు ఫీచర్లు.

లెనెవో ఫుల్ స్క్రీన్ డిస్‌ప్లే ఫోన్

లెనెవో సంస్థ మార్కెట్‌లో తన తొలి ఫుల్ స్క్రీన్ డిస్‌ప్లే ఫోన్‌ను కె320 టి పేరుతో విడుదల చేసింది. ఈనెల 4నుంచే ఈ ఫోన్ కోసం వెబ్‌సైట్‌లో రిజిస్ట్రేషన్ మొదలయ్యాయి. భారత కరెన్సీలో ఈ ఫోన్ విలువ రూ.9774/-. హారిజాంటల్ డ్యూయెల్ రియర్ ఫేసింగ్ కెమెరా, ఫింగర్ ప్రింట్ సెన్సర్ వంటి ఫీచర్లు ఇందులో ఉన్నాయి. వెనుకభాగంలో డ్యూయెల్ కెమెరా సెటప్‌తోపాటు డిజైనింగ్ డిస్‌ప్లే ఈ ఫోన్‌కు పూర్తి స్థాయి పాలి కార్బోనేట్ హంగులను సమకూరుస్తుంది. డ్యూయెల్ కెమెరా, ఫింగర్ ప్రింట్ సెన్సర్లు ఫోన్‌కు కొత్త అందాన్ని తీసుకొస్తాయి. ఫోన్ ముందుభాగంలో 5.7 అంగుళాల ఐపిఎస్ డిస్‌ప్లే ఫర్ఫెక్ట్ విజువల్స్‌ను అందిస్తుంది. 2.5డి కర్వ్‌డ్ గ్లాస్ ఫోన్ డిస్‌ప్లేకు రక్షణ కవచంలా వుంటుంది. ఈ ఫోన్ 1.3 గిగా హెర్ట్జ క్వాడ్ కోర్ స్ప్రెడ్ ట్రమ్ ప్రాసెసర్‌పై రన్ అవుతుంది. దీనికి 2జిబి రామ్, 16 జిబి స్టోరేజ్ అందుబాటులో వుంటాయి. మైక్రో ఎస్‌డి స్లాట్ ద్వారా స్టోరేజ్ కెపాసిటీని 128 జిబి వరకు విస్తరించుకోవచ్చు. ఫోన్ వెనుక భాగంలో 8 మెగా పిక్సెల్, 2 మెగా పిక్సెల్, ముందు భాగంలో 8 మెగా పిక్సెల్ కెమెరా సెన్సర్లు వుంటాయి. ఈ ఫోన్ 3,000 ఎంఏహెచ్ బ్యాటరీపై పనిచేస్తుంది. డ్యూయెల్ సిమ్ కనెక్టివిటీ, 2జి, 3జి, 4జి, వైఫై, జిపిఎస్ బ్లూటూత్ వంటి స్టాండర్డ్ కనెక్టివిటీ ఫీచర్స్ అదనపు ఆకర్షణ. కంపాస్ మెగ్నటోమీటర్, ప్రాక్సిమిటి, యాక్సిలరోమీటర్, గ్రావిటి వంటి సెన్సర్లు వుంటాయి. ఈ ఫోన్ బరువు 153.8 గ్రాములు.





తారామణి సెన్సార్ పూర్తి

వసంత్‌కుమార్, ఆండ్రియా, అంజలి ప్రధాన తారాగణంగా డి.వి సినీ క్రియేషన్స్ పతాకంపై రామ్ దర్శకత్వంలో డి.వెంకటేష్ అందిస్తున్న చిత్రం 'తారామణి'. ఈ చిత్రం సెన్సార్ కార్యక్రమాలు పూర్తిచేసుకుని ఫిబ్రవరి నెలాఖరున విడుదలకు సిద్ధమవుతోంది. ఈ సందర్భంగా నిర్మాత డి.వెంకటేష్ మాట్లాడుతూ- తమిళంలో అత్యధిక వసూళ్లు సాధించిన ఈ చిత్రం నేటి యువత ప్రవర్తనకు అద్దంపట్టేలా వుంటుందని తెలిపారు. మంచి సందేశం వున్న ఈ చిత్రాన్ని తెలుగు ప్రేక్షకులకు అందించే ప్రయత్నం చేస్తున్నామని, తమిళంలో కన్నా, తెలుగులో భారీ విజయం సాధిస్తుందన్న నమ్మకం వుందని, సెన్సార్ వారు 'ఎ' సర్టిఫికెట్ అందించారని, త్వరలో మరిన్ని వివరాలు తెలియజేస్తామని ఆయన అన్నారు. ఈ చిత్రానికి సంగీతం: యువన్ శంకర్‌రాజా, కెమెరా: తేని ఈశ్వర్, దర్శకత్వం: రామ్.

సిద్ధంగా ఉన్నా: ఆర్పీ

చిత్రం, జయం, నువ్వు-నేను, సంతోషం, మనసంతా నువ్వే, నువ్వు లేక నేను లేను వంటి చిత్రాలకు సంగీతం అందించిన ఆర్.పి.పట్నాయక్ దర్శక నిర్మాతగా మారి చిత్రాలు రూపొందించిన తరువాత సంగీత దర్శకుడిగా ప్రేక్షకులకు దూరమయ్యాడు. అయితే సంగీత ప్రియులకు ఆర్.పి ఇప్పుడు 'నీతో ఏదో చెప్పాలి వుంది' అనే మెలోడీ పాటతో పలకరించాడు. ఈ వీడియో సాంగ్‌ను గురువారం హైదరాబాద్‌లో విడుదల చేశారు. కోటి విడుదలచేసిన ఈ పాటకు సంగీతమే కాక, సాహిత్యాన్ని కూడా ఆర్.పి అందించడం విశేషం. సత్యా యామిని, అనుదీప్ నటించిన ఈ పాట ఈ నెల 5 నుండి ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉండనుంది. ఈ సందర్భంగా కోటి మాట్లాడుతూ- కొత్త ఏడాదిలో కొత్త కాన్సెప్టుతో ఆర్.పి ముందుకు రావడం ఆనందదాయకమని, తాను కూడా ఇకనుండి సంగీతం చేస్తాననడం సంగీత దర్శకుడిగా తనకు ఆనందాన్నిచ్చిందని తెలిపారు. 2004లో ఇకపై తాను వేరే చిత్రాలకు సంగీతం అందించనని ప్రకటించగానే సంగీత దర్శకులు కోటి తనను మందలించారని, కానీ అప్పటి పరిస్థితులు వేరుగా వున్నాయని, తన సంగీతాభిమానులను తాను ఇన్నాళ్లూ దూరం చేసుకున్నానని తెలిపారు. కానీ ఈ ఏడాదినుండి తాను సంగీతం అందించడానికి సిద్ధంగా ఉన్నానని అన్నారు. ఈ కార్యక్రమంలో రఘు కుంచె, విజయలక్ష్మి, వేణు, రవివర్మ, జెన్నీ సురేష్, యామిని, అనుదీప్, మనీషా పాల్గొన్నారు.





మార్చి నుండి నితిన్

నితిన్ ప్రస్తుతం కృష్ణచైతన్య దర్శకత్వంలో నటిస్తున్నాడు. గుర్తుందా సీతాకాలం అన్న టైటిల్‌తో రూపొందుతున్న ఈ చిత్రానికి సంబంధించిన షూటింగ్ ముగింపు దశలో వుంది. తాజాగా నితిన్, సతీష్ వేగేశ్న దర్శకత్వంలో శ్రీనివాసకళ్యాణం చిత్రంలో కూడా నటించనున్న సంగతి తెలిసిందే. ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కుతున్న ఈ చిత్రం మార్చి నుండి మొదలుకానుంది. సమీర్‌రెడ్డి కెమెరా, మిక్కీ జె మేయర్ సంగీతం అందిస్తున్న ఈ చిత్రాన్ని శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ పతాకంపై దిల్‌రాజు రూపొందిస్తున్నాడు. కథానాయికగా పూజా హెగ్డే నటించనుంది.

యువ హీరోలకు పోటీగా..

-సి.కల్యాణ్



బాలకృష్ణ సినిమా సినిమాకు వేగం పెంచాడు. ఇప్పటికే 100 సినిమాలు పూర్తిచేసుకున్న ఆయన తన 102వ చిత్రం 'జై సింహా' షూటింగ్ కూడా పూర్తిచేశాడు. తమిళ దర్శకుడు కె.ఎస్.రవికుమార్ నేతృత్వంలో తెరకెక్కిన ఈ చిత్రం సంక్రాంతి కానుకగా విడుదలకు సిద్ధమవుతోంది. నయనతార కథానాయికగా నటించిన ఈ చిత్రాన్ని సి.కె. ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై సి.కల్యాణ్ రూపొందించారు. అన్ని కార్యక్రమాలు పూర్తిచేసి ఈనెల 12న విడుదలకానుంది ఈ సందర్భంగా 'జై సింహా' గూర్చి సి.కల్యాణ్ పలు విశేషాలు తెలిపారు.

జై సింహా ఎంతవరకు వచ్చాడు?

- దాదాపు అన్నీ పూర్తయినట్లే. ఈ రోజు సినిమా సెన్సార్‌కు వెళ్లనుంది. సినిమాపై చాలా కాన్ఫిడెంట్‌గా వున్నాం. ఈ సంక్రాంతి సందడికి సిద్ధమవుతున్నాడు.

జైసింహా ఎలా ఉండబోతున్నాడు?

- చిత్రం విషయంలో బాలకృష్ణ చాలా సహకరించాడు. అందువల్లే అనుకున్నట్టుగా పూర్తయింది. ఆయనది పవర్‌ఫుల్ రోల్. దాని గురించి చెబితే కథ తెలిసిపోతుంది కాబట్టి చెప్పడంలేదు. మరి కొన్ని రోజుల్లో మీరే చూస్తారు. అలాగే ఈ చిత్రాన్ని నా బ్యానర్‌లో చేయడానికి ఆయన ఒప్పుకోవడం, మంచి దర్శకుడు, కథ కుదరడంతో బాలయ్యను కొత్తగా చూస్తారు ప్రేక్షకులు. ఇన్నేళ్ల కెరియర్‌లో ఆయన పాత్ర సరికొత్తగా వుంటుందనేది నిజం.

హీరోయిన్ గురించి?

- నయనతారతో బాలకృష్ణ కెమిస్ట్రీ బాగా వుంటుంది. వాళ్లిద్దరిదీ సక్సెస్‌ఫుల్ కాంబినేషన్. నిజంగా ఈ సినిమా కోసం నయనతారకు డేట్స్ లేవు. ముందు కుదరదు అని చెప్పినా కథ విన్న తరువాత నిర్ణయం చెప్పమని అడిగాం. కథ వినగానే డేట్స్ అడ్జెస్ట్ చేశారు.

దర్శకుడు గురించి?

- కె.ఎస్.రవికుమార్ గురించి కొత్తగా చెప్పేదేముంది. తమిళంలో పెద్ద దర్శకుడాయన. ఎన్నో విజయవంతమైన చిత్రాలు తీశాడు. సినిమా విషయంలో ఆయన కాన్ఫిడెంట్‌తో వున్నాడు. ఈ సినిమాతో మరోసారి మంచి దర్శకుడిగా నిరూపించుకుంటాడు.

బడ్జెట్ ఎక్కువైందా?

- అవును. ముందే ఎక్కువ ఖర్చుపెడదాం అనుకున్నాం. అనుకున్నదానికన్నా ఎక్కువ ఖర్చుపెట్టాల్సి వచ్చింది. ఔట్‌పుట్ కూడా అలాగే వచ్చింది. కథ డిమాండ్ చేస్తే దానికి తగ్గట్టు పెట్టాలి. లేదంటే క్వాలిటీ దెబ్బతింటుంది అనుకున్నాం.

మిగతా పాత్రలు?

- బాలకృష్ణతోపాటుగా నయనతార, ప్రకాష్‌రాజ్, హరిప్రియ పాత్రలు కీలకంగా వుంటాయి. ప్రకాష్‌రాజ్, నయనతార చేయనంటే ఈ సినిమాను ఆపేద్దాం అనుకున్నాం. ఎందుకంటే ఈ పాత్రలకు వాళ్లు అయితేనే కరెక్ట్. ప్రకాష్‌రాజ్ డేట్స్ కుదరకపోయినా ఎలాగో సహకరించాడు. సినిమా చూసిన తరువాత వారి నటన పాత్రలు గుర్తుండిపోతాయి.

సంక్రాంతి పోటీకి?

- ఔను పోటీ వుంది. పోటీలో నిలబడే సత్తా ఈ చిత్రానికి వుంది. ఫుల్ లెంగ్త్ మాస్ అండ్ కమర్షియల్ ఎంటర్‌టైనర్. అందరికీ నచ్చుతుంది.

బాలకృష్ణ డాన్సులు?

- నేను వద్దన్నా ఎన్నో కష్టమైన మూమెంట్స్ ఆయన చేశారు. ఈ వయసులో కూడా బన్నీ, చరణ్‌లాంటి హీరోలు వేసే స్టెప్పులు వేశారు. అభిమానులకు కొత్త ఉత్సాహాన్ని ఇస్తాయి డాన్సులు.

'జై సింహా' లో హైలెట్స్?

- కుంభకోణంలో ఓ ఎపిసోడ్ తీశాం. అందులో దాదాపు 2వేలమంది పురోహితులు నటించారు. సినిమా హైలెట్స్‌లో ఇది ఒకటి. బ్రాహ్మణుల గురించి హీరో చెప్పే డైలాగులు అదిరిపోతాయి. ఈ చిత్రంతో వారందరూ బాలయ్యకు అభిమానులవుతారు. అలాగే వైజాగ్‌లో జరిగే ఫ్లాష్ బ్యాక్ ఎపిసోడ్ ఇంకా పెద్ద హైలెట్. క్లైమాక్స్ ఎపిసోడ్ అందరూ లేచి చప్పట్లు కొట్టేలా వుంటుంది.

తదుపరి చిత్రాలు?

- ప్రస్తుతం సాయిధరమ్‌తేజ్-వినాయక్‌ల కాంబినేషన్‌లో 'ఇంటిలిజెంట్' షూటింగ్ సాగుతోంది. ఫిబ్రవరి 9న రిలీజ్ కానుంది. రానా, రెజీనాలతో 1945 అనే సినిమా చేస్తున్నా. ఈ సినిమా మూడు భాషల్లో విడుదల కానుంది. సంఘమిత్ర ఫిలింసిటీలో కార్యక్రమాలు జరుగుతున్నాయి.

- శ్రీ

అశ్వమేధ గాయత్రీ మహాయజ్ఞం..

సర్వశుభకరం



ప్రపంచ హితైషులు భారతీయులు సర్వేజనాసుఖినోభవన్తు అనేది వారి నాదం వేదం.

కనుకనే సర్వజనులు సులక్షణంగా ఉండాలని, సర్వజగత్తు సస్యశ్యామలంగా ఉండాలని వేదం కోరుకోమని చెబుతుంది. వేదాన్ని పరమ ప్రమాణంగా భావించే హైందవులు సర్వజనుల సుభిక్షత కోసం యజ్ఞాలు, యాగాలు చేయడం పూర్వకాలంనుంచీ చేస్తూ వస్తున్నారు.

యుగాలు మారినా, సమాజాలు మారినా భారతీయుల జీవనాడి ఐకత్యారాగాన్నే ఆలపిస్తున్నది. సర్వజగత్తుసుఖంగా సంతోషంగా పురోభివృద్ధి చెందాలని కోరుకుంటుంది. అందుకే ఆ వేదకాలంనాటి యజ్ఞాలను యాగాలను ప్రభుత్వమూ, స్వచ్ఛంధ సంస్థలూ చేయడానికి నేడు కూడా సంకల్పిస్తూనే ఉన్నాయి. ఆ యజ్ఞనిర్వహణలో కృతకృత్యులు అవుతూనే ఉన్నారు.

అటువంటి సర్వజనకళ్యాణార్థం నేడు అఖిల విశ్వగాయత్రీ పరివార్ శాంతికుంజ్,హరిద్వార్ వారు 5-8జనవరి 2018లోఎన్.ఆర్,ఐ. వైద్యకళాశాల ప్రాంగణంలో అశ్వమేథ గాయత్రీ మహాయజ్ఞం నిర్వహించదలిచారు. ఈ యజ్ఞం ద్వారా విశ్వశాంతి, మానవాళి కళ్యాణం దానితోపాటుగా నేడు ఉక్కిరిబిక్కిరి చేస్తున్న వాతావరణ కాలుష్యాన్ని నియంత్రించడం జరగాలన్న సదుద్దేశంతో ఈ యజ్ఞనిర్వహణను శ్రీవేదమూర్తి తపోనిష్ఠ పండిత శ్రీరామ శర్మ ఆచార్యగారి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు.

ఈ గాయత్రీ అశ్వమేధ మహాయజ్ఞంలో 501 కుండములతో కూడిన యజ్ఞశాల దేవ సంస్కృతిని దర్శింపచేస్తుంది. ఈ సమయంలోనే ఘనులు వేద పండితులైన వారి నిర్వహణలో గొప్ప ఆధ్యాత్మిక ప్రవచనములు ప్రవచించబడుతాయి.

ఈమహాయజ్ఞనిర్వహణ సజావుగా సాగడానికి గాను యజ్ఞానికి దాదాపుగా 9మాసాల ముందునుంచే ప్రయాజ యజ్ఞ ప్రక్రియ ను నిర్వహిస్తూ విశ్వంలోని సూక్ష్మ వాతావరణాన్ని శుద్ధి చేశారు. సామూహికంగా ప్రజలను జాగృత పరిచారు. ఈ యజ్ఞం ద్వారా ప్రజలకు మేలే కాక వారిలో నిద్రాణమై యున్న ప్రతిభాపాటవాలను మేల్కొపడం, వారిలో సభ్యతా సంస్కారాలను, మానవత్వాన్ని వృద్ధిగావించడం అనేవి యజ్ఞనిర్వహణకు ముందునుంచే చేస్తూ వస్తున్న ప్రయాజ యజ్ఞప్రక్రియ వల్ల జరుగుతాయి.

అసలు ఈ యజ్ఞం అంటే ఏమిటి? అనేది తెలుసుకొందాం.

యజ అనే ధాతువు నుండి ఉత్పన్నమైన శబ్దం యజ్ఞం. యజ అంటే బలి లేక సమర్పించుట అనే అర్థాలున్నాయి. యజ్ఞము అన్న పదము 'య','జ', 'న' అన్న మూడు అక్షరముల కలయిక. మనము చేసే ఏ పనిలోనైనా మూడు విధాలుగా మనకు కనిపిస్తూనే ఉంటాయి. అంటే ఉత్పాదన, ఉపార్జన, వితరణ ఉత్పాదన అంటే ఉత్పత్తి, దాని ద్వారా ఉపార్జన అంటే సంపాదన, ఆ తరువాత వచ్చిన సంపాదనను ఉత్పత్తి చేసిన వ్యక్తి ఒక్కడే కూర్చుని తినడు కదా తన వారికైనా ఇతరులకైనా పంచిపెట్టటం అనేది సహజంగా జరిగే క్రియనే అదే వితరణ. ప్రాణకోటి అంతా శుభప్రదంగాను, సుఖసంతోషాలకు ఉండాలనే చేసే ఏ క్రియ యైనా అది యజ్ఞంతో సమానమే అంటారు పెద్దలు.

పూర్వకాలం నుంచి చక్రవర్తులు, రాజులు, మహర్షులు లాంటి వారు సర్వులకు శుభం కలగాలని యజ్ఞయాగాదులను నిర్వహించేవారు. అట్లాంటి వాటిలో అశ్వమేధ యజ్ఞం మహత్తరమైనదిగా చెబుతారు.

అశ్వం గతిశీలతకు, శౌర్య పరాక్రమాలకు ప్రతిరూపమైతే మేధా అనే పదం మేధాశక్తికి, శ్రేష్ఠబుద్ధికి ప్రతీక. అందువల్ల అశ్వమేధ యజ్ఞం .. శౌర్యపరాక్రమముల శక్తి, కళ్యాణకరమైన మేధ శక్తుల సంయోగ సంగమమం అని అర్థం.

ఇపుడు జరపాలనుకొన్న అశ్వమేధ గాయత్రీమహాయజ్ఞం ద్వారా మనిషిలో నిద్రాణమైపోతున్న మానవత్వాన్ని మేల్కొలపడం, ఇతర ప్రాణుల పట్ల జాలి దయకలిగి ఉండడంతో పాటుగా భౌతిక వాతావరణ, పర్యావరణంలో కూడా శుద్ధత సాధించడం ముఖ్యమైన ప్రయోజనం. ఈ యజ్ఞం లో వాడబడే సమిధలన్నీ కూడా జీవకోటికి మేలు చేసే ఔషధీయగుణాలు కలిగున్నాయి. వీటిని వేదమంత్రోచ్చారణతో అగ్నికి సమర్పించడం ద్వారా శుభ శబ్దతరంగాలు వాతావరణంలోకలసి సూక్ష్మవాతావరణాన్ని పవిత్రమొనరుస్తాయి. దీనిద్వారా త్రిగుణ సహితుడైన మానవుడు సత్వగుణోపేతుడుగా ప్రజ్వలింపబడుతాడు. మానవత్వం దైవత్వంగా మారడానికి ఈ యజ్ఞప్రక్రియలోని శబ్దతరంగాలు, హవిస్సు గా సమర్పించబడే పదార్థమూ రెండూ తేజోవంతమైన శక్తులుగా ఉంటాయి.

యజ్ఞం- సామాజిక వ్యాఖ

యజ్ఞం - అద్భుత విజ్ఞానం

యజ్ఞగుండముల ఆకృతి: వివిధ యజ్ఞాల నిర్వహణ కోసం వివిధ యజ్ఞకుండములను ఏర్పరచడం సంప్రదాయం. ఇవి యోని, అర్ధ చంద్ర, త్రికోణ, వృత్త, సమ అష్టాస్ర, సమషడస్ర,చతుష్కోణాస్త్ర, పద్మ కుండ లాకృతుల వల్ల ఉత్పన్నమయ్యే వేడి వాతావరణంలోని శీతోష్ణస్థితులను అదుపు చేస్తాయి.

2. సమిధలు: ప్రత్యేకమైన సమిధలను అగ్నికి సమర్పించడంతో ఆ సమిధలు +అగ్ని మధ్య రసాయినిక మార్పులు జరగడం సహజం. ఈ సమిధల గుణధర్మాల్లో మార్పుజరగడం అది సర్వజనానీకానికి అందటం అనేది సహజంగా జరిగిపోయే ప్రక్రియే.

3. హవన సామగ్రి: హవన సామగ్రిని మండించినపుడు ఆడిక్లైడ్స్, ఆమైన్స్, సైక్లిక్ శ్రేణిలో అనేక పదారాతలు ఏర్పడుతాయి. వీటికి జత చేసే నెయ్యి అగ్ని ద్వారా ఏర్పడే వేడిని నియంత్రిస్తుంది. భాష్పరూపంలో పరిణితి పొంది సామగ్రి సూక్ష్మ కణాలను అన్ని వైపుల నుంచి

ఆవహించి దాని మీ ద ఋధాత్మక విద్యుచ్ఛక్తిని ఏర్పరుస్తుంది.

ఈ సమిధలను అగ్ని వ్రేల్చడం వల్ల మానవునిలో రోగ నిరోధక శక్తి పెరుగుతుంది. సాత్వికగుణలక్షణాలు పెరుగుతాయి. పర్యావరణంలోని కాలుష్యాన్ని నియంత్రిస్తుంది. ప్రాణవాయువు పెరుగుతుంది. అనేక రకాల ప్రమాదకరమైన సూక్ష్మ జీవులు నశిస్తాయి. మంత్రోచ్చారణ వల్ల ఉచ్చారణ చేసేవారిలోను, వినేవారిలోనూ పవిత్రత చేకూరుతుంది. మానసిక వికాసం కలిగి మానసికానందం కలుగుతుంది. దానివల్ల ఎన్నోమానసిక రోగాలు దూరమవుతాయి. ఈ మానసికానందం పలువురికి కలగడంతో విశ్వశాంతి ఏర్పడుతుంది. జనుల్లో సమబుద్ధి వస్తుంది. సమున్నతి, సమృద్ధి ఏర్పడడంతో అందరూ సుఖశాంతులతో వర్ధిల్లుతారు. మహీధర భాష్యములో అశ్వమేధ యజ్ఞం వల్ల సంపూర్ణ సుఖము లభిస్తుందని ఇంద్రుడితో సహా అందరూ దేవతలు, 12 గురు ఆదిత్యులు, 49 మరుద్గణములు ఔషధీ శక్తులను మేల్కొలిపి పర్యావరణాన్ని సంతులనం చేస్తారని వివరిస్తోంది. అశ్వమేధ గాయత్రీ యజ్ఞ నిర్వహణ ద్వారా అకాల మరణాలు ఆగిపోయి మానవులందరికీ ఆయుర్వృద్ధి జరుగుతుంది.

యజ్ఞ ప్రక్రియ : ఇంతటి ప్రశస్తి చెందిన ఫలాలను ఇచ్చే యజ్ఞప్రక్రియ ఏవిధంగా జరుగుతుందో చూద్దాం.

యజ్ఞసంసద్: యజ్ఞమంటేనే మనో, భావ, మంత్ర, క్రియా విజ్ఞానముల సంగమమం. దివ్యచేతనకు, సృష్టిగత పరమాత్మ చేతనతో సంబంధం ఏర్పరచగలిగే దివ్యద్వారమే యజ్ఞ సంసద్.

ప్రతీకలు- స్థాపన: సహస్రకుండ అశ్వమేధ యజ్ఞశాలను దివ్య చిహ్నములు, చక్రములు, దేవవిగ్రహములతో అలంకరిస్తారు. యజ్ఞశాలకు నలువైపులా దేవతలు విచ్చేయడానికి స్వాగత దివ్యద్వారాలను ఏర్పరుస్తారు. తోరణ, శూల శంఖచక్రఅదాపద్మచిహ్నములుంటాయి. పూర్వదిశలో ఎరుపురంగులో శంఖము,దక్షిణ దిశలో నలుపురంగులో చక్రము, పశ్చిమ దిశలో తెలుపురంగులో గద, ఉత్తరాన పసుపు రంగులో పద్మము నిలుపుతారు. నాలుగుద్వారాల వద్ద ఎనిమిదిమంది దేవద్వారపాలకులుంటారు. జయవిజయలు, భద్రక,సుభద్రకలు, ఆనంద విశ్వరూపులు, ధృవసుప్రసన్నులు అనేవారు ఉంటారు. ఈ ఎనిమిది దిశల్లోను దేవశక్తుల ప్రతీక పతాకాలు స్థాపిస్తారు. పూర్వదిశలో ఇంద్రుని వాహనం ఏనుగు, అగ్నికోణములో అగ్ని వాహనము మేక, దక్షిణ దిశలో యమునివాహనం మహిషము నైరుతిలో దుర్గవాహనం సింహము, పశ్చిమ దిశలో పశువాహనం మనకము, వాయువ్యములో చంద్రవాహనము లేడి, ఉత్తర దిశలో సూర్యవాహనం గుఱ్ఱము, ఈశాన్యములో శివవాహనం వృషభమును నిలుపుతారు. ఈశాన్య పూర్వదిశల మధ్యన బ్రహ్మవాహనం హంసు, నైరుతి పశ్చిమదిశ మధ్యలో అనంతదేవుని వాహనం గరుడుడు ఉంటారు.

ఎనిమంది దిక్పాలురులకు ప్రతీకగా ఎనిమిది ఏనుగులను నిలుపుతారు. ఆకాశము, పాతాళదిశ దిక్పాలకుల స్థాపన అదృశ్యమానం అవుతుంది.

యజ్ఞకుండముల ఏర్పాటు: పూర్వదిశలో చతురస కుండము (స్తంభన కొరకు) భోగము కొరకు అగ్నికోణములో యోనికుండము, మారణ ప్రయోగాలకు దక్షిణ దిశలలో అర్ధచంద్ర కుండము, నైరుతిలో త్రికోణము, శాంతికొరకు పశ్చిమదిశలో వృత్త కుండము, ఉచ్చా టనకు వాయువ్యంలో షడస్రకుండము, పౌష్టిక కర్మలకు ఉత్తర దిశలో పద్మకుండము, ముక్తికొరకు ఈశాన్యములో అష్టాస్రకుండము స్థాపిస్తారు.

సప్తఋషులు: ఉత్తర దిశలో గౌతముడు, ఈశాన్యంలో భరద్వాజుడు, పూర్వదిశలో విశ్వామిత్రుడు, అగ్నేయంలో కశ్యపుడు, దక్షిణములో జమదగ్ని, నైరుంలో వశిష్ఠుడు, పశ్చిమదిశలో అత్రి వాయువ్యంలో అరుంధతి ఉంటారు.

దేవ వేదిక: యజ్ఞశాలలో ముఖ్యదేవవేదికకు ముందు సర్వతో భద్ర చక్రము, దీనికి రెండువేపులా షోడశామాతృకాచక్రము, ద్వాదశ వినాయక చక్రము ఏర్పాటు చేస్తారు. యజ్ఞ శాల మధ్యలో నవగ్రహ చక్రము, ఈశాన్య దిశలో పంచోంకార వేదిక, వాయువ్యంలో క్షేత్రపాక చక్రము, అగ్నికోణములో యోగినీ చక్రము, నైరుతిలో వాస్తు వేదికను ఏర్పాటు చేస్తారు.

తత్వవేదికలు: ఆకాశ తత్వ ప్రతీకగా స్వస్థిక చిహ్న దేవ వేదిక ప్రక్కన ఉంటుంది. అగ్నికోణము, అగ్ని తత్వాన్ని, నైరుతిలో పృథ్వీతత్వం, వాయువ్యంలో వాయుతత్వం, ఈశాన్యంలో జలతత్వ వేదికలు ఏర్పాటు చేస్తారు.

యజ్ఞాచార్యులు: ఇతను సర్వాధ్యక్షుడు

ఋత్విక్కు: యజమానుల సమస్తకార్యకలాపాలను పర్యవేక్షిస్తూ యజ్ఞాన్ని నడిపించడం ఇతని బాధ్యత. ఋతిక్కుకు ముగ్గురు సహాయకారులు, 1. బ్రహ్మణాచ్ఛాంసి, : నిర్దేశములను పాటించేట్లు చేసేవాడు, 2. అగ్నీధ్ర: యజ్ఞాగ్ని : ఆహుతలను సంయోజన చేసే వారు,3. పోతా: పవిత్రత, స్వచ్ఛ త మొదలగువాటిని పర్యవేక్షించేవారు.

హోత: దేవతలను ఆహ్వానించే ప్రధాన పురోహితుడు, లేక స్వాగతాధ్యక్షుడు, ఇతనికి ముగ్గురు సహాయకులు 1. ప్రశస్తా, 2. అచ్చావాక్, 3. గ్రావస్థుత

అధ్వర్యు: సంపూర్ణ యజ్ఞ విధి విధానములు తెలిసి యజ్ఞక్రియలను సుసంచాలితము చేసేవాడు. ఇతనికి ముగ్గురు సహాయకులు1. ప్రతి ప్రస్థాతో, 2. నేష్ఠా, 3. ఉన్నేత.

ఉద్గాత: యజ్ఞంలో ఉండే దేవస్తుతులు గాన మంత్రాల శ్రేష్ఠుడు. ఇతనికీ ముగ్గురు సహాయకులు 1. ప్రస్థోత, ప్రతిహర్తా, సుబ్రహ్మణ్యం

సదస్య: విభిన్న వేదికల దగ్గర కూర్చుని యాజకులును చేసే తప్పులను సరిదిద్దుట వీరి బాధ్యత. **యాజకులు:** సాధన ద్వారా అంతఃకరణలో యజ్ఞభావము జాగృతము చేసుకొని భావనా పూర్వకంగా ఆహుతులు సమర్పించేవారు. ఇదంతా కేవలం శ్రద్ధాభక్తులతో చేస్తేనే యజ్ఞ ఫలము అందుతుంది.

బి.సి.హెచ్.వి.
(అశ్విని) సుబ్బారావు

నేటినుంచి 8 వరకు
ఎన్.ఆర్.ఐ వైద్యకళాశాల ప్రాంగణం
మంగళగిరి

నయనతార కర్తవ్యం



నార్త్‌స్టార్ ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై నయనతార ప్రధాన పాత్రలో శరత్‌మరార్ రూపొందించిన చిత్రం 'ఆరమ్'. ఈ చిత్రాన్ని తెలుగులో 'కర్తవ్యం' పేరుతో అనువాదం చేశారు. పొలిటికల్ డ్రామాగా తెరకెక్కిన ఈ సినిమాకు సంబంధించిన సెన్సార్ కార్యక్రమాలు పూర్తయ్యాయి. క్లీన్ యూ సర్టిఫికెట్ లభించిన ఈ చిత్రానికి గోపీ నైనర్ దర్శకత్వం వహించారు. నయనతార కెరీర్‌లోనే భారీ విజయం సాధించిన ఈ చిత్రం గురించి నిర్మాత శరత్ మరార్ మాట్లాడుతూ- ప్రస్తుతం నిర్మాణానంతర కార్యక్రమాలతో బిజీగా వుందని, త్వరలో విడుదల చేయడానికి అన్ని సన్నాహాలు చేస్తున్నామని తెలిపారు. విఘ్నేష్, రమేష్, సునులక్ష్మి, వినోదిని వైద్యనాథ్, రామచంద్రన్ దుర్రైరాజ్, ఆనంద్ కృష్ణన్ తదితరులు నటించిన ఈ చిత్రానికి కెమెరా: ఓంప్రకాష్, సంగీతం: జీబ్రాన్, ఎడిటింగ్: గోపీకృష్ణ, నిర్మాత: ఆర్.రవీంద్రన్, శరత్ మరార్, కథ, దర్శకత్వం: గోపీ నైనర్.